RNI No.TELTEL/2005/16755

# ప్రజాబలం

PRAJABALAM Telugu Daily తెలుగు దినపత్రిక

Website: prajabalam.in

Cell: 9292104449 / 9848384973

SRAVANTHI Enterprises

OFFSET PRINTERS



We undertake Printing of Daily News Papers

హైదరాబాద్ 13 అక్టోబర్ 2026 మంగళవారం | పేజీలు:12 | వెల రూ.2.00 | సంపుటి:22 | సంచిక:116

# ఎస్ఐఆర్ రగడ.. సుప్రీం మెట్లెక్కిన ఇండియా కూటమి నేతలు

**ఈసీ చేపట్టిన ఓటర్ల జాబితా సవరణపై సుప్రీంకోర్టులో పిటిషన్**

**రాహుల్ గాంధీ సహా 11 మంది 'ఇండియా' కూటమి నేతల పిటిషన్**

**ఓటర్లను భారీగా తొలగించారని, అవకతవకలు జరిగాయని ఆరోపణ**

**సీజేఐ సూచన మేరకే కోర్టును ఆశ్రయించినట్లు వెల్లడించిన రాహుల్**

**విపక్షాల ఆరోపణలు నిరాధారమంటూ బీజేపీ ఎదురుదాడి**



కేంద్ర ఎన్నికల సంఘం (ECI), ప్రతిపక్షాల మధ్య కొనసాగుతున్న వివాదం మరింత ముదిరింది. ఎన్నికల సంఘం చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ - SIR) ప్రక్రియలో భారీగా అవకతవకలు జరిగాయని ఆరోపిస్తూ 'ఇండియా' కూటమి నేతలు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ సహా 11 మంది సీనియర్ నేతలు సోమవారం సర్వోన్నత న్యాయస్థానంలో రిట్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌లో రాహుల్ గాంధీతో పాటు కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్, ఆర్జేడీ నేత తేజస్వి యాదవ్, తృణమూల్ కాంగ్రెస్ నేత సౌగతా రాయ్, శివసేన (యూబీటీ) నాయకుడు సంజయ్ రౌత్, సీపీఎం నేత ఎం.ఏ. బేబీ, సీపీఐ నేత డి. రాజా, జేఎంఎం నాయకురాలు మహువా మాఝీ, ఎన్సీపీ (ఎస్పీ) నేత సుప్రియా సూలే, ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ నేత ఈ.టీ. మహ్మద్ బషీర్ పిటిషనర్లుగా ఉన్నారు. ఎన్నికల సంఘం, ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్, ఇతర కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషిలను ప్రతివాదులుగా చేర్చారు. ఈ పిటిషన్ ప్రస్తుతం సుప్రీంకోర్టులో విచారణకు రావలసి ఉంది.



అంతకుముందు ఢిల్లీలోని కాంగ్రెస్ ప్రధాన కార్యాలయంలో రాహుల్ గాంధీ మీడియా సమావేశంలో మాట్లాడారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో జరుగుతున్న అక్రమాలపై భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) సూర్యకాంత్‌కు లేఖ రాశామని, అయితే అధికారికంగా పిటిషన్ ద్వారా కోర్టును ఆశ్రయించాలని ఆయన సూచించారని రాహుల్ వెల్లడించారు. ఎన్నికల ప్రక్రియ నిష్పాక్షికతపై, ప్రజాస్వామ్యంపై జరుగుతున్న దాడిపై ఆందోళన వ్యక్తం చేశారు. రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు తమతో కలిసి రావాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. అనంతరం సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ విపక్ష నేతలు సుప్రీంకోర్టు వైపు నిరసన ర్యాలీ చేపట్టారు.

విపక్షాల ఆరోపణలు నిరాధారం: బీజేపీ

'ఇండియా' కూటమి ఆరోపణలను బీజేపీ తీవ్రంగా ఖండించింది. ఈ వివాదాన్ని విపక్షాలు రాజకీయ ప్రదర్శనగా మార్చాయని బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి గురు ప్రకాశ్ పాశ్వాన్ విమర్శించారు. ఆయన ఐఏఎన్ఎస్‌తో మాట్లాడుతూ, "విపక్షాల ఆరోపణలు పూర్తిగా నిరాధారం. వారు అబద్ధాలు చెబుతున్నారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (SIR) రాజ్యాంగబద్ధతపై సుప్రీంకోర్టు ఇప్పటికే తీర్పు ఇచ్చింది" అని స్పష్టం చేశారు. అస్సాంలోని సిల్చార్, త్రిపుర, హిమాచల్ ప్రదేశ్‌లలో బ్యాలెట్ పేపర్లతో జరిగిన స్థానిక ఎన్నికల్లోనూ కాంగ్రెస్ ఓడిపోయిందని, దేశవ్యాప్తంగా ఎన్నికల్లో ఓడిపోతున్నందునే ఇలాంటి ఆరోపణలు చేస్తున్నారని ఆయన ఎద్దేవా చేశారు.

# కేంద్ర ప్రభుత్వం ఈసీని దుర్వినియోగం చేస్తోందన్న సీఎం రేవంత్

**ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ పేరుతో బీజేపీ వ్యతిరేకుల ఓట్ల తొలగిస్తున్నారని ఆరోపణ**

**సీఈసీ జ్ఞానేశ్ కుమార్ ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని విమర్శలు**



తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర ప్రభుత్వం, ఎన్నికల కమిషన్‌పై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. ఈడీ, సీబీఐ, ఐటీ సంస్థలు సరిపోవన్నట్లుగా ఇప్పుడు మోదీ సర్కార్ ఎన్నికల కమిషన్‌ను (ఈసీ) కూడా దుర్వినియోగం చేస్తోందని ఆయన ఆరోపించారు. ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు.

ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ (SIR) ప్రక్రియను అడ్డం పెట్టుకుని బీజేపీకి వ్యతిరేకంగా ఉన్నవారి ఓట్లను తొలగించే బాధ్యతను చీఫ్ ఎలక్షన్ కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్‌కు అప్పగించారని రేవంత్ రెడ్డి ఆరోపించారు. 1950లో ప్రజలకు ఓటు హక్కు కల్పించడానికి తీసుకొచ్చిన ఈ ప్రక్రియను, ఇప్పుడు బీజేపీ తన వ్యతిరేకుల ఓట్లను తొలగించడానికి వాడుకుంటోందని విమర్శించారు. ఈ చర్యల ద్వారా.. బీజేపీని వ్యతిరేకించే యువత, నిరుద్యోగులు, పేదలను లక్ష్యంగా చేసుకున్నారని ఆయన పేర్కొన్నారు. ఈసీలోని మిగతా ఇద్దరు కమిషనర్లు ఎస్ఐఆర్ ప్రక్రియలోని లోపాలను వ్యతిరేకించారని, దీనివల్ల జ్ఞానేశ్ కుమార్ ఏకపక్ష నిర్ణయాలు బయటపడ్డాయని రేవంత్ రెడ్డి తెలిపారు. అలాంటి అధికారిని తొలగించడానికి ప్రధాని నరేంద్ర మోదీకి అభ్యంతరం ఎందుకని ఆయన ప్రశ్నించారు. బీజేపీ మత, ప్రాంతీయ ప్రాతిపదికన ప్రజలను విభజించి, ధనవంతులు-బీజేపీ మద్దతుదారులు ఒకవైపు, పేదలు-గిరిజనులు-బీజేపీ వ్యతిరేకులు మరోవైపు అనేలా రెండు వర్గాలుగా చూస్తోందని ఆరోపించారు.



ఈ పరిస్థితిని మరో స్వాతంత్ర్య సంగ్రామంగా అభివర్ణించిన రేవంత్, రాహుల్ గాంధీ చేపట్టిన 'జ్ఞానేశ్ కుమార్ గో బ్యాక్' ఉద్యమం దేశాన్ని కాపాడుతుందని అన్నారు. గతంలో జ్ఞానేశ్ కుమార్ నియామకాన్ని రాహుల్ గాంధీ వ్యతిరేకించిన విషయాన్ని కూడా ఆయన ఈ సందర్భంగా గుర్తుచేశారు.

***ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ...***

బీజేపీ ప్రభుత్వం ఎస్ఐఆర్ ను అడ్డుపెట్టుకుని, తమకు వ్యతిరేకంగా ఉన్న అర్హులైన ఓటర్లను జాబితా నుంచి తొలగిస్తోందని, ఇది ఓట్ల దొంగతనమేనని తీవ్రంగా విమర్శించారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటున్నారని, ఎన్నికల సంఘం పక్షపాతంగా వ్యవహరి స్తోందని ఆరోపించారు.

సీఈసీని పదవి నుంచి తొలగించే వరకు తమ పోరాటం ఆగదని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. హిందుస్థాన్ టైమ్స్, పీటీఐ కథనాల ప్రకారం, సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు ఇండియా కూటమి నేతలు సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేయనున్నారని రాహుల్ గాంధీ వెల్లడించారు. ప్రజాస్వా మ్యంలో ఓట్లు తొలగించడం దారుణమని ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి అన్నారు. 'ఓట్ బచావో, దేశ్ బచావో' నినాదంతో ఈ దేశవ్యాప్త ఆందోళనను కాంగ్రెస్ ఉద్ధృతం చేసింది.

# సుప్రీం కోర్టును రాజకీయాల్లోకి లాగాలని చూడొద్దు: సీజేఐ



'ఓట్ల చోరీ' అంశంపై సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ కు వినతి పత్రం సమర్పించేందుకు సోమవారం సమయం ఇవ్వాలని కాంగ్రెస్ నేతలు సీజేఐను అభ్యర్థించారు. వారి విజ్ఞప్తిని జస్టిస్ సూర్యకాంత్ తిరస్కరించినట్లు వార్తలు వస్తున్నాయి.

ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్, ఓట్ల చోరీ అంశాలపై సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్‌కు వినతి పత్రం సమర్పించేందుకు సోమవారం సమయం ఇవ్వాలని కాంగ్రెస్ నేతలు సీజేఐను అభ్యర్థించారు. వారి విజ్ఞప్తిని జస్టిస్ సూర్యకాంత్ తిరస్కరించినట్లు వార్తలు వస్తున్నాయి. అయితే ఈ అంశంపై సీజేఐ స్పందించారు. ఇండి కూటమి నుంచి తనకు వచ్చిన అభ్యర్థనపై ఆదివారం రాత్రి కాంగ్రెస్ కీలక నేతలు ఖర్గే, రాహుల్ గాంధీలకు మెయిల్ పంపినట్లు వెల్లడించారు.

కేంద్ర ప్రధాన ఎన్నికల సంఘం విషయంలో వారు లేవనెత్తాలనుకున్న సమస్యలపై ఇప్పటికే సుప్రీంకోర్టులో విచారణ పెండింగ్‌లో ఉందని గుర్తు చేశారు. విచారణలో ఉన్న అంశాలపై సమావేశం కావడం అధికారాల విభజన సూత్రానికి విరుద్ధమని సీజేఐ తెలిపారు. కోర్టులో పెండింగ్‌లో ఉన్న అంశాలపై రాజకీయ నేతలతో సమావేశం కావాల్సిన అవసరం లేదని భావించి, వారికి అపాయింట్‌మెంట్ నిరాకరించినట్లు ఆయన వెల్లడించారు. ప్రభుత్వ పాలనకు సంబంధించిన విషయాల్లో న్యాయస్థానాలు జోక్యం చేసుకోబోవని.. కావాలంటే కాంగ్రెస్ నేతలు ఈ విషయంపై పిటిషన్ ద్వారానే తమను సంప్రదించవచ్చని సీజేఐ సూచించారు. సీఈసీ అంశాలకు సంబంధించిన విషయాలు రేపు(మంగళవారం) విచారణకు రానున్నాయని కూడా ఆయన పేర్కొన్నారు.

సుప్రీం కోర్టు తలుపులు ఎల్లప్పుడూ అందరి కోసం తెరిచే ఉంటాయన్నారు. అంతే కానీ కోర్టులను రాజకీయాల్లోకి లాగాలని చూడొద్దని ప్రతిపక్షాలకు సూచించారు. జాతీయ మానవ హక్కుల కమిషన్ వ్యవస్థాపక దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న సందర్భంలో సీజేఐ ఈ వ్యాఖ్యలు చేశారు. ఇదే సమావేశంలో 'నీరు-జీవన అమృతం' అనే అంశంపై సీజేఐ మాట్లాడుతూ.. కలుషిత జలాల వల్ల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. దానివల్ల ప్రజల ఆరోగ్యాలకు భారీ ముప్పు పొంచి ఉందన్నారు.

# బెజవాడ దుర్గమ్మను దర్శించుకోనున్న తమిళనాడు సీఎం విజయ్

**ఇంద్రకీలాద్రిపై కొలువుదీరిన దుర్గమ్మ వారిని తమిళనాడు ముఖ్యమంత్రి జోసఫ్ విజయ్ దర్శించుకోనున్నారు. మంగళవారం సాయంత్రం 4.30 గంటలకి అమ్మవారిని ఆయన దర్శించుకుంటారు.**

విజయవాడ, అక్టోబర్12: నగరంలో ఇంద్రకీలాద్రిపై కొలువుదీరిన దుర్గమ్మ వారిని తమిళనాడు ముఖ్యమంత్రి జోసఫ్ విజయ్ దర్శించుకోనున్నారు. మంగళవారం (13-10-2026) సాయంత్రం 4.30 గంటలకి అమ్మవారిని ఆయన దర్శించుకుంటారు. తమిళనాడు ముఖ్యమంత్రి కార్యాలయం (సీఎంవో) నుంచి సోమవారం ఇంద్రకీలాద్రికి సీఎం భద్రతా సిబ్బంది చేరుకున్నారు. ఈ సందర్భంగా సీఎం విజయ్ రూట్ మ్యాప్‌ను వారు పరిశీలించారు. మరో వైపు ఏపీలో సీఎం విజయ్ పర్యటన షెడ్యూల్‌ను తమిళనాడు సీఎం కార్యాలయం విడుదల చేసింది.



ఇంద్రకీలాద్రిపై దసరా నవరాత్రి వేడుకలు, విజయవాడ ఉత్సవ్ 2.0ను ఏపీ ప్రభుత్వం ఘనంగా నిర్వహిస్తుంది. ఈ వేడుకలకు రావాలంటూ తమిళనాడు సీఎం జోసఫ్ విజయ్‌ను ఏపీ టీడీపీ ఎంపీలు స్వయంగా కలిసి ఆహ్వానించారు. ఇటీవల చెన్నైలో సీఎం విజయ్‌ను ఎంపీలు కేశినేని చిన్ని, లావు శ్రీకృష్ణదేవరాయలు, మాగుంట శ్రీనివాసులు రెడ్డి, జీఎం హరీశ్ బాలయోగి కలిసిన సంగతి తెలిసిందే.

ప్రజాబలం

13 అక్టోబర్ 2026 మంగళవారం

# జ్ఞానేశ్ ఇష్యూలో కాక్రోచ్‌లకు కాంగ్రెస్ షాక్

కాక్రోచ్ జనతా పార్టీ నుంచి కాంగ్రెస్‌ను కాపాడుకునేందుకు రాహుల్ వేస్తున్న ఎత్తుగడలు ప్రస్తుతానికి తిరుగులేని ఫలితాలనిస్తున్నాయి. నీట్ పేపర్ లీకేజీ ఉద్యమం సందర్భంగా జంతర్ మంతర్ వద్ద బైఠాయించి, ఏకంగా కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాకు కారణమైన కాక్రోచ్ జనతా పార్టీ విపక్ష స్పేస్‌లో అప్పట్లో భారీ మైలేజీని కొల్లగొట్టింది. విద్యార్థి, యువజన ఉద్యమాలను తమ ఖాతాలో వేసుకుంటూ ఆ పార్టీ సృష్టించిన ప్రభంజనం కాంగ్రెస్ ఉనికికే సవాలుగా నిలిచింది. సరిగ్గా అదే అనుభవాన్ని దృష్టిలో పెట్టుకున్న హస్తం పార్టీ అగ్రనాయకత్వం.. కేంద్ర ఎన్నికల సంఘం వివాదంలో ఆ తప్పు మళ్లీ జరగకూడదని పక్కా వ్యూహంతో బరిలోకి దిగింది. సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌ను టార్గెట్ చేస్తూ కాక్రోచ్‌లు మొదలుపెట్టిన నిరసన స్వరాన్ని కాంగ్రెస్ తెలివిగా తన అధీనంలోకి తీసుకుంది.ప్రస్తుతం జాతీయ మీడియాలోనూ, సోషల్ మీడియా ట్రెండ్స్‌లోనూ కేవలం రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీల గురించే చర్చ సాగుతోంది. ఆకాశవాణి భవన్ ఆవరణలో 9 గంటల పాటు చెట్టు కింద బైఠాయించడం, జంతర్ మంతర్ వద్ద ప్రియాంక గాంధీ నడిరోడ్డుపై పడుకుని నిరసన తెలపడం, రాహుల్ గాంధీ ఎఫ్ఐఆర్‌లు నా మెడల్స్ అంటూ దూకుడుగా స్టేట్‌మెంట్లు ఇవ్వడం వంటి పరిణామాలు కాక్రోచ్ పార్టీ పిలుపునిచ్చిన ఆందోళనలను పూర్తిగా నీరుగార్చాయి. కేవలం నిరసనలకే పరిమితం కాకుండా.. రోజూ ఏపీలోని పార్లమెంట్ సభ్యుల నుంచి మొదలుకొని అగ్రనేతల వరకు ఎవరు ఎప్పుడు రోడ్డెక్కాలి, ఎక్కడ డిటెన్షన్ కావాలనే పక్కా డైలీ షెడ్యూల్‌ను కాంగ్రెస్ ముందే సిద్ధం చేసుకుని నడిపిస్తోంది. ఫలితంగా, ఉద్యమ పార్టీగా పేరున్న కాక్రోచ్‌ల నిరసనలకు మీడియాలో కనీస ప్రాధాన్యత కూడా దక్కని పరిస్థితి తలెత్తింది.ధర్మేంద్ర ప్రధాన్ వ్యవహారంలో ఆ ఘనత మొత్తం కాక్రోచ్‌ల ఖాతాలోకి వెళ్లిపోవడంతో చేతులు కాలిన కాంగ్రెస్.. జ్ఞానేశ్ కుమార్ ఇష్యూలో అత్యంత అప్రమత్తంగా వ్యవహరిస్తోంది. ఒకవేళ భవిష్యత్తులో రాజకీయ ఒత్తిళ్ల కారణంగా సీఈసీ రాజీనామా చేయడమో లేక కేంద్రం దిగిరావడమో జరిగితే.. ఆ విజయం కేవలం కాంగ్రెస్ పార్టీ , ఇండియా కూటమి పోరాటం వల్లే సాధ్యమైందనే నేరేటివ్‌ను ప్రజల్లో బలంగా నాటడమే రాహుల్ టీమ్ అసలు లక్ష్యం. సీఈసీ అంశంపై తాము రోడ్లపైకి వచ్చి అరెస్టులు కావడం ద్వారా.. కాక్రోచ్ పార్టీని కేవలం అండర్‌గ్రౌండ్ కార్యకర్తల స్థాయికే పరిమితం చేసి, తామే అసలైన ప్రజాస్వామ్య పోరాట శక్తులమని దేశానికి చాటడంలో కాంగ్రెస్ వ్యూహం ముందడుగు వేసింది.ఈ ఆధిపత్య పోరులో కాక్రోచ్‌లు అంత సులభంగా వెనక్కి తగ్గేలా కనిపించడం లేదు. అక్టోబర్ 10న జంతర్ మంతర్‌ను భారీ ఎత్తున ముట్టడిస్తామని వారు ఇప్పటికే గడువు విధించి, తమ శ్రేణులను ఢిల్లీకి తరలించే సన్నాహాల్లో ఉన్నారు. కానీ, ఆ ముట్టడి రోజున కూడా కాంగ్రెస్ ఊరికే కూర్చునే అవకాశం కనిపించడం లేదు. అప్పటికే పార్లమెంట్ సభ్యులు, కూటమి సీనియర్ నేతలతో కలిసి మరింత పెద్దఎత్తున ప్రత్యక్ష నిరసనలను హోరెత్తించి, కాక్రోచ్‌ల కార్యక్రమాన్ని పూర్తిగా హైజాక్ చేయడానికి కాంగ్రెస్ గ్రౌండ్‌వర్క్ సిద్ధం చేస్తోంది. బీజేపీతో నేరుగా తలపడటంతో పాటు.. విపక్ష స్థానాన్ని ఆక్రమించాలనుకుంటున్న కాక్రోచ్‌లను వెనక్కి నెట్టి, తనే ఏకైక ప్రత్యామ్నాయ శక్తి అని నిరూపించుకోవడమే కాంగ్రెస్ అసలు రాజకీయ పోరాటంగా మారిం జ్ఞానేశ్ కుమార్ రాజీనామాను డిమాండ్ చేస్తూ ఢిల్లీ ముట్టడికి పిలుపునిచ్చిన కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దిప్కేతో పాటు ముఖ్య నేతలు సౌరభ్ దాస్, అశుతోష్ రాంకాలను కోర్టు విడుదల చేసింది. శనివారం విమానం దిగగానే విమానాశ్రయం నుంచే వారిని ముందస్తుగా కస్టడీలోకి తీసుకున్న పోలీసులు, ఆదివారం ఉదయం ఢిల్లీ క్యాంట్ మేజిస్ట్రేట్ ముందు ప్రవేశపెట్టారు. ఏడాది పాటు దేశంలో ఎలాంటి శాంతిభద్రతల విఘాతానికి లేదా శాంతిభంగానికి పాల్పడకూడదనే కఠిన షరతుపై రూ.50,000 ముందస్తు బెయిల్ బాండ్‌తో కోర్టు వారికి ఉపశమనం కల్పించింది.ఎన్నికల సంఘం చేపట్టిన ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో భారీ అక్రమాలు జరిగాయని ఆరోపిస్తూ సిజెపి ఈ ఆందోళనకు పిలుపునిచ్చింది. ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద భారీ నిరసన ప్రదర్శన నిర్వహించాలని భావించినప్పటికీ, పోలీసులు విమానాశ్రయంలోనే దిప్కే బృందాన్ని అదుపులోకి తీసుకోవడం ఉద్రిక్తతకు దారితీసింది. విమానం లోపలికే వచ్చి పోలీసులు తమను అరెస్టు చేస్తున్న దృశ్యాలను సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన దిప్కే, ఇది అప్రజాస్వామిక చర్య అని మండిపడ్డారు.జంతర్ మంతర్ వద్ద జనం గుమిగూడకుండా నగరవ్యాప్తంగా భద్రతా వలయాన్ని ఏర్పాటు చేసిన ఢిల్లీ పోలీసులు, నిరసనకారులను ఎక్కడికక్కడ అడ్డుకున్నారు. శనివారం నాటి ఆందోళనల్లో పలువురు ప్రముఖ రాజకీయ నాయకులతో పాటు సుమారు 3,000 మందికి పైగా నిరసనకారులను పోలీసులు అదుపులోకి తీసుకుని అర్ధరాత్రి వేళ విడుదల చేశారు. యూట్యూబర్ ధ్రువ్ రాఠీని కూడా శనివారం రాత్రి పొద్దుపోయాక పోలీసులు విడుదల చేశారు.సిజెపి అగ్రనేతలు విడుదలైనప్పటికీ, ఢిల్లీ వ్యాప్తంగా ఇంకా పోలీసుల పహారా కొనసాగుతోంది. రాజధానిలో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా ఉండటానికి ముందుజాగ్రత్త చర్యలు కొనసాగిస్తున్నామని అధికారులు తెలిపారు. మరోవైపు, ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన తెలిపే హక్కును కాలరాస్తున్నారని విమర్శిస్తూ కాక్రోచ్ జనతా పార్టీ నేతలు తమ పోరాటాన్ని చట్టబద్ధంగా కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

# ప్రజల దాహం కంటే బీర్లే ముఖ్యమా: ప్రభుత్వంపై హరీశ్ రావు ఫైర్

**సింగూరు ప్రాజెక్టు నీటిని మళ్లిస్తున్నారని హరీశ్ రావు ఆరోపణ**

**రాష్ట్రంలో కరెంట్ కోతలకు ప్రభుత్వ వైఫల్యమే కారణమన్న మాజీ మంత్రి**

**కోట్ల మంది తాగునీటి అవసరాలను పట్టించుకోవడం లేదని విమర్శ**




రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. కోట్ల మంది ప్రజల తాగునీటి అవసరాలను పక్కనపెట్టి, బీర్ ఫ్యాక్టరీలకు ప్రాధాన్యత ఇస్తున్నారని ఆయన ఆరోపించారు. తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడిన ఆయన... ప్రభుత్వం నీటి, విద్యుత్ నిర్వహణలో పూర్తిగా విఫలమైందని ధ్వజమెత్తారు.

సింగూరు ప్రాజెక్టు అంశాన్ని హరీశ్ రావు ప్రత్యేకంగా ప్రస్తావించారు. మరమ్మతుల పేరుతో ప్రాజెక్టు నుంచి 29 టీఎంసీల నీటిని ఖాళీ చేసి, పనులను అసంపూర్తిగా వదిలేశారని విమర్శించారు. ప్రస్తుతం ప్రాజెక్టులో కేవలం 3 టీఎంసీల నీరు మాత్రమే అందుబాటులో ఉన్నా, దానిని బీర్ ఫ్యాక్టరీలకు తరలిస్తున్నారని ఆరోపించారు. ఈ చర్య వల్ల హైదరాబాద్, రంగారెడ్డి, కామారెడ్డి, సంగారెడ్డి, మెదక్ జిల్లాల ప్రజల తాగునీటి భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వైఫల్యాల వల్లే రాష్ట్రంలో కరెంట్ కోతలు పెరిగాయని, ప్రభుత్వ విధానాలతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని హరీశ్ రావు అన్నారు. ఎల్ నినో ప్రభావంపై ముందుగానే హెచ్చరికలు ఉన్నప్పటికీ, దేవాదుల, కల్వకుర్తి వద్ద నీటిని లిఫ్ట్ చేయకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం వహించిందని, ఇది కృత్రిమ కరవుకు దారితీసిందని దుయ్యబట్టారు. మద్యం కంపెనీలకు నీటి కొరత రాకూడదని ఎక్సైజ్ మంత్రి వ్యాఖ్యానించడాన్ని ఆయన తప్పుపట్టారు.

# క్రిప్టో కరెన్సీ పెట్టుబడుల పేరుతో రూ.10 కోట్ల టోకరా

**రెండేళ్లలో పెట్టుబడి రెట్టింపు చేస్తామంటూ వందలాది మందికి వల**

**తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో సుమారు 500 మంది బాధితులు**

**ఐటీసీ గ్లోబల్ పేరుతో పోంజీ స్కీం నిర్వహించినట్లు ఆరోపణలు..**

**ఇద్దరు అంతర్రాష్ట్ర నిందితుల అరెస్టు**

హైదరాబాద్ క్రిప్టో కరెన్సీలో పెట్టుబడులు పెడితే రెండేళ్లలోనే రెట్టింపు లాభాలు వస్తాయంటూ ఆశ చూపి ప్రజల నుంచి కోట్లాది రూపాయలు వసూలు చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఇద్దరు అంతర్రాష్ట్ర నిందితులను ఆదిలాబాద్ వన్‌టౌన్ పోలీసులు అరెస్టు చేశారు. ఐటీసీ గ్లోబల్ పేరుతో పోంజీ, మల్టీలెవల్ మార్కెటింగ్ తరహాలో పెట్టుబడి పథకాన్ని నిర్వహిస్తూ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో వందలాది మందిని మోసం చేసినట్లు ప్రాథమిక దర్యాప్తులో వెల్లడైందని పోలీసులు తెలిపారు. ఈ పథకం ద్వారా రూ.10 కోట్లకు పైగా వసూలు చేసి ఉండవచ్చని, బాధితుల సంఖ్య సుమారు 500 వరకు ఉండవచ్చని అనుమానిస్తున్నారు.ఆదిలాబాద్ వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ కేసు వివరాలను వెల్లడించారు.

బాధితుల ఫిర్యాదుతో దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు, పెట్టుబడుల పేరుతో సాగిన వ్యవహారంలో కీలకంగా వ్యవహరించిన ఇద్దరిని గుర్తించి అరెస్టు చేసినట్లు తెలిపారు. రూ.7.50 లక్షలు పెట్టుబడి పెట్టి మోసపోయిన బాధితుడుఆదిలాబాద్ జిల్లా తలమడుగు మండలం రుయ్యాడి గ్రామానికి చెందిన జువ్వక నర్సింలు 2023లో ఐటీసీ గ్లోబల్ ప్రతినిధుల మాటలు నమ్మి రూ.7.50 లక్షలు పెట్టుబడిగా పెట్టినట్లు పోలీసులు గుర్తించారు.

రెండేళ్లు గడిచినా హామీ ఇచ్చిన ప్రకారం పెట్టుబడి సొమ్ము తిరిగి రాకపోవడంతో ఆయన పోలీసులను ఆశ్రయించారు. ఈ ఫిర్యాదును స్వీకరించిన పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. విచారణలో పెట్టుబడుల పథకం వెనుక ఉన్న వ్యక్తుల వివరాలు వెలుగులోకి వచ్చినట్లు తెలిపారు.

ఇద్దరు అంతర్రాష్ట్ర నిందితుల అరెస్టుఈ కేసులో ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నానికి చెందిన సంస్థ వ్యవస్థాపకుడు పొలమారశెట్టి రత్నరాజు, పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన సహ వ్యవస్థాపకుడు దొండపాటి లక్ష్మణరావు అలియాస్ లాజరస్‌ను పోలీసులు అరెస్టు చేశారు. వీరితో పాటు మరో నలుగురిపై కూడా కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు.

నిందితులకు సంబంధించిన సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్న పోలీసులు, వారి ఆర్థిక లావాదేవీలు, పెట్టుబడుల సేకరణ విధానం, ఇతర వ్యక్తుల ప్రమేయంపై విచారణ కొనసాగిస్తున్నారు. జహీరాబాద్, రాజమండ్రి ప్రాంతాల్లో వారికి సంబంధించిన ఆస్తుల వివరాలను కూడా సేకరిస్తున్నట్లు సమాచారం. రూ.1,000 నుంచి రూ.3 లక్షల వరకు పెట్టుబడి ప్యాకేజీలుపోలీసుల ప్రాథమిక విచారణ ప్రకారం, నిందితులు ఒక వెబ్‌సైట్‌ను ఏర్పాటు చేసి వివిధ మొత్తాలతో పెట్టుబడి ప్యాకేజీలను అందుబాటులో ఉంచినట్లు గుర్తించారు. రూ.1,000 నుంచి రూ.3 లక్షల వరకు పెట్టుబడులు పెట్టే అవకాశం కల్పించినట్లు తెలుస్తోంది.పెట్టుబడి పెట్టిన రెండేళ్లలోనే సొమ్ము రెట్టింపు అవుతుందని, కొత్త సభ్యులను పథకంలో చేర్పిస్తే వారి పెట్టుబడుల ఆధారంగా 25 శాతం వరకు కమిషన్ లభిస్తుందని ఆశ చూపినట్లు పోలీసులు పేర్కొన్నారు. దీంతో అధిక లాభాలపై ఆశతో పలువురు తమ సొమ్మును పెట్టుబడిగా పెట్టడమే కాకుండా, తమకు తెలిసినవారిని కూడా ఈ పథకంలో చేరేలా ప్రోత్సహించినట్లు విచారణలో వెల్లడైనట్లు తెలిపారు.

హోటళ్లు, లాడ్జిల్లో సమావేశాలు.. జూమ్ ద్వారా ప్రచారం

ఈ పెట్టుబడి పథకాన్ని విస్తరించేందుకు నిందితులు హోటళ్లు, లాడ్జిల్లో సమావేశాలు నిర్వహించినట్లు పోలీసులు గుర్తించారు. ఆన్‌లైన్‌లో జూమ్ సమావేశాల ద్వారా కూడా పథకం గురించి ప్రచారం చేసినట్లు వెల్లడించారు. ఆదిలాబాద్‌లోని హోటళ్లలో సమావేశాలు నిర్వహించి పలువురిని పెట్టుబడులు పెట్టేలా ప్రేరేపించినట్లు ప్రాథమిక దర్యాప్తులో తేలిందని తెలిపారు.కొత్త సభ్యులను చేర్చడం ద్వారా అదనపు కమిషన్లు వస్తాయనే ఆశ చూపడంతో ఈ పథకం మరింత మందికి విస్తరించినట్లు అనుమానిస్తున్నారు. ఒకరి ద్వారా మరొకరిని చేర్చుకునే విధానంలో పెట్టుబడులు సేకరించినట్లు పోలీసులు పేర్కొన్నారు.

# 29ప్రజలకు అందుబాటులో ఉండేలా ఆర్టీసీ -మెట్రో కామన్ పాస్ ఛార్జీల పునఃపరిశీలన -మంత్రి పొన్నం ప్రభాకర్

**ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో ఛార్జీల సమీక్షకు ప్రభుత్వం నిర్ణయంఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సూచనల మేరకు త్వరలో ఉన్నతాధికారులతో సమావేశం**



హైదరాబాద్:ఇటీవల ప్రారంభించిన ఆర్టీసీ - మెట్రో కామన్ పాస్ ఛార్జీలను పునఃపరిశీలించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించినట్లు రాష్ట్ర రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. కామన్ పాస్ ఛార్జీలు అధికంగా ఉన్నాయంటూ ప్రజల నుంచి వరుసగా ఫిర్యాదులు వస్తున్న నేపథ్యంలో ప్రజల అభిప్రాయాలను, వాస్తవ పరిస్థితులను సమీక్షిస్తున్నామని వెల్లడించారు.ప్రస్తుతం అమల్లోకి తీసుకొచ్చిన కామన్ పాస్ ధరలు రోజువారీ పాస్‌కు రూ.400 కాగా, ఇందులో మెట్రో వాటా రూ.300, ఆర్టీసీ వాటా రూ.100గా ఉంది. అదేవిధంగా నెలవారీ కామన్ పాస్ ధర రూ.8,500 కాగా, ఇందులో మెట్రో వాటా రూ.7,000, ఆర్టీసీ వాటా రూ.1,500గా నిర్ణయించారు.అయితే ఈ ఛార్జీలు సామాన్య ప్రజలకు భారంగా ఉన్నాయనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సూచనల మేరకు ఛార్జీలను పునఃపరిశీలించాలని ప్రభుత్వం నిర్ణయించిందని మంత్రి తెలిపారు. వాస్తవ పరిస్థితులను పరిశీలించి, ప్రజలకు అందుబాటులో ఉండేలా ఆర్టీసీ - మెట్రో కామన్ పాస్ ధరలను నిర్ణయించే అంశంపై త్వరలో ఉన్నతాధికారులతో సమావేశం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.ప్రజా రవాణా వ్యవస్థను మరింత బలోపేతం చేయడంతో పాటు ఆర్టీసీ, మెట్రో సేవలను ప్రజలు విస్తృతంగా వినియోగించుకునేలా చూడటమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు. ప్రయాణికులకు ఆర్థికంగా ప్రయోజనం చేకూరేలా, వారి అవసరాలకు అనుగుణంగా, సౌకర్యవంతమైన ధరలతో కామన్ పాస్ విధానం అమలయ్యేలా తగిన నిర్ణయం తీసుకుంటామని తెలిపారు.ఆర్టీసీ - మెట్రో కామన్ పాస్ ద్వారా ప్రజా రవాణాను మరింత అభివృద్ధి చేసి, ప్రయాణికులకు మెరుగైన రవాణా సౌకర్యాలను అందించాలన్నదే ప్రభుత్వ ఉద్దేశమని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. ప్రజలపై అదనపు ఛార్జీల భారం మోపడం ప్రభుత్వ లక్ష్యం కాదని, ప్రజల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని త్వరలోనే తగిన నిర్ణయం తీసుకుంటామని వెల్లడించారు.

**నూతన తారు రోడ్డు నాణ్యత లోపం - డీఈ కి ఫిర్యాదు చేసినా ఫలితం శూన్యం**

దేవీపట్నం మండల పరిధిలోని కొత్తవీధి – లోతుపాలెం మధ్య నూతనంగా వేసిన తారు రోడ్డు నెల రోజులు కూడా నిండకముందే పగుళ్లు పట్టి, అధ్వాన్నంగా మారింది.లక్షల రూపాయల ప్రభుత్వ నిధులతో వేసిన ఈ రోడ్డు నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పూర్తిగా విస్మరించారు. తారు మందం తక్కువగా ఉండటం, నాసిరకం మెటీరియల్ వాడటం వల్ల రోడ్డు మధ్యలో పగుళ్లు ఏర్పడి వాహనదారులకు ప్రమాదకరంగా మారింది.ఈ నాణ్యత లోపంపై సంబంధిత డీఈ కార్యాలయంలో లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేయడం జరిగింది. అయితే ఇప్పటివరకు అధికారుల నుండి ఎటువంటి స్పందన లేదు. కనీసం రోడ్డును పరిశీలించడానికి కూడా ఎవరూ రాలేదు.కాబట్టి నాణ్యత లేని ఈ రోడ్డుపై సమగ్ర విచారణ జరిపి, క్వాలిటీ టెస్ట్ నిర్వహించి, నాణ్యత నిర్ధారణ అయ్యే వరకు కాంట్రాక్టర్ బిల్లులను నిలిపివేయాలని కోరుతూ జిల్లా కలెక్టర్ వారికి ఫిర్యాదు చేయడం జరుగుతుంది.

# మంత్రి సీతక్క విజ్ఞప్తికి స్పందించిన రాష్ట్ర ప్రభుత్వం

**ములుగులో విద్యుత్ లైన్ల మార్పు, విస్తరణకు రూ.3 కోట్లు మంజూరు**

**సానుకూలంగా స్పందించిన ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క**



**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి అక్టోబర్ 12 ములుగు**ములుగు నియోజకవర్గంలో ఇళ్ల మీదుగా వెళ్తున్న విద్యుత్ లైన్ల మార్పు, విస్తరణ పనులకు రాష్ట్ర ప్రభుత్వం రూ.3 కోట్లు మంజూరు చేసింది. రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖల మంత్రి దనసరి అనసూయ సీతక్క విజ్ఞప్తి మేరకు ఇంధన శాఖ ఈ నెల 8న ప్రభుత్వ ఉత్తర్వు సంఖ్య 32 జారీ చేసింది.

నివాస గృహాల మీదుగా విద్యుత్ లైన్లు వెళ్లడంతో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, భద్రతాపరమైన సమస్యలను మంత్రి సీతక్క ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. ప్రమాదాల ముప్పును తగ్గించేందుకు విద్యుత్ లైన్లను మార్చాలని, ఇందుకు అవసరమైన నిధులు మంజూరు చేయాలని కోరారు.

మంత్రి సీతక్క విజ్ఞప్తికి రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, విద్యుత్ శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క సానుకూలంగా స్పందించారు. తెలంగాణ ఉత్తర విద్యుత్ పంపిణీ సంస్థ సమర్పించిన ప్రతిపాదనలను పరిశీలించిన ప్రభుత్వం రూ.3 కోట్ల అంచనా వ్యయంతో విద్యుత్ లైన్ల మార్పు, విస్తరణ పనులకు ఆమోదం తెలిపింది.ఆర్థిక శాఖ సమ్మతితో జారీ చేసిన ఈ ఉత్తర్వుల ప్రకారం పనుల అమలుకు అవసరమైన తదుపరి చర్యలు చేపట్టాలని తెలంగాణ ఉత్తర విద్యుత్ పంపిణీ సంస్థ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్‌ను ప్రభుత్వం ఆదేశించింది. ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నవీన్ మిట్టల్ ఈ ఉత్తర్వులు జారీ చేశారు.

మంత్రి సీతక్క చొరవతో మంజూరైన ఈ నిధులతో విద్యుత్ లైన్ల మార్పు పనులు చేపట్టనున్నారు. పనులు పూర్తయితే ఇళ్ల మీదుగా వెళ్తున్న విద్యుత్ లైన్లతో ఎదురవుతున్న ఇబ్బందులు తగ్గి, ప్రజలకు భద్రత పెరగనుంది.దీర్ఘకాలంగా ఉన్న సమస్య పరిష్కారానికి కృషి చేసిన మంత్రి సీతక్కకు ములుగు నియోజకవర్గ ప్రజలు ధన్యవాదాలు తెలిపారు.

# దసరా ఉత్సవాల వేళ రోడ్ల మరమ్మతు పనుల పరిశీలన.

**బి ఆర్ ఎస్ జిల్లా అధ్యక్షులు మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్**



**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి అక్టోబర్ 12 ఏటూరు నాగారం** దసరా నిర్వాహక ఉత్సవ కమిటీకి విరాళాలు అందజేసిన బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు కాకులమర్రి లక్ష్మణ్ బాబ సర్పంచ్ కాకులమర్రి శ్రీలత

పవిత్ర దసరా నవరాత్రి ఉత్సవాలను రావణ వధ నిర్వహణ కోసం ఏటూరునాగారం మేజర్ గ్రామపంచాయతీ పరిధిలో రహదారుల పరిశీలన మరియు రోడ్ల గుంతల పూడ్చివేత పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. ఏటూరునాగారం మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ శ్రీమతి కాకులమర్రి శ్రీలత గ ఆధ్వర్యంలో చేపడుతున్న ఈ పనులను ములుగు జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కాకులమర్రి లక్ష్మణ్ బాబు క్షేత్రస్థాయిలో స్వయంగా పరిశీలించారు.ఈ సందర్భంగా లిలక్ష్మణ్ బాబు మాట్లాడుతూ.. విజయదశమి పండుగ సందర్భంగా భక్తులు, ప్రజలు మరియు వాహనదారులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా, ఉత్సవాలు అత్యంత వైభవంగా మరియు ప్రశాంతంగా సాగేలా రోడ్ల మరమ్మతు పనులను నాణ్యతతో, మెరుగ్గా పూర్తి చేయాలని ఆదేశించారు.

దసరా ఉత్సవాల కమిటీ అధ్యక్షులు తుమ్మ మల్లారెడ్డి ములుగు జిల్లా బిఆర్ఎస్ అధ్యక్షులు లికాకులమర్రి లక్ష్మణ్ బాబు లి ?50,000/- విరాళంగా ప్రకటించగా, వారి సోదరులు కాకులమర్రి ప్రదీప్ రావు ?30,000/- రూపాయలు) ఆర్థిక సాయాన్ని ఉత్సవ కమిటీకి అందజేశారు. దసరా వేడుకలు ఘనంగా నిర్వహించాలనే ఉద్దేశంతో ముందుకు వచ్చి ఆర్థిక సాయం అందించిన వారిని ఉత్సవ కమిటీ సభ్యులు మరియు గ్రామస్తులు ప్రత్యేకంగా అభినందించారు.బి

ఈ కార్యక్రమంలో మాజీ మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు గడదాసు సునీల్ కుమార్ , కూనూరు అశోక్ గౌడు, మాజీ, తాదూరి రఘు, సప్పిడి రామ్ నర్సయ్య, ఎండి ఖాజా పాషా, కర్ర రవీందర్, ఉప సర్పంచ్ పర్వతాల ఎల్లయ్య, రామాలయం గుడి చైర్మన్ దన్నపునేని కిరణ్, పులసం పురుషోత్తం, కుమ్మరి చంద్రబాబు, గండేపల్లి నర్సయ్య, వావిలాల ముత్తయ్య,జాడి భోజరావు, అంగాల వీరన్న కాళ్ల రామకృష్ణ, కొండాయి చిన్ని, బట్టు గోపి, ఏం పెల్లి రాజు, పెద్ద బోయిన బాలకృష్ణ, గండేపల్లి నాగరాజు, మాదరి మధు,మాజీ కోఆప్షన్స్ సభ్యులు ఖలీల్, దేపాక శ్రీరాములు, తాళ్ల పెల్లి మోహన్, పాలకుర్తి విజయ్, గ్రామపంచాయతీ ప్రతినిధులు, పార్టీ నాయకులు, ఉత్సవ కమిటీ సభ్యులు మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు

# విజయ నగరంలో వైసీపీకి వరస దెబ్బలు

విజయనగరం, ,అక్టోబరు 12 విజయనగరం జిల్లాలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి వరుసగా కీలక నేతలను కోల్పోతూ భారీ షాక్‌లను ఎదుర్కొంటోంది. ఇటీవలే పార్టీ సీనియర్ నేత, బొత్స సత్యనారాయణ బంధువు అయిన మజ్జి శ్రీనివాసరావు వైఎస్సార్‌సీపీకి రాజీనామా చేయగా, ఆయన వెంటే పలువురు జడ్పీటీసీలు కూడా పార్టీని వీడారు.ఆ దెబ్బ నుంచి కోలుకోకముందే పార్టీకి చెందిన మరికొందరు ముఖ్య నేతలు వరుసగా రాజీనామాలు చేస్తుండటంతో జిల్లాలో వైఎస్సార్‌సీపీ ఖాళీ అవుతున్న పరిస్థితి కనిపిస్తోంది. ఇటీవల నెల్లిమర్ల మాజీ ఎమ్మెల్యే, విజయనగరం జడ్పీ మాజీ చైర్మన్ బడ్డుకొండ అప్పలనాయుడు వైఎస్సార్‌సీపీకి రాజీనామా చేశారు. పార్టీ అధిష్ఠానం ఆయనను సస్పెండ్ చేసిన కొన్ని గంటల్లోనే ఆయన తన రాజీనామాను ప్రకటించారు. ఈ సందర్భంగా వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఒక నియంతలా వ్యవహరిస్తున్నారని, పార్టీని ఒక ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలా మార్చేశారని ఆయన తీవ్ర విమర్శలు గుప్పించారు. మరొకవైపు కోలగట్ల వీరభద్రస్వామి కూడా పార్టీ మారతారని వినిపించినా ఆయన ఆ ప్రచారాన్ని కొట్టిపారేశారు. తాను కొంత కాలం నుంచి విశాఖలో ఉన్నంత మాత్రాన పార్టీని వీడుతారన్న ప్రచారం సరైనది కాదని ఆయన కొట్టిపారేశారు. తనకు ఇప్పుడు అరవై ఐదేళ్లని, తాను ఇప్పుడు పార్టీ మారి ఏం చేస్తానని ఆయన నవ్వుతూ అనడం కూడా చర్చనీయాంశమైంది. అయితే గతంలో అధికారంలో ఉన్నప్పుడు తన కుమార్తెను మేయర్ పదవికి పోటీ చేయాలని ప్రయత్నించి, ఇప్పుడు ఓటమి చెందిన తర్వాత తాము కొత్తవారికి అకాశం ఇవ్వాలని కోలగట్ల అనడం చర్చనీయాంశమైంది. కోలగట్ల వీరభద్రస్వామి నిజానికి పార్టీని వీడకపోవచ్చు. ఆయన వైసీపీలో ఉండే అవకాశాలు ఉండి ఉండవచ్చు. కానీ ఆయన సమావేశంలో మాట్లాడిన తీరు మాత్రం వైసీపీ నేతలు ఎవరైనా వెళితే సాధారణమేనని కొట్టిపారేయడం కూడా ఇప్పుడు హాట్ టాపిక్ గా మారింది. బెల్లం ఉన్న చోటకే ఈగలు ముసురుతాయని, గతంలో వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు టీడీపీ నుంచి అనేక మంది నేతలు తమ పార్టీలోకి వచ్చిన విషయాన్ని ఆయన గుర్తు చేస్తూ అన్న మాటలు తాను ఎవరు పార్టీని వదిలి వెళ్లినా పట్టించుకోనని మాత్రమే చెప్పినట్లయింది. .. కేవలం విజయనగరం ప్రాంతంలోనే కాదు. బొబ్బిలి, గజపతినగరం నియోజకవర్గాల్లో భారీ చేరికలు టీడీపీ, జనసేనలో ఉంటాయన్న ప్రచారం నడుస్తుంది. అక్టోబర్ మొదటి వారంలో బొబ్బిలి, గజపతినగరం నియోజకవర్గాలకు చెందిన పలువురు వైఎస్సార్‌సీపీ సర్పంచులు, ఎంపీటీసీలు, స్థానిక నాయకులు పార్టీకి గుడ్ బై చెప్పారు. మాజీ మంత్రి, ఎమ్మెల్యే కళా వెంకటరావు సమక్షంలో పెద్ద ఎత్తున వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు తెలుగుదేశం పార్టీ లో చేరారు.జిల్లాలోని పలు మండలాల్లో ఒకేరోజు వందలాది కుటుంబాలు వైఎస్సార్‌సీపీకి దూరమై కూటమి పార్టీల వైపు మొగ్గు చూపుతుండటంతో విజయనగరంలో వైఎస్సార్‌సీపీ మరింత బలహీనపడుతోంది.

# నిరసన స్థలంగా జంతర్ మంతర్ తొలగింపు..
# స్థలాన్ని మార్చగలరేమో కానీ ప్రజాగ్రహాన్ని మార్చలేరన్న కాంగ్రెస్

**ఢిల్లీలోని జంతర్ మంతర్‌ను నిరసన స్థలం జాబితా నుంచి తొలగింపు**

**ప్రభుత్వ నిర్ణయంపై తీవ్రంగా స్పందించిన కాంగ్రెస్, ఇతర ప్రతిపక్షాలు**

**స్థలం మార్చగలరేమో కానీ, ప్రజల ఆగ్రహాన్ని చల్లార్చలేరని వ్యాఖ్య**

**ఇది ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని, గొంతు నొక్కే ప్రయత్నమని ఆరోపణ**

**ఢిల్లీలో నిరసనల కోసం**

**రామ్‌లీలా మైదానం సహా మూడు కొత్త ప్రాంతాల గుర్తింపు**




దేశ రాజధాని ఢిల్లీలోని జంతర్ మంతర్‌ను నిరసన స్థలాల జాబితా నుంచి తొలగించడంపై రాజకీయ దుమారం రేగింది. కేంద్ర ప్రభుత్వ నిర్ణయంపై ప్రతిపక్షాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాయి. ఈ నిర్ణయం ఏకపక్షమని, ప్రజాస్వామ్యంలో ప్రజలే నిరసన స్థలాన్ని నిర్ణయిస్తారని, ప్రభుత్వం కాదని నేతలు మండిపడ్డారు. ప్రభుత్వం నిరసన స్థలాన్ని మార్చగలదేమో కానీ, ప్రజల ఆగ్రహాన్ని తగ్గించలేదని స్పష్టం చేశారు.

సోమవారం ఈ విషయంపై కాంగ్రెస్ ఎంపీ మనీశ్ తివారీ మాట్లాడుతూ, "ఈ అంశంపై సుప్రీంకోర్టును ఆశ్రయించాలని భావిస్తున్నాం. అందుకే ప్రతిపక్షాలన్నీ కలిసి బారాఖంబా రోడ్డుకు వెళ్తున్నాం. సాధారణంగా బోట్ క్లబ్‌లో నిరసనలు జరుగుతాయి. మీరు నిరసన వేదికలను మార్చవచ్చు, కానీ ప్రజల కోపాన్ని తగ్గించలేరు" అని అన్నారు. అఖిల భారత మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు అల్కా లాంబా స్పందిస్తూ, "దీన్ని ఎలా రద్దు చేస్తారు? ప్రజాస్వామ్యంలో ఎక్కడ నిరసన చేయాలో ఎవరు నిర్ణయిస్తారు? అన్యాయం, అణచివేతకు వ్యతిరేకంగా గళం విప్పడానికి భారతదేశంలోని ప్రతి అంగుళం స్వేచ్ఛాయుతమైనదే. ఈ స్వేచ్ఛను మాకు రాజ్యాంగం ఇచ్చింది" అని పేర్కొన్నారు.

మరికొందరు కాంగ్రెస్ నేతలు తమదైన శైలిలో వ్యంగ్యంగా విమర్శలు గుప్పించారు. "ప్రభుత్వం ఈ దేశ పౌరులుగా మమ్మల్ని గుర్తించడం లేదు కాబట్టి, బంగ్లాదేశ్, చైనా వంటి దేశాల్లో ఎక్కడైనా నిరసన స్థలం చూపిస్తే అక్కడికి వెళ్లి నిరసన తెలుపుతాం" అని సందీప్ దీక్షిత్ అన్నారు. హరియాణా ప్రతిపక్ష నేత భూపిందర్ సింగ్ హుడా మాట్లాడుతూ.. ప్రభుత్వం భయపడిందని, ప్రజల గొంతు నొక్కాలని చూస్తోందని ఆరోపించారు. "ఢిల్లీ వారి తండ్రి ఆస్తి అన్నట్లుగా.. ఇక ఢిల్లీకి రావద్దని కూడా చెబుతారు" అని ఎంపీ చరణ్‌జిత్ సింగ్ చన్నీ విమర్శించగా, "ఇకపై హిమాలయాల శిఖరాలపై నిరసన చేస్తాం" అని మరో ఎంపీ ఇమ్రాన్ మసూద్ వ్యాఖ్యానించారు.

హోం మంత్రిత్వ శాఖ కమిటీ సిఫార్సుల మేరకు జంతర్ మంతర్‌ను నిరసనల కోసం నిర్దేశించిన స్థలం జాబితా నుంచి డీ-నోటిఫై చేసినట్లు ఢిల్లీ పోలీసులు అధికారిక ప్రకటన విడుదల చేశారు. నిరసనల కోసం ఢిల్లీలోని రామ్‌లీలా మైదానం, బురారీ గ్రౌండ్, తూర్పు ఢిల్లీలోని సీబీడీ గ్రౌండ్ అనే మూడు కొత్త ప్రదేశాలను కేటాయించినట్లు తెలిపారు. ఈ నిర్ణయం కేంద్రం, ప్రతిపక్షాల మధ్య మరో రాజకీయ ఘర్షణకు దారితీసింది.

# ఆసుపత్రుల బిల్లులపై కేంద్రం సీరియస్..
# రాష్టాలకు కీలక ఆదేశాలు

**వైద్య సేవల్లో పారదర్శకత పెంచేందుకు కేంద్రం కీలక నిర్ణయం**

**ఆసుపత్రుల్లో చికిత్స చార్జీలను స్పష్టంగా ప్రదర్శించాలని రాష్టాలకు ఆదేశం**

**రోగులు ముందే ఖర్చుపై అంచనా వేసుకునేందుకు ఈ నిర్ణయం దోహదం**

**క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్స్ చట్టం ప్రకారం ఈ నిబంధనలు అమలు చేయాలని సూచన**

**విదేశీ రోగులకు అందించే ప్యాకేజీ రేట్లను కూడా ప్రదర్శించాలని విజ్ఞప్తి**



దేశవ్యాప్తంగా ఉన్న ఆసుపత్రులు, క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్లు తమ వద్ద అందించే వైద్య సేవలకు వసూలు చేసే చార్జీలను అందరికీ స్పష్టంగా కనిపించేలా ప్రదర్శించాలని కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలను ఆదేశించింది. వైద్య సేవల్లో పారదర్శకత, జవాబుదారీతనం పెంచడంతో పాటు రోగులకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా ఈ చర్యలు చేపట్టినట్టు కేంద్రం సోమవారం స్పష్టం చేసింది.

ఈ మేరకు కేంద్ర ఆరోగ్య శాఖ కార్యదర్శి పుణ్య సలిల శ్రీవాస్తవ అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల ప్రధాన కార్యదర్శులకు లేఖ రాశారు. ఆసుపత్రులలో చార్జీల ప్రదర్శనకు సంబంధించిన నిబంధనలు సక్రమంగా అమలవుతున్నాయో లేదో సమీక్షించాలని, రోగులకు, వారి సహాయకులకు చార్జీల వివరాలు సులభంగా కనిపించేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆమె తన లేఖలో కోరారు.

చికిత్స ఖర్చులను పారదర్శకంగా ప్రదర్శించడం వల్ల రోగులు, వారి కుటుంబసభ్యులు వైద్యానికి అయ్యే వ్యయంపై ఒక అంచనాకు రాగలరని, తద్వారా ఆర్థికంగా ముందే ప్రణాళిక వేసుకోవడానికి వీలవుతుందని మంత్రిత్వ శాఖ అభిప్రాయపడింది. ఇది బిల్లింగ్ విషయంలో తలెత్తే వివాదాలను తగ్గించి, వైద్య వ్యవస్థపై ప్రజల్లో నమ్మకాన్ని పెంచుతుందని పేర్కొంది.

క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్స్ (రిజిస్ట్రేషన్ అండ్ రెగ్యులేషన్) యాక్ట్-2010, క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్స్ (సెంట్రల్ గవర్నమెంట్) రూల్స్-2012 ప్రకారం, ఈ చట్టం వర్తించే రాష్ట్రాల్లోని వైద్య సంస్థలు అందించే అన్ని సేవలు, సౌకర్యాల చార్జీలను తప్పనిసరిగా ప్రదర్శించాలి. ఈ వివరాలను ఇంగ్లీషుతో పాటు స్థానిక భాషలో కూడా అందరికీ కనిపించే ప్రదేశంలో ఉంచాలని నిబంధనలు స్పష్టం చేస్తున్నాయి.

ఆరోగ్యం రాష్ట్రాల పరిధిలోని అంశం కాబట్టి, ఈ నిబంధనలను క్షేత్రస్థాయిలో అమలు చేయాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వాలపైనే ఉందని కేంద్ర ఆరోగ్య కార్యదర్శి గుర్తు చేశారు. కేంద్ర చట్టం వర్తించని రాష్ట్రాలు కూడా తమ సొంత నిబంధనల ప్రకారం చార్జీల ప్రదర్శనను తప్పనిసరి చేయాలని సూచించారు.

ఇదే సమయంలో భారత్‌లో చికిత్స కోసం వచ్చే విదేశీ రోగుల విషయంలోనూ పారదర్శకత పాటించాలని కేంద్రం కోరింది. మెడికల్ లేదా ఆయుష్ వీసాలపై వచ్చే వారికి అందించే ప్యాకేజీ రేట్లను కూడా ప్రముఖంగా ప్రదర్శించేలా ఆసుపత్రులను ప్రోత్సహించాలని రాష్ట్రాలకు విజ్ఞప్తి చేసింది. దీనివల్ల విదేశీ రోగులు సరైన నిర్ణయం తీసుకోవడానికి, ధరల విషయంలో ఫిర్యాదులు తగ్గించడానికి వీలవుతుందని, వైద్య రంగంలో భారత్ స్థానాన్ని మరింత బలోపేతం చేస్తుందని కేంద్రం ఆశాభావం వ్యక్తం చేసింది.

# తెలంగాణ తల్లి విగ్రహానికి అవమానం
# ఇందిరమ్మ చీర కట్టిన దుండగులు

నల్గొండ ఎన్జీ కళాశాల వద్ద తెలంగాణ తల్లి విగ్రహానికి గుర్తు తెలియని వ్యక్తులు ఇందిరమ్మ చీర కట్టిన ఉదంతం కలకలం రేపింది. తెలంగాణ తల్లి విగ్రహానికి ఇందిరమ్మ చీర కట్టడంపై స్థానిక బీఆర్ఎస్ నేతలు ఆగ్రహం వ్యక్తం చేసారు. సమాచారం అందుకున్న పోలీసులు జోక్యం చేసుకుని మున్సిపల్ సిబ్బంది తో చీరను తొలగించారు. చీరను తొలగించాక బీఆర్ఎస్ నాయకులు విగ్రహానికి పాలాభిషేకం చేసారు.

# కుష్టువ్యాధి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలి.

**జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్**
**ప్రారంభ దశలో గుర్తిస్తే అంగవైకల్యాన్ని నివారించవచ్చు**
**ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల్లో కుష్టువ్యాధికి ఉచిత చికిత్స**
**ఈ నెల 22 నుండి నవంబర్ 4 వరకు**
**కుష్టు వ్యాధి గుర్తింపు కార్యక్రమం**



**ఖమ్మం జిల్లా బ్యూరో ప్రజాబలం అక్టోబర్ 12:**కుష్టువ్యాధి లక్షణాలు కనిపించిన వెంటనే సమీపంలోని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రంలో వైద్యులను సంప్రదించి, సకాలంలో చికిత్స తీసుకోవాలని జిల్లా కలెక్టర్ దివాకర టీ ఎస్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో కుష్టు వ్యాధి నిర్మూలనపై అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు.

జిల్లా ప్రజలకు కుష్టు వ్యాధిపై అవగాహన కల్పించడంతో పాటు, వ్యాధి లక్షణాలు ఉన్నవారిని ముందస్తుగా గుర్తించి, చికిత్స అందించేందుకు ఈ నెల 22 నుండి నవంబర్ 4 వరకు కుష్టు వ్యాధి గుర్తింపు కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. ఇందులో భాగంగా వైద్య, ఆరోగ్య శాఖ సిబ్బంది గ్రామాలు, పట్టణ ప్రాంతాల్లో ఇంటింటికి వెళ్లి, ప్రజలకు కుష్టు వ్యాధిపై అవగాహన కల్పిస్తారని, అనుమానిత లక్షణాలు ఉన్నవారిని గుర్తించి, అవసరమైన వైద్య పరీక్షల నిమిత్తం సంబంధిత వైద్యాధికారులకు సూచిస్తారని అన్నారు. వ్యాధి నిర్ధారణ అయిన వారికి ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల ద్వారా ఉచితంగా చికిత్స అందించబడుతుందని తెలిపారు. కుష్టువ్యాధి మైకోబ్యాక్టీరియం లెప్రే అనే బ్యాక్టీరియా వల్ల వస్తుందని, ఇది ప్రధానంగా చర్మం, నరాలపై ప్రభావం చూపుతుందని తెలిపారు. వ్యాధి లక్షణాలు బయటపడటానికి సగటున మూడు సంవత్సరాల వరకు సమయం పట్టవచ్చని పేర్కొన్నారు. చర్మంపై సహజ చర్మరంగు కంటే తక్కువ రంగులో లేదా ఎరుపు, రాగి రంగులో మచ్చలు కనిపించడం, ఆయా మచ్చల వద్ద స్పర్శజ్ఞానం తగ్గడం లేదా లేకపోవడం కుష్టువ్యాధి ముఖ్య లక్షణాలని తెలిపారు. శరీరంలోని ఏ భాగంలోనైనా ఇటువంటి మచ్చలు కనిపించవచ్చని, వాటిని నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు.

కుష్టువ్యాధి ఎవరికైనా రావచ్చని, దీనికి వయస్సు, లింగభేదం లేదని కలెక్టర్ పేర్కొన్నారు. ఇది వంశపారంపర్య వ్యాధి కాదని, శాపం లేదా పాపం వల్ల వచ్చే వ్యాధి కాదని స్పష్టం చేశారు. కుష్టువ్యాధి పట్ల ప్రజల్లో ఉన్న అపోహలను తొలగించాలని, వ్యాధిగ్రస్తుల పట్ల వివక్ష చూపకుండా వారిని గౌరవంగా చూడాలని కోరారు.కుష్టువ్యాధికి ఎండీటీ (బహుళ ఔషధ చికిత్స) ద్వారా సాధారణంగా 6 నుంచి 12 నెలల్లో పూర్తిగా నయం చేయవచ్చని తెలిపారు.లి ప్రారంభ దశలోనే వ్యాధిని గుర్తించి, వైద్యుల సూచనల మేరకు పూర్తి స్థాయి చికిత్స తీసుకుంటే అంగవైకల్యాన్ని నివారించవచ్చని పేర్కొన్నారు. అవసరమైన సందర్భాల్లో వైద్యుల సలహా మేరకు శస్త్ర చికిత్స ద్వారా అంగవైకల్య సంబంధిత సమస్యలను సరిచేసుకునే అవకాశం ఉంటుందని వివరించారు. కుష్టువ్యాధికి సంబంధించిన చికిత్స అన్ని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల్లో ఉచితంగా అందుబాటులో ఉందని జిల్లా కలెక్టర్ తెలిపారు. చర్మంపై స్పర్శజ్ఞానం తగ్గిన మచ్చలు కనిపించినప్పుడు సమీప ఆరోగ్య కార్యకర్తను లేదా ప్రభుత్వ ఆరోగ్య కేంద్రంలోని వైద్యులను సంప్రదించి చికిత్స పొందాలని సూచించారు.లి కుష్టువ్యాధిని ప్రారంభ దశలోనే గుర్తించి, బాధితులకు సకాలంలో చికిత్స అందేలా ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని సంబంధిత వైద్య ఆరోగ్య శాఖ అధికారులకు సూచించారు. కుష్టువ్యాధి నిర్మూలనకు ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని జిల్లా కలెక్టర్ అన్నారు. ఈ సమావేశంలోలి అదనపు కలెక్టర్లు డా. పి. శ్రీజ, పి. శ్రీనివాస రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి రామ్మూర్తి, జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డా. రామారావు, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# మేడ్చల్ యువతకు అపోలో ఫార్మసీలో ఉద్యోగాలు

**ఈ నెల 14న కలెక్టరేట్లో జాబ్‌మేళా.. రూ.25 వేల వరకు వేతనం**

**జిల్లా ఉపాధి అధికారి రాధిక**

**మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ప్రతినిధి ప్రజాబలం అక్టోబర్ 12:** జిల్లా నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు జిల్లా ఉపాధి కార్యాలయం ఆధ్వర్యంలో ఈ నెల 14న జాబ్‌మేళా నిర్వహించనున్నారు. అపోలో ఫార్మసీ సంస్థలో ఫార్మసిస్ట్, ఫార్మసీ అసిస్టెంట్, అసిస్టెంట్ పోస్టుల భర్తీకి అభ్యర్థులను ఎంపిక చేయనున్నారు.

షామీర్‌పేట మండలం అంతాయిపల్లిలోని ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్ సముదాయం రెండో అంతస్తులో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు మేళా జరుగుతుంది. డి.ఫార్మసీ, బి.ఫార్మసీ, ఎం.ఫార్మసీ పూర్తి చేసి, ఫార్మసీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా లో రిజిస్ట్రేషన్ చేసుకున్నవారు ఫార్మసిస్ట్ పోస్టులకు అర్హులు. సంబంధిత రంగంలో అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యం ఉంటుంది.

ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ.12,500 నుంచి రూ.25,000 వరకు వేతనం అందించనున్నారు. దీంతోపాటు ప్రావిడెంట్ ఫండ్ , ఉద్యోగుల రాష్ట్ర బీమా, సెలవులు, వార్షిక బోనస్, ఆరోగ్య సదుపాయాలు, యూనిఫాం, పండుగ సెలవులు, ఇతర సంస్థాగత ప్రయోజనాలు కల్పించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

అర్హులైన అభ్యర్థులు తమ విద్యార్హతల ధ్రువపత్రాలు, బయోడేటాతో నిర్ణీత సమయానికి హాజరుకావాలని జిల్లా ఉపాధి అధికారి రాధిక సూచించారు.

వేదిక: ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్ సముదాయం, రెండో అంతస్తు, అంతాయిపల్లి గ్రామం, షామీర్‌పేట మండలం, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా
కార్యాలయంలో సంప్రదించాలి.

సంప్రదింపులు:లి జిల్లా ఉపాధి కార్యాలయం, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా. అదనపు ప్రయోజనాలు, సంప్రదింపు వివరాలను జాబ్‌మేళాకు హాజరయ్యే ముందు కార్యాలయం ద్వారా నిర్ధారించుకోవాలి.

# ప్రజావాణి అర్జీలు వెంటనే పరిష్కరించాలి

**జిల్లా అదనపు కలెక్టర్ విజయేంద్ రెడ్డి**



**మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ప్రతినిధి ప్రజాబలం అక్టోబర్ 12:** ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి వచ్చిన అర్జీలను ఏమాత్రం ఆలస్యం చేయకుండా నిబంధనల ప్రకారం వెంటనే పరిష్కరించాలని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి అధికారులను ఆదేశించారు.

సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో డిఆర్ఓ మాలతి తో కలిసి అదనపు కలెక్టర్ అర్జీదారుల నుండి వినతులను స్వీకరించారు. ప్రజావాణి కార్యక్రమంలో రెవెన్యూ, పంచాయతీ రాజ్, సివిల్ సప్లైస్, మున్సిపల్ తదితర శాఖలకు సంబంధించి మొత్తం 88 దరఖాస్తులు ప్రజల నుండి స్వీకరించినట్లు అదనపు కలెక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన బాధితుల సమస్యలకు ప్రాధాన్యతనిచ్చి వేగంగా పరిష్కారం చూపాలని అధికారులకు సూచించారు. స్వీకరించిన దరఖాస్తులపై తీసుకున్న చర్యల వివరాలను ఆన్ లైన్ లో వెంట వెంట నమోదు చేయాలని సంబంధిత అధికారులకు అదనపు కలెక్టరు సూచించారు.

ఈ సమావేశంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించి, సత్వరమే పరిష్కరించాలి.

**జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్**
**ప్రజావాణిలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించిన జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్లు**



**ఖమ్మం జిల్లా బ్యూరో ప్రజాబలం అక్టోబర్ 12:**ప్రజావాణిలో ప్రజల నుంచి అందిన ప్రతి ఫిర్యాదు దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి, సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ జిల్లా అధికారులను ఆదేశించారు.సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర్ టిఎస్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి, ట్రైనీ కలెక్టర్ పారస్ కుమార్ లతో కలిసి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు.ముదిగొండ మండలం మల్లన్నపాలెం గ్రామానికి చెందిన ఎస్.కే. జాన్ బీ తన సదరం సర్టిఫికెట్‌లో తప్పుడు వివరాల కారణంగా దివ్యాంగుల పింఛన్ నిలిచిపోయిందని, తిరిగి పింఛన్ మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు సమర్పించారు. ఈ విషయాన్ని పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకోవాలని డీఆర్డీఓను కలెక్టర్ ఆదేశించారు.

పీడీఎస్‌యూ అధ్యక్షుడు టి. లక్ష్మణ్ పదవ తరగతి విద్యార్థులకు టాలెంట్ టెస్ట్ పేరుతో ముందస్తు ఇంటర్మీడియట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్న వేదాంత లెర్నింగ్ సెంటర్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ అర్జీ సమర్పించారు. దీనిపై పరిశీలించి నిబంధనల ప్రకారం అవసరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారిని కలెక్టర్ ఆదేశించారు.

ఏదులాపురం పట్టణానికి చెందిన ఎస్.కే. ఆఫ్సానా తాను ఎంబీఏ పూర్తి చేశానని, తనకు ఉపాధి కల్పించాలని కోరుతూ దరఖాస్తు సమర్పించగా, విద్యార్హతలకు అనుగుణంగా ఉపాధి అవకాశాలపై పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా ఉపాధి అధికారికి సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి రామ్మూర్తి, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# 'సేవా సంకల్ప అభియాన్'లో భాగంగా మైనారిటీ మోర్చా ఆధ్వర్యంలో భారీ రక్తదాన శిబిరం విజయవంతంగా నిర్వహించబడింది...

**తెలంగాణ బీజేపీ సీనియర్ రాష్ట్ర నాయకురాలు అమీనా.**







**అంబర్‌పేట్ ప్రజాబలం ప్రతినిధి:** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 25 ఏళ్ల అంకితభావంతో కూడిన ప్రజా జీవితం, ప్రజలకు సేవ చేయాలనే సంకల్పం నుండి స్ఫూర్తి పొంది, బీజేపీ రాష్ట్ర మైనారిటీ మోర్చా సీనియర్ నాయకురాలు అమీనా ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించబడింది. ఈ సందర్భంగా 'సేవా సంకల్ప అభియాన్' శిబిరాన్ని విజయవంతంగా నిర్వహించారు. రక్తదానం చేయడం గొప్ప మానవతా కార్యమని, ప్రాణాలను కాపాడటమే గొప్ప సేవ అని అమీనా అన్నారు. ప్రతి రక్తపు చుక్కా ముఖ్యమైనదని, అవసరంలో ఉన్న వారి ప్రాణాలను కాపాడటంలో ప్రతి దాత కీలక పాత్ర పోషించగలరని ఆమె తెలిపారు. ఈ సందర్భంగా, కరుణ, నిబద్ధత, అంకితభావంతో మానవాళికి సేవ చేస్తూనే ఉండాలని అందరికీ పిలుపునిస్తూ సామాజిక సేవ పట్ల నిబద్ధతను వ్యక్తం చేశారు. సేవ, మానవత్వం, దేశ నిర్మాణం పట్ల మన నిబద్ధతను కొనసాగిస్తూనే సమాజ సంక్షేమానికి తోడ్పడాలని విజ్ఞప్తి చేశారు. మైనారిటీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు జగమోహన్ సింగ్ జీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో హర్‌ప్రీత్ సింగ్, రజనీష్ జైన్, మహమ్మద్ గజినీ, ఖాలిద్ చిస్తీ, రమేష్ యాదవ్, శరత్ శ్యామ్ నారాయణ, శ్రీ లత పాల్గొన్నారు.

# రియాద్ విమానాశ్రయంపై మరోసారి క్షిపణి దాడి ఒకరు మృతి।



రియాద్ సౌదీ అరేబియా రాజధాని రియాద్ లోని కింగ్ ఖాలిద్ అంతర్జాతీయ విమానాశ్రయంపై జరిగిన రెండో దాడిలో ఒకరు మృతి చెందారు. మరో 11 మందికి గాయాలు అయ్యాయి. ప్రొజెక్టైల్ దాడి లో ప్రయాణీకుల హాల్‌లో అగ్నిప్రమాదం జరిగింది. అంతకుముందు రోజు జరిగిన దాడిలో 13 మంది మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ దాడుల వెనుక తాము ఉన్నామని యెమెన్‌లోని హౌతీలు ప్రకటించారు. సౌదీ విమానాశ్రయాలు, గగనతలాన్ని ఉపయోగించవద్దని హెచ్చరించారు.

# ఐసీఎఫ్ఏఐ లా స్కూల్, హైదరాబాద్ -- రాజీవ్ గాంధీ నేషనల్ యూనివర్సిటీ ఆఫ్ లా, పంజాబ్‌తో అవగాహన ఒప్పందం

## న్యాయ విద్య, నాణ్యమైన పరిశోధన, విద్యా సహకారాన్ని బలోపేతం చేసేందుకు డైరెక్టర్ జనరల్ ప్రొఫెసర్ డాక్టర్ విజయేందర్ కుమార్ చొరవ

**హైదరాబాద్, అక్టోబర్ 12, 2026: (ప్రజాబలం ప్రతినిధి)** హైదరాబాద్‌లోని ది ఐసీఎఫ్ఏఐ ఫౌండేషన్ ఫర్ హయ్యర్ ఎడ్యుకేషన్ (IFHE)కు చెందిన ఐసీఎఫ్ఏఐ లా స్కూల్, పంజాబ్‌లోని పాటియాలాలో ఉన్న రాజీవ్ గాంధీ నేషనల్ యూనివర్సిటీ ఆఫ్ లా (RGNUL)తో అవగాహన ఒప్పందం (MoU) కుదుర్చుకుంది. న్యాయ విద్యలో విద్యా సహకారాన్ని విస్తరించడం, నాణ్యమైన పరిశోధనను ప్రోత్సహించడం, విద్యార్థులు మరియు అధ్యాపకులకు కొత్త అవకాశాలను





కల్పించడం ఈ ఒప్పందం ప్రధాన లక్ష్యం.

2026 అక్టోబర్ 12న పంజాబ్‌లోని పాటియాలాలో RGNUL ప్రాంగణంలో ఈ ఒప్పందంపై ఐసీఎఫ్ఏఐ లా స్కూల్, ×ఖీఅజు హైదరాబాద్ డైరెక్టర్ జనరల్ ప్రొఫెసర్ డాక్టర్ విజయేందర్ కుమార్ సంతకం చేశారు. ఈ కార్యక్రమానికి గోవాలోని ఇండియా ఇంటర్నేషనల్ యూనివర్సిటీ ఆఫ్ లీగల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ (IIULER) వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ (డాక్టర్) ఆర్. వెంకటరావు, RGNUL రిజిస్ట్రార్ డాక్టర్ ఇవ్నీత్ కౌర్ వాలియా, ఇరు విద్యాసంస్థలకు చెందిన అధ్యాపకులు హాజరయ్యారు.

న్యాయ విద్యలో నాణ్యతను పెంపొందించడం, పరిశోధనా సంస్కృతిని బలోపేతం చేయడం, దేశంలోని ప్రముఖ న్యాయ విద్యాసంస్థలతో దీర్ఘకాలిక భాగస్వామ్యాలను అభివృద్ధి చేయడంపై ప్రొఫెసర్ డాక్టర్ విజయేందర్ కుమార్ ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. ఆయన నాయకత్వంలో ఐసీఎఫ్ఏఐ లా స్కూల్ బోధన, పరిశోధన, సమకాలీన సామాజిక మరియు న్యాయపరమైన సవాళ్లపై అధ్యయనాలకు ప్రాధాన్యతనిస్తోంది.

ఈ అవగాహన ఒప్పందం ద్వారా జాతీయ, అంతర్జాతీయ సదస్సులు, సెమినార్లు, వర్క్‌షాప్‌లు, అధ్యాపక అభివృద్ధి కార్యక్రమాలు, ప్రత్యేక ఉపన్యాసాలను సంయు క్తంగా నిర్వహించనున్నారు. అధ్యాప కుల మార్పిడి, విద్యార్థుల మార్పిడి కార్యక్రమాలు, ఇంటర్న్‌షిప్ అవకాశాలు, సంయుక్త పరిశోధనా ప్రాజెక్టులు, ఉమ్మడి ప్రచురణలు, న్యాయ రంగంలోని నూతన అంశాలపై అధ్యయనాలకు సహకారం అందించ నున్నారు. అదేవిధంగా గ్రంథాలయాలు, ఈ-రిసోర్సుల వినియోగం, న్యాయ సహాయ కార్యక్రమాలు, సమాజ సేవా కార్యక్రమాల్లోనూ ఇరు సంస్థలు కలిసి పనిచేయనున్నాయి.

ఈ సందర్భంగా ప్రొఫెసర్ (డాక్టర్) ఆర్. వెంకటరావు ఈ చొరవను అభినందిస్తూ, భారతదేశంలో న్యాయ విద్యను మరింత బలోపేతం చేయడానికి విద్యాసంస్థల మధ్య పరస్పర సహకారం ఎంతో అవసరమని పేర్కొన్నారు. RGNUL రిజిస్ట్రార్ డాక్టర్ ఇవ్నీత్ కౌర్ వాలియా మాట్లాడుతూ, ఇలాంటి భాగస్వామ్యాలు విద్యార్థులు, అధ్యాపకులకు మెరుగైన విద్యా పరిజ్ఞానాన్ని, వృత్తిపరమైన అభివృద్ధి అవకాశాలను అందిస్తాయని తెలిపారు.

మీడియాతో మాట్లాడిన ఐసీఎఫ్ఏఐ లా స్కూల్ నాయకత్వం, నాణ్యమైన న్యాయ విద్యను అందించడం, ఉన్నత ప్రమాణాలతో కూడిన పరిశోధనను ప్రోత్సహించడం, నూతన ఆలోచనలు, అంతరశాఖ పరిశోధనలు, విద్యా సహకారాన్ని విస్తరించడం తమ సంస్థ ప్రధాన లక్ష్యాలని స్పష్టం చేసింది. ప్రముఖ విద్యాసంస్థలతో భాగస్వామ్యాలు భవిష్యత్ న్యాయ నిపుణులను తీర్చిదిద్దడంతో పాటు, పరిశోధనా ఫలితాలను మెరుగుపరచి, దేశంలో న్యాయ విద్యా వ్యవస్థ అభివృద్ధికి దోహదపడతాయని పేర్కొంది.

ప్రొఫెసర్ డాక్టర్ విజయేందర్ కుమార్ మాట్లాడుతూ, అధ్యాపకులు, విద్యార్థులు సమకాలీన న్యాయపరమైన మరియు సామాజిక సమస్యలపై ప్రభావవంతమైన పరిశోధనలు చేపట్టేందుకు, విజ్ఞానాన్ని పరస్పరం పంచుకునేందుకు, విద్యా వాతావరణాన్ని మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దేందుకు విద్యాసంస్థల మధ్య నిరంతర సహకారం అవసరమని నొక్కిచెప్పారు.

ఈ అవగాహన ఒప్పందం ఐసీఎఫ్ఏఐ లా స్కూల్ విద్యా భాగస్వామ్యాలను మరింత విస్తరించడంతో పాటు, బోధన, పరిశోధన, సమాజ సేవలో నాణ్యతను పెంపొందించే దిశగా మరో కీలక ముందడుగుగా నిలవనుంది. ఈ భాగస్వామ్యం ద్వారా విద్యార్థులు, అధ్యాపకులు, పరిశోధకులకు కొత్త అవకాశాలు లభించడంతో పాటు, దేశంలోని న్యాయ విద్యారంగానికి ప్రయోజనం చేకూరనుంది.

# పలు కుటుంబాలకు మట్టా దయానంద్ పరామర్శ



**ఖమ్మం జిల్లా బ్యూరో ప్రజాబలం అక్టోబర్ 12:**తల్లాడ మండలంలోని పలు గ్రామాల్లో రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డా. మట్టా దయానంద్ పర్యటించి, అనారోగ్యంతో బాధపడుతున్న వారిని పరామర్శించడంతో పాటు, ఇటీవల మృతి చెందిన పలువురి కుటుంబాలను కలిసి ప్రగాఢ సానుభూతి తెలిపారు. నూతనకల్ గ్రామం ఇటీవల మోకాలికి శస్త్రచికిత్స చేయించుకున్న తూము వీరభద్రయ్యని పరామర్శించి, వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.



మిట్టపల్లి గ్రామం పొట్రూ శ్రీను తండ్రి పొట్రూ ప్రకాశరావు దశదిన కర్మ సందర్భంగా వారి చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలిపారు.

మిట్టపల్లి ఎస్సీ కాలనీలో ఇటీవల మృతి చెందిన మాగంటి బలరాం బాబాయి మాగంటి యాలాద్రి కుటుంబాన్ని పరామర్శించి, వారికి ధైర్యం చెప్పారు. ముద్దునూరు గ్రామం తాళ్లూరి అప్పయ్య దశదిన కర్మ సందర్భంగా వారి చిత్రపటానికి నివాళులర్పించి, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# వైరా మున్సిపాలిటీ అభివృద్ధి ధ్యేయంగా పనిచేస్తా.

## ఎజెండాలోని 31 అంశాలు ఆమోదించిన సమావేశం

## పురపాలక సంఘం సాధారణ సమావేశంలో

## డాక్టర్ కాపా చంద్రకళ మురళీకృష్ణ



**ఖమ్మం జిల్లా బ్యూరో ప్రజాబలం అక్టోబర్ 12:**వైరా పురపాలక సంఘంకార్యాలయంలో సోమవారం సాధారణ జరిగింది ఈ సమావేశంలో వైరా శాసనసభ్యులు రాందాస్ నాయక్ పాల్గొన్నారు మున్సిపల్ సమావేశంలో మున్సిపల్ చైర్ పర్సన్ డాక్టర్ కాపా చంద్రకళ మురళీకృష్ణ మాట్లాడుతూ మెరుగైన సేవలుఅందించేందుకు , పురపాలక అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు వైరా మున్సిపాలిటీ సమగ్ర అభివృద్ధి నా ధ్యేయం అని . కాపా చంద్రకళ స్పష్టం చేశారు రాజకీయాలకతీతంగా వైరా మున్సిపాలిటీ తీర్చిదిద్దుతానని ఆమె పేర్కొన్నారు పట్టణంలోని ప్రతి వార్డులో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి కృషి చేస్తానని తాగునీరు, పారిశుద్ధ్యం, అంతర్గత రహదారులు, డ్రైనేజీ, వీధి దీపాల న.పట్టణ అభివృద్ధి పదశీల్లో నడిపించడం వైరా పట్టణ సమగ్ర అభివృద్ధికి అవసరమైన చర్యలు చేపడుతూ, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేస్తామని డాక్టర్ కాపచంద్రకళ మురళీకృష్ణ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఏజెండాలోని 32 అంశాల్లో 31 సమావేశంలో ఆమోదించారు అలాగే టేబుల్ ఏజండాగా ప్రవేశపెట్టిన నాలుగు అంశాలు మూడింటిని సమావేశం ఆమోదించింది ఒక్కో వార్డుకు రూపాయి లక్షతో గ్రావెల్ తోలకంప్రతి వార్డు సమగ్ర అభివృద్ధికి గాంధీచౌక అభివృద్ధికి ప్రణాళిక స్వచ్ఛభారత్ ప్లాస్టిక్ వాడకంపై అవగాహన కార్యక్రమం త్వరలో చేపడతామని ఈ సందర్భంగా కాకా చంద్రకళ తెలిపారు కౌన్సిలర్లు ఉంద్రు వరలక్ష్మి ముళ్ళపాటి విజయలక్ష్మి పణితి సైదులు చింత నిప్పు సులోచన నిమ్మ తోట శ్రావణి మున్సిపల్ కమిషనర్ రామచంద్ర రావు మునిసిపల్ మేనేజర్ సుధీర్ అధికారులు, సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

# 'NO'అని రిప్లై ఇచ్చినందుకే ఒకరి బ్యాంక్ ఖాతా నిలువునా ఖాళీ అయిపోయింది!: సజ్జనార్

## వాట్సాప్‌లో 'చీూ' అని రిప్లై ఇస్తే బ్యాంక్ ఖాతా ఖాళీ

## ఇది సైబర్ నేరగాళ్ల సరికొత్త ఆటో ఎగ్జిక్యూషన్ ఫైల్ అటాక్

## ఓటీపీ, లింకులు లేకుండానే జరుగుతున్న మోసం

## గుర్తుతెలియని నంబర్లను బ్లాక్ చేయాలని సూచించిన సజ్జనార్

## మోసపోతే 1930కి కాల్ చేయాలని విజ్ఞప్తి

ఓటీపీ చెప్పాల్సిన పనిలేదు, అనుమానాస్పద లింక్‌లను క్లిక్ చేయక్కర్లేదు.. కేవలం 'చీూ' అని రెండక్షరాల సమాధానం ఇస్తే చాలు.. మీ బ్యాంక్ ఖాతాలోని సొమ్ము క్షణాల్లో మాయం! సాంకేతికతను వాడుకుని సైబర్ నేరగాళ్లు పన్నిన ఈ సరికొత్త పన్నాగం ఇప్పుడు పెను సవాలుగా మారింది. 'ఆటో ఎగ్జిక్యూషన్ ఫైల్ అటాక్'గా పిలుస్తున్న ఈ ప్రమాదకరమైన మోసంపై ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ సోషల్ మీడియా వేదికగా హెచ్చరించారు. ఈ మోసం ఎలా పనిచేస్తుందో, దాని నుంచి ఎలా రక్షించుకోవాలో ఆయన సమగ్రంగా వివరించారు.

మోసం ఎలా జరుగుతుందంటే..

సైబర్ కేటుగాళ్లు పక్కా ప్రణాళికతో ఈ మోసానికి పాల్పడుతున్నారు. ముందుగా, గుర్తుతెలియని వాట్సాప్ నంబర్ నుంచి మీ ఫోన్‌కు ఒక సందేశం వస్తుంది. 'మీ బ్యాంక్ ఖాతా నుంచి ఇంత మొత్తం డెబిట్ అయ్యింది' అని ఆ మెసేజ్‌లో ఉంటుంది. అది చూసిన వెంటనే ఎవరైనా కంగారుపడటం సహజం. ఆ కంగారును ఆసరాగా చేసుకుని, వెంటనే మరో సందేశం పంపుతారు. 'ఈ లావాదేవీ మీరు చేయకపోతే, వెంటనే చీూ అని రిప్లై ఇవ్వండి' అని అందులో సూచిస్తారు. ఖాతాలో డబ్బులు పోయాయన్న ఆందోళనతో చాలామంది ఆలోచించకుండా 'చీూ' అని టైప్ చేసి పంపేస్తారు.

అక్కడే అసలు మోసం దాగి ఉంది. మీరు 'చీూ' అని సమాధానం పంపిన మరుక్షణమే, ఆ సందేశంలో కంటికి కనిపించ్కుండా దాగి



ఉన్న మాల్‌వేర్ స్క్రిప్ట్ లేదా ఆటో ఎగ్జిక్యూషన్ ఫైల్స్ యాక్టివేట్ అవుతాయి. ఈ ఫైల్స్ హ్యాకర్లకు మీ మొబైల్ ఫోన్‌పై పూర్తి నియంత్రణను (రిమోట్ యాక్సెస్) అందిస్తాయి. దీంతో వారు మీ ఫోన్‌లోని బ్యాంకింగ్ యాప్‌లు, పాస్‌వర్డ్‌లు, ఇతర సున్నితమైన సమాచారాన్ని సులభంగా దొంగిలించి, క్షణాల్లో మీ బ్యాంక్ ఖాతాను పూర్తిగా ఖాళీ చేస్తారు. ఇటీవల ఓ చార్టర్డ్ అకౌంటెంట్ సైతం ఈ మోసం బారిన పడి భారీగా నష్టపోయిన ఘటన ఈ దాడి తీవ్రతకు అద్దం పడుతోంది.

ప్రజలకు సజ్జనార్ కీలక సూచనలు

ఈ ప్రమాదకరమైన మోసం నుంచి ప్రజలు తమను తాము కాపాడుకోవడానికి వీసీ సజ్జనార్ పలు కీలక సూచనలు చేశారు.

గుర్తుతెలియని నంబర్ల నుంచి బ్యాంక్ లావాదేవీల పేరుతో వచ్చే సందేశాలకు ఎట్టిపరిస్థితుల్లోనూ 'జుూ' లేదా 'చీూ' అని రిప్లై ఇవ్వకూడదు.

అలాంటి సందేశాలు రాగానే కంగారు పడకుండా, వెంటనే ఆ నంబర్‌ను బ్లాక్ చేసి, చాట్‌ను పూర్తిగా డిలీట్ చేయాలి. నిజంగా మీ ఖాతా నుంచి డబ్బు కట్ అయిందో లేదో తెలుసుకోవడానికి మీ బ్యాంక్ అధికారిక మొబైల్ యాప్ లేదా నెట్ బ్యాంకింగ్ ద్వారా మాత్రమే చెక్ చేసుకోవాలి. వాట్సాప్ సందేశాలను అస్సలు నమ్మవద్దు.

ఏ అధికారిక బ్యాంక్ లేదా ఆర్థిక సంస్థ కూడా వాట్సాప్ ద్వారా ఇలాంటి లావాదేవీల ధ్రువీకరణ కోరదని గుర్తుంచుకోవాలి.

మోసపోతే ఏం చేయాలి?

ఒకవేళ పొరపాటున ఎవరైనా ఈ మోసానికి గురైతే, ఏమాత్రం ఆలస్యం చేయకుండా 'గోల్డెన్ అవర్'లో స్పందించాలని సజ్జనార్ సూచించారు. వెంటనే జాతీయ సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ నంబర్ '1930'కి కాల్ చేయాలి. లేదా ఛఎఎవతీఛతీఱఎవ.స్త్రశీఙ.ఱఅ వెబ్ సైట్‌లో ఫిర్యాదు నమోదు చేయాలి. మోసం జరిగిన వెంటనే ఫిర్యాదు చేస్తే, దొంగిలించబడిన డబ్బును ఫ్రీజ్ చేసి తిరిగి రాబట్టే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని ఆయన వివరించారు. కంగారులో ఇచ్చే ఒక్క సమాధానం జీవితకాల సంపాదనను హరించివేయగలదని, కాబట్టి ప్రతి ఒక్కరూ అత్యంత జాగ్రత్తగా ఉండాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# రష్యా - ఉక్రెయిన్ మధ్య ఇంధన రంగ కాల్పుల విరమణకు అంగీకారం

## డోనాల్డ్ ట్రంప్



న్యూయార్క్! రష్యా - ఉక్రెయిన్ మధ్య ఇంధన రంగంలో కాల్పుల విరమణకు అంగీకారం కుదిరినట్లు అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. ఈ ప్రకటనను ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలొదిమిర్ జెలెన్‌స్కీ స్వాగతించారు. ఇది అందరికీ మంచి వార్త అని వెల్లడించారు. రష్యా ఇంధన మౌలిక సదుపాయాలపై దాడి చేయకుండా ఉండేందుకు ఉక్రెయిన్ సిద్ధంగా ఉందని అన్నారు.

# ఆర్టీసీ ఎన్నికల్లో ఓటమి.. కాంగ్రెస్ సీరియస్!

.హైదరాబాద్ , అక్టోబరు 12 తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్‌ఆర్టీసీ) గుర్తింపు సంఘం ఎన్నికలు అధికార కాంగ్రెస్ పార్టీలో తీవ్ర ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. అక్టోబర్ 9న ముగిసిన ఆర్టీసీ ఎన్నికల్లో కాంగ్రెస్ మద్దతు తెలిపిన తెలంగాణ ఆర్టీసీ వర్కర్స్ యూనియన్ (టీడబ్ల్యూ) ఓటమి పాలైనట్లు సమాచారం. దీంతో ఈ అంశంపై కాంగ్రెస్ పార్టీ తీవ్ర ఆగ్రహంతో ఉంది. ముఖ్యంగా ఏఐటీయూసీ మద్దతుతో బరిలోకి దిగిన ఎంప్లాయిస్ యూనియన్ (ఈయూ) విజయం సాధించడం, అధికార పార్టీకి మింగుడుపడడం లేదు. ఈ పరిణామంపై టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.స్థానిక ప్రజాప్రతినిధుల ఉదాసీనత వల్లే ఆర్టీసీ ఎన్నికల్లో ఓడిపోయినట్లు కాంగ్రెస్ పార్టీ భావిస్తోంది. కార్మికులను తమ వైపు తిప్పుకోవడానికి, అధికారంలో ఉన్నామనే ధీమాతో టీడబ్ల్యూయూని గెలిపించుకోవాలని కాంగ్రెస్ పార్టీ వ్యూహాత్మకంగా వ్యవహరించింది. ఇందులో భాగంగానే రాష్ట్రంలోని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు, సంబంధిత మంత్రులు, ఎమ్మెల్యేలు క్షేత్రస్థాయిలో సమన్వయం చేసుకుంటూ యూనియన్ గెలుపు కోసం కృషి చేయాలని పార్టీ అధిష్టానం స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. అయితే, క్షేత్రస్థాయిలో పార్టీ ఎమ్మెల్యేలు ఈ ఎన్నికలను సీరియస్‌గా తీసుకోలేదని, ఆర్టీసీ కార్మికుల సమస్యలను పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించారన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఎన్నికల వేళ కార్మికులను మమేకం చేయడంలో, స్థానిక సమస్యలపై స్పందించడంలో ప్రజాప్రతినిధులు విఫలమయ్యారంటూ టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. పార్టీ అధికారంలో ఉండి కూడా కార్మిక సంఘం ఎన్నికల్లో ఓడిపోవడం పట్ల ఆయన నేతల తీరును తప్పుబట్టారు.అక్టోబర్ 17న అధికారికంగా వెలువడనున్న ఈ ఎన్నికల తుది ఫలితాలు కాంగ్రెస్ పార్టీకి రాబోయే కాలంలో ఎదురుకాబోయే సవాళ్లకు అద్దం పడుతున్నాయని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. త్వరలో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ, జీహెచ్‌ఎంసీ ఎన్నికలు జరగనున్నాయి. ఈ తరుణంలో ఆర్టీసీ కార్మిక యూనియన్ ఎన్నికల్లో ఎదురుదెబ్బ తగలడం పార్టీ వర్గాలను ఆందోళనకు గురిచేస్తోంది. కార్మిక రంగంలో పట్టుకోల్పోవడం భవిష్యత్తు రాజకీయాలపై ప్రభావం చూపుతుందనే ఆందోళన పార్టీ అధిష్టానంలో వ్యక్తమవుతోంది. క్షేత్రస్థాయిలో పార్టీ యంత్రాంగానికి, ప్రజాప్రతినిధులకు మధ్య సమన్వయం కొరవడుతోందనడానికి ఈ ఘటనే నిదర్శనమనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఎమ్మెల్యేలు కేవలం పదవులకే పరిమితమై పార్టీ బలోపేతంపై దృష్టి పెట్టకపోతే రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని పార్టీ గట్టి సంకేతాలు పంపుతోంది. ఈ పరిణామాల నేపథ్యంలో పార్టీ అధిష్టానం అంతర్గత ప్రక్షాళనకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. ఎన్నికల్లో పార్టీ ఆదేశాలను బేఖాతరు చేసిన వారిపై, బాధ్యతారహితంగా వ్యవహరించిన ఎమ్మెల్యేలపై జిల్లాల వారీగా నివేదికలు తెప్పించుకుని చర్యలు తీసుకునే అవకాశాలున్నాయి. ఏది ఏమైనప్పటికీ, ఆర్టీసీ ఎన్నికల వేడి తెలంగాణ కాంగ్రెస్‌లో వర్గపోరును, నాయకుల పనితీరులోని లోపాలను బట్టబయలు చేసిందనే చెప్పాలి.

కాంగ్రెస్ ప్రభుత్వానికి వార్నింగ్ బెల్స్!?

తెలంగాణలో ఆర్టీసీ ఉద్యోగ సంఘాల ఎన్నికల ఫలితాలు రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ ఊహించినదానికి భిన్నంగా ఈ ఎన్నికల ఫలితాలు వచ్చాయి. కాంగ్రెస్ పార్టబలపరిచిన యూనియన్లకు ఈ ఎన్నికల్లో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. రాష్ట్రవ్యాప్తంగా ప్రభావం చూపించే ఆర్టీసీ కార్మిక సంఘాల ఎన్నికల్లో అధికార పార్టీ ఓటమి చవిచూడడం పట్ల పార్టీ శ్రేణులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నాయి. కాంగ్రెస్ పార్టీకి ఇవి వార్నింగ్ బెల్స్ లాంటివని విశ్లేషకులు భావిస్తున్నారు. ప్రజా వ్యతిరేకతకు ఇవి అద్దం పడుతున్నాయని, అప్రమత్తం కాకపోతే కాంగ్రెస్ పార్టీకి ఇబ్బందులు తప్పవనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.అక్టోబర్ 9న ఆర్టీసీ కార్మిక సంఘాల ఎన్నికలు జరిగాయి. వీటిని కాంగ్రెస్ పార్టీ అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. తాము మద్దతు ఇచ్చిన తెలంగాణ వర్కర్స్ యూనియన్ , స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ వర్కర్స్ యూనియన్ కూటమి విజయం సాధించాలని భావించింది. అయితే? సీపీఐ బలపరిచిన ఎంప్లాయిస్ యూనియన్ , తెలంగాణ మజ్దూర్ యూనియన్ నేషనల్ మజ్దూర్ యూనియన్ కూటమి ఈ ఎన్నికల్లో ఘన విజయం సాధించింది. రాష్ట్ర స్థాయిలో క్లాస్-3 విభాగంలో సీపీఐ అనుబంధ యూనియన్ అయిన ఎంప్లాయిస్ యూనియన్ 18,250 ఓట్లను సాధించగా, కేవలం 13,670 ఓట్లతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. దీంతో ఎంప్లాయిస్ యూనియన్ సుమారు 4,580 ఓట్ల భారీ ఆధిక్యాన్ని నమోదు చేసింది. అలాగే ప్రాంతీయ స్థాయిలో క్లాస్-6 విభాగంలో 13,907 ఓట్లను సాధించింది. ఈ ఎన్నికల ఫలితాలు కేవలం యూనియన్లకే పరిమితం కాలేదు.. రాజకీయంగా ఇది అధికార పార్టీకి పెద్ద హెచ్చరికగా మారింది. ముఖ్యంగా గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో కాంగ్రెస్ మద్దతు కూటమి కేవలం 3 యూనిట్లను మాత్రమే గెలవడం పార్టీ నేతలను విస్మయానికి గురిచేసింది. పలు జిల్లాల్లో మంత్రులు, ఎమ్మెల్యేలు, పార్టీ ఇన్‌చార్జ్‌లు ఎన్నికల ప్రచారంలో చురుగ్గా పాల్గొనకపోవడం, కొందరు నేతలు ప్రత్యర్థి యూనియన్లకు మద్దతు ఇవ్వడం వంటి ఆరోపణలు పార్టీలో అంతర్గత విభేదాలను బయటపెడుతున్నాయి. అక్టోబర్ 14, 15 తేదీల్లో పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియ జరగనుండగా, అక్టోబర్ 17న అధికారిక తుది ఫలితాలు వెలువడనున్నాయి. అయితే మొత్తం 900 లోపే ఉన్న పోస్టల్ బ్యాలెట్లు ఇప్పటికే ఉన్న 4,580 ఓట్ల భారీ ఆధిక్యాన్ని మార్చలేవని స్పష్టమవుతోంది. ఈ పరిణామాలు కాంగ్రెస్ పార్టీ అగ్రనేతలను పునరాలోచనలో పడేశాయి. అనుబంధ సంఘాలతో సమన్వయం, ఆర్టీసీ ఉద్యోగులతో నిరంతర సంప్రదింపులపై పార్టీ నాయకత్వం ఇప్పుడు ప్రత్యేక దృష్టి సారించింది. క్షేత్రస్థాయిలో పార్టీ పట్టు సడలుతుందనే సంకేతాలు వెలువడుతున్న నేపథ్యంలో, రాబోయే రాజకీయ సవాళ్లను ఎదుర్కొనేందుకు కాంగ్రెస్ పార్టీ తన యంత్రాంగాన్ని సరిదిద్దుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

# గవర్నర్ కోటా ఎమ్మెల్సీల వేడి.. తెరపైకి మాదిగలు!

హైదరాబాద్ అక్టోబరు 12 తెలంగాణలో ప్రస్తుతం గవర్నర్ కోటా ఎమ్మెల్సీల భర్తీ అంశం చర్చనీయాంశంగా మారింది. నవంబర్‌లో మూడు నామినేటెడ్ ఎమ్మెల్సీ స్థానాలు ఖాళీ కానుండటంతో, అధికార కాంగ్రెస్ పార్టీలో ఆశావహుల సంఖ్య గణనీయంగా పెరిగింది. ముఖ్యంగా.. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి శాసనమండలిలో తమ వర్గానికి తగిన ప్రాతినిధ్యం దక్కలేదంటూ మాదిగ సామాజిక వర్గం నుంచి వస్తున్న డిమాండ్లు రాజకీయ వర్గాల్లో తీవ్ర ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి.నవంబర్‌లో మూడు గవర్నర్ కోటా ఎమ్మెల్సీ స్థానాలు ఖాళీ కానున్నాయి. వీటిని భర్తీ చేసేందుకు కాంగ్రెస్ పార్టీ కసరత్తు చేస్తోంది. వివిధ సమాజిక సమీకరణాలను బేరీజు వేస్తోంది. ఇటీవల గ్రాడ్యుయేట్ ఎన్నికలకోసం ఇద్దరినీ రెడ్డి సమాజిక వర్గానికి చెందిన నేతలనే కాంగ్రెస్ హైకమాండ్ ఎంపిక చేసింది. దీంతో గవర్నర్ కోటా స్థానాలను వెనుకబడిన వర్గాలకు ఇవ్వాలనే డిమాండ్ ఊపందుకుంది.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇప్పటికే పద్మశాలీ వర్గానికి చెందిన ఒకరికి ఎమ్మెల్సీ స్థానంలో ప్రాతినిధ్యం కల్పిస్తామని హామీ ఇచ్చారు. మరోవైపు, టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ మూడు స్థానాలలో కనీసం రెండు స్థానాలను బీసీ వర్గాలకే కేటాయించే అవకాశాలున్నట్లు స్పష్టం చేశారు. ఈ పరిణామాల నేపథ్యంలో మాదిగ వర్గ నాయకులు తమకు అవకాశం కల్పించాలంటూ ఒత్తిడి పెంచారు.తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించినప్పటి నుంచి ఇప్పటివరకు శాసనమండలిలో మాదిగ సామాజిక వర్గానికి ప్రాతినిధ్యం లభించలేదన్నది ఆ వర్గ నేతల ప్రధాన వాదన. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఎస్సీ కోటా కింద ఎమ్మెల్సీలుగా అవకాశం పొందిన ఎం.ఎస్. ప్రభాకర్, గొరెటి వెంకన్న ఇద్దరూ కూడా మాల సామాజిక వర్గానికి చెందినవారేనని వారు గుర్తు చేస్తున్నారు. అంతేకాకుండా, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా అద్దంకి దయాకర్ వంటి ప్రముఖులకు మండలిలో అవకాశం కల్పించినప్పటికీ, ఆ స్థానం కూడా మాల వర్గానికే దక్కిందని మాదిగ సంఘాలు వివరిస్తున్నాయి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్ రాజశేఖర రెడ్డి హయాంలో డి. రాజేశ్వర్ రావుకు అవకాశం దక్కినా, ఆయన ఆ తర్వాత పూర్తిగా క్రిస్టియన్ మైనారిటీ వర్గంలోకి మారారని, అలాగే కేసీఆర్ హయాంలో కడియం శ్రీహరి బైండ్ల కులానికి చెందినవారని కమ్యూనిటీ ప్రతినిధులు పేర్కొంటున్నారు.తమ దీర్ఘకాలిక డిమాండ్‌ను పరిగణలోకి తీసుకుని, ఈసారైనా కాంగ్రెస్ ప్రభుత్వం సామాజిక న్యాయాన్ని పాటించాలని మాదిగ నేతలు బలంగా కోరుతున్నారు. ఈ నేపథ్యంలో మాదిగ సామాజిక వర్గానికి చెందిన పలువురు సీనియర్ నాయకులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి తమ అభ్యర్థిత్వాలను పరిశీలించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ రేసులో మాజీ ఎమ్మెల్యే ఎస్.ఎ. సంపత్ కుమార్, దొమ్మాట సాంబయ్య, ఇందిరా సింగపురం, దేవాని సతీశ్ మాదిగ తదితరులు తమ ప్రయత్నాలను ముమ్మరం చేశారు. ప్రత్యేకించి, ఎంఆర్పీఎస్ ఉద్యమంతో సుదీర్ఘ అనుబంధం కలిగి ఉండి, కాంగ్రెస్‌లో సీనియర్ లీడర్‌గా సేవలందిస్తున్న దేవాని సతీశ్ మాదిగ తదితరులు తమకు అవకాశం ఇవ్వాలని గట్టిగా కోరుతున్నారు.మొత్తానికి, రాబోయే గవర్నర్ కోటా ఎమ్మెల్సీ నియామకాలు కేవలం పదవుల భర్తీగానే కాకుండా, తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వానికి సామాజిక న్యాయాన్ని నిరూపించుకునే అగ్నిపరీక్షగా మారాయి. మరి సీఎం రేవంత్ రెడ్డి, టీపీసీసీ నాయకత్వం మాదిగల ఆకాంక్షలను ఏ విధంగా నెరవేరుస్తారనేది వేచి చూడాలి.

# బీఆర్ఎస్ కు “భూమి” భారం

హైదరాబాద్,అక్టోబరు 12 తెలంగాణలో బీఆర్ఎస్ ఒకింత ఇబ్బంది కరమైన పరిస్థితులను ఎదుర్కొంటుంది. అధికారంలో ఉన్న సమయంలో భూముల కొనుగోళ్లు ఇప్పుడు కాంగ్రెస్ చర్చ పెట్టడంతో ఒకింత ఆత్మరక్షణలో పడినట్లయింది. కేసీఆర్ నుంచి ఆయన కుటుంబ సభ్యులపై భూ ఆక్రమణల ఆరోపణలను కాంగ్రెస్ చేయడంతో దీనిని అధిగమించేందుకు ఎదురుదాడికి దిగుతున్నప్పటికీ అనుకున్న ఫలితం లభించడం లేదు. రాజకీయంగా మరియు న్యాయపరంగా చూస్తే, బీఆర్ఎస్ పార్టీ భూముల వ్యవహారంలో తీవ్రమైన ఆత్మరక్షణలో పడిందనే చర్చ గట్టిగా నడుస్తోంది. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత, గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన భూ కేటాయింపులు, పార్టీ కార్యాలయాల నిర్మాణాలు, మరియు కీలక నేతల వ్యక్తిగత భూములపై గట్టి నిఘా పెట్టడం ఇందుకు ప్రధాన కారణంగా చెప్పాలి.తెలంగాణలో భూములన్నీ... బీఆర్ఎస్ నేతలు, వారి కుటుంబ సభ్యులకు సంబంధించిన భూ అక్రమాలు, 22-ం కేటాయింపులపై తెలంగాణ ప్రభుత్వం సెప్టెంబర్ 2026లో ఒక నలుగురు సభ్యుల ఉన్నత స్థాయి విచారణ కమిటీని ఏర్పాటు చేసింది. ఇది పార్టీ నేతలను ఇరకాటంలోకి నెట్టింది. జిల్లా కేంద్రాల్లో బీఆర్ఎస్ పార్టీ కార్యాలయాల కోసం ప్రభుత్వ భూములను అతి తక్కువ ధరలకు కేటాయించుకున్నారని, కొన్ని చోట్ల అనుమతులు లేకుండా అక్రమంగా నిర్మించారనే ఆరోపణలపై న్యాయపరమైన చర్యలు నడుస్తున్నాయి. ఇప్పటికే నల్గొండ వంటి ప్రాంతాల్లో నిబంధనలకు విరుద్ధంగా కట్టిన పార్టీ ఆఫీస్ భవనాలపై హైకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ విషయంలో బీఆర్ఎస్ నేతలు పెద్ద సంఖ్యలో భూములను తమ సొంతం చేసుకున్నారన్న అభిప్రాయం ప్రజల్లో బలపడేందుకు దోహదపడింది. రాజకీయాలు కేసీఆర్ కుటుంబానికి చెందిన గజ్వేల్ ఫామ్‌హౌస్ భూములు, అలాగే కేటీఆర్‌కు లింక్ ఉన్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న జన్వాడ ఫామ్‌హౌస్ పరిసర భూములపై కాంగ్రెస్ ప్రతినిధుల బృందాలు స్వయంగా వెళ్లి క్షేత్రస్థాయి పరిశీలనలు జరిపాయి.

కేసీఆర్ కుటుంబానికి 9 జిల్లాల్లో దాదాపు 440 ఎకరాల భూములు ఉన్నాయని అసెంబ్లీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా ఆరోపించి విచారణకు ఆదేశించారు. ఈ ఆరోపణ లన్నింటినీ రాజకీయ కక్ష సాధింపు చర్యలుగా బీఆర్ఎస్ కొట్టిపారేస్తోంది. ప్రభుత్వ భూముల తాకట్టుపై కాంగ్రెస్‌ను నిలదీస్తూ, సీఎం రేవంత్ రెడ్డి కుటుంబ భూములపై కూడా సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని హరీశ్ రావు, కేటీఆర్ లాంటి అగ్రనేతలు ఎదురుదాడికి దిగుతున్నారు.అయినప్పటికీ, అధికారికంగా ప్రభుత్వ విచారణలు, కోర్టుల నోటీసులు ఎదుర్కొంటుండటం వల్ల భూముల విషయంలో ప్రస్తుతానికి బీఆర్ఎస్ కొంత ప్రతికూల పరిస్థితుల్లోనే ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

# ఐటీ ఉద్యోగులకు పాడ్ ట్యాక్సీ సదుపాయం..

హైదరాబాద్,అక్టోబరు 12 హైదరాబాద్‌లో ప్రయాణికుల రవాణా వ్యవస్థను మరింత ఆధునికంగా మార్చేందుకు తెలంగాణ సర్కార్ కీలక ప్రణాళికను సిద్ధం చేస్తోంది. మెట్రో రైలు దిగిన ప్రయాణికులు స్టేషన్ నుంచి బయటకు రాకుండానే డ్రైవర్ అవసరం లేని ‘పాడ్ ట్యాక్సీ’లోకి మారి నేరుగా తమ కార్యాలయాలకు చేరుకునేలా కొత్త రవాణా వ్యవస్థను ప్రతిపాదించింది.ఐటీ కారిడార్, నాలెడ్జ్ సిటీ, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, సచివాలయం పరిసరాలను అనుసంధానిస్తూ మొత్తం 40.82 కిలోమీటర్ల మేర పర్సనల్ ర్యాపిడ్ ట్రాన్సిట్ (పీఆర్‌టీ) నెట్‌వర్క్‌ను అభివృద్ధి చేయాలని అధికారులు ప్రణాళిక రూపొందించారు. దీనికి సంబంధించిన సాంకేతిక, ఆర్థిక సాధ్యాసాధ్యాల నివేదికను హైదరాబాద్ మెట్రో రైల్ అధికారులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి వివరించారు. ప్రాజెక్టు కోసం లీ అసోసియేట్స్ సంస్థ మూడు నెలల పాటు అధ్యయనం చేసింది. తొలుత 44.62 కిలోమీటర్లు, 56.88 కిలోమీటర్ల నెట్‌వర్క్ ప్రతిపాదనలను పరిశీలించి, వాటి ఆధారంగా 40.82 కిలోమీటర్ల హైబ్రిడ్ నెట్‌వర్క్‌ను అనుకూలంగా సూచించినట్లు నివేదికలో పేర్కొన్నారు.ఇందులో కూకట్‌పల్లి?రాయదుర్గం మార్గంలో 7.62 కిలోమీటర్లు, రాయదుర్గం?నాలెడ్జ్ సిటీ మార్గంలో 12.83 కిలోమీటర్లు, రాయదుర్గం/హైటెక్ సిటీ?ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ మార్గంలో 14.01 కిలోమీటర్లు, సచివాలయం?ఎన్టీఆర్ మార్గ్ కారిడార్‌లో 6.36 కిలోమీటర్ల మేర నెట్‌వర్క్ ఉండనుంది. ఈ మార్గాల ద్వారా ఐటీ ఉద్యోగులు, కార్యాలయాలకు వెళ్లే ప్రయాణికులకు చివరి దశ రవాణా సదుపాయం కల్పించాలన్నది ప్రధాన లక్ష్యం.ఈ పాడ్ ట్యాక్సీ నెట్‌వర్క్‌ను దశలవారీగా అభివృద్ధి చేయాలని ప్రతిపాదించారు. 2030 నాటికి 34.66 కిలోమీటర్లు, 2040 నాటికి 39.36 కిలోమీటర్లు, 2050 నాటికి పూర్తి నెట్‌వర్క్‌ను అందుబాటులోకి తీసుకురావాలన్నది ప్రణాళిక. ఈ వ్యవస్థ ద్వారా రోజువారీ ప్రయాణికుల సంఖ్య 2030లో 5.42 లక్షలు, 2040లో 15.47 లక్షలు, 2050 నాటికి 20.31 లక్షలకు చేరవచ్చని నివేదిక అంచనా వేసింది.ప్రస్తుతం హైదరాబాద్ మెట్రోలోని 69 కిలోమీటర్ల మార్గంలో రోజుకు సుమారు ఐదు లక్షల మంది ప్రయాణిస్తున్నారు. ఈ నేపథ్యంలో పాడ్ ట్యాక్సీలు అందుబాటులోకి వస్తే మెట్రో స్టేషన్ల నుంచి కార్యాలయాలకు చేరుకునే ప్రయాణం మరింత సులభమయ్యే అవకాశం ఉంది. అయితే, ఈ ప్రాజెక్టును ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్య (పీపీపీ) విధానంలో చేపట్టాలని ప్రభుత్వం భావిస్తోంది. దేశంలో ముంబైలోని బాంద్రా?కుర్లా కాంప్లెక్స్ ప్రాంతంలోనూ పాడ్ ట్యాక్సీ ప్రాజెక్టును అభివృద్ధి చేస్తున్నారు.హైదరాబాద్ ప్రాజెక్టుకు సంబంధించి మొత్తం వ్యయం, ప్రయాణికుల టికెట్ ధరలు, నిర్మాణ పనుల ప్రారంభ తేదీ, పూర్తి చేసే గడువు ఇంకా వెల్లడికాలేదు. ఇవి ఖరారైన తర్వాతే ప్రాజెక్టు అమలు తీరుపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది. ప్రతిపాదిత నెట్‌వర్క్ కార్యరూపం దాల్చితే ఐటీ కారిడార్‌లో ట్రాఫిక్ రద్దీని తగ్గించడంతో పాటు మెట్రో నుంచి కార్యాలయాలకు చేరుకునే ప్రయాణికులకు ప్రత్యామ్నాయ రవాణా సదుపాయం అందుబాటులోకి రావచ్చు

# గంజాయి విచారణకు పోలీసులు

## పోలీసుల పైమూకుమ్మడి దాడి



ఆదిలాబాద్ సిరికొండ మండలం వాయిపేట్‌లో గంజాయి విచారణకు వచ్చిన పోలీసులపై గ్రామస్తులు దాడికి పాల్పడ్డారు. ఘటన లో సీఐ, ఏఎస్ఐ సహా నలుగురు పోలీసులకు గాయాలు అయ్యాయి.

పెరట్లో 18 గంజాయి మొక్కలు సాగు చేస్తున్న వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కేసు తదుపరి విచారణ కోసం పోలీసు బృందం గ్రామానికి వెళ్లింది. గంజాయి సమాచారం ఎవరిచ్చారంటూ పోలీసులను గ్రామస్థులు నిలదీసారు. మహిళలతో కలిసి రాళ్లు, కర్రలతో దాడి చేశారని పోలీసుల వాదన. పోలీసు వాహనంతో పాటు ఫోన్లు ధ్వంసం అయ్యాయి. పోలీసులే కులం పేరుతో దూషించారంటూ ఆదివాసీల ఆరోపణ. గాయపడిన పోలీసులకు ఆదిలాబాద్‌లోని ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నారు.



# రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి



ఇబ్రహీంపట్నం జూపూడి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో వెంకటేష్ మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మృతుడి బంధువులు, కుటుంబ సభ్యులు ఇబ్రహీంపట్నం రింగ్ సెంటర్ కు చేరుకున్నారు. రింగ్ సెంటర్ కి ఇరువైపులా బారి కేట్లు అడ్డుపెట్టారు. మృతదేహంతో హైవేపై బైటాయించారు. దాంతో ట్రాఫిక్ స్థంభించింది. వాహనాలు నిలిచిపోయాయి. తమకు న్యాయం జరిగే వరకు కదిలేది లేదనీ హెచ్చరించారు. దీనిపై మరింత పూర్తి సమాచారం తెలియాల్సి ఉంది..

# మైనర్ తో సహ ఇద్దరు దొంగలు అరెస్టు

ఏలూరు దుకాణం తాళాలు పగలగొట్టి చోరీకి పాల్పడిన ఇద్దరు నిందితులను మూడవ పట్టణ పోలీసులు అరెస్టు చేశారు. నిందితుల నుంచి రూ. 1.50 లక్షల నగదు, రూ.60 వేల చరవాణి స్వాధీనం చేసుకున్నారు. వీరిలో ఒకరు బాల నేరస్థుడు కాగా, మరొకరు కొప్పన సాయికృష్ణగా గుర్తించారు. కేసును ఛేదించిన పోలీసులను జిల్లా ఎస్పీ అభినందించారు. తల్లిదండ్రులు పిల్లల నడవడికపై దృష్టి పెట్టాలని ఎస్పీ సూచించారు.

# క్రేజీ కల్యాణం” సినిమా ఒక హానెస్ట్ ఎంటర్ టైనర్ - డా. నరేష్ విజయ కృష్ణ




'నవరసరాయ' డా. నరేష్ విజయ కృష్ణ, అనుపమ పరమేశ్వరన్, తరుణ్ భాస్కర్, రాజ్ వెడ్స్ రాంబాయి ఫేమ్ అఖిల్ ఉడ్డెమారి ప్రధాన పాత్రల్లో నటిస్తున్న సినిమా “క్రేజీ కల్యాణం”. ఈ చిత్రాన్ని యారో సినిమాస్ బ్యానర్ పై ప్రొడక్షన్ నెం. 2గా ప్యాషనేట్ ప్రొడ్యూసర్ బూసం జగన్ మోహన్ రెడ్డి నిర్మిస్తున్నారు. దర్శకుడు బద్రప్ప గాజుల రూపొందిస్తున్నారు. ఈ నెల 16న “క్రేజీ కల్యాణం” సినిమా వరల్డ్ వైడ్ గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రాబోతోంది. ఈ రోజు ఈ చిత్ర ట్రైలర్ లాంఛ్ ఈవెంట్ ను హైదరాబాద్ లో ఘనంగా నిర్వహించారు. ప్రముఖ నిర్మాతలు దిల్ రాజు, బన్నీ వాస్, డైరెక్టర్ నందినీరెడ్డి ఈ కార్యక్రమంలో అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా

ప్రొడ్యూసర్ బన్నీ వాస్ మాట్లాడుతూ - నేను “క్రేజీ కల్యాణం” సినిమా చూశాను చాలా ఎంటర్ టైన్ చేసింది. ఈ పండుగకు ఫ్యామిలీ ఆడియెన్స్ అందరూ ఈ సినిమా చూస్తూ ఎంజాయ్ చేస్తారు. నరేష్, తరుణ్ భాస్కర్ తమ పర్ ఫార్మెన్స్ తో ఇరగదీశారు. ఈ సినిమా చూసి బయటకు వచ్చే ప్రేక్షకులకు ఇంటర్వెల్ సీన్ బాగా గుర్తుండిపోతుంది. అనుపమ అద్భుతంగా నటించింది. కేరళ నుంచి వచ్చి తెలుగు నేర్చుకుని తెలంగాణ యాసలో మెప్పించిన హీరోయిన్స్ లో సాయి పల్లవి తర్వాత అనుపమ ఉంటారు. ప్రొడ్యూసర్ జగన్ మోహన్ ప్యాషన్ తో ఈ సినిమా నిర్మించారు. సురేష్ బొబ్బిలి తెలంగాణ నుంచి వచ్చిన టెక్నీషియన్స్ లో ఆణిముత్యం. ఈ సినిమా మంచి విజయం సాధించి టీమ్ అందరికీ పేరు తీసుకురావాలి. అన్నారు.

ప్రొడ్యూసర్ దిల్ రాజు మాట్లాడుతూ - ఈ ఈవెంట్ కోసం చెన్నై నుంచి వచ్చాను. ప్రొడ్యూసర్ జగన్ మోహన్ ఈ సినిమా చేస్తున్నప్పటి నుంచి ఈ మూవీ గురించి చెప్పాడు. మా బన్నీవాస్ చెప్పినట్లు ఈ సినిమా పెద్ద హిట్ అవుతుంది. ఈ పండక్కి వస్తున్న పెద్ద సినిమాలతో పాటు ఈ సినిమా కూడా మంచి విజయం సాధించాలి. పెద్ద వాటితో పాటు చిన్న చిత్రాలు ఆదరణ పొందినప్పుడే ఇండస్ట్రీ కళకళలాడుతుంది. మొదటి సినిమా రిలీజ్ టైమ్ డైరెక్టర్ కు ఎంత టెన్షన్ ఉంటుందో తెలుసు. బద్రప్ప ఈ సినిమా టీజర్, ట్రైలర్ చూపించాడు. మంచి సినిమా చేశాడనే ఇంప్రెషన్ కలిగింది. అనుపమ తెలుగు నేర్చుకుని మా శతమానం భవతి సినిమాలోనే డబ్బింగ్ చెప్పుకుంది. ఆమె ఇప్పుడు తెలంగాణ యాసలో ఆకట్టుకునేలా నటించింది. రాజ్ వెడ్స్ రాంబాయి రిలీజ్ తర్వాత అఖిల్ రాజ్ ను పిలిచి మాట్లాడాను. అతనికి మంచి ఫ్యూచర్ ఉంది. తరుణ్ భాస్కర్ నటుడిగా, దర్శకుడిగా ఆకట్టుకుంటున్నారు. నరేష్ గారు ఎవర్ గ్రీన్ యాక్టర్. ఆయన తన నటనతో ఏడిపించగలడు, నవ్వించగలడు. సురేష్ బొబ్బిలి మా బలగం సినిమాకు బ్యాక్ గ్రౌండ్ స్కోర్ చేశాడు. మా దేత్తడి సినిమాను కూడా మ్యూజికల్ గా హిట్ చేయబోతున్నాడు. ఈ టీమ్ అందరికీ ఆల్ ది బెస్ట్ చెబుతున్నా. అన్నారు.

డైరెక్టర్ నందినీరెడ్డి మాట్లాడుతూ - ఈ సినిమా ట్రైలర్ చాలా బాగుంది. ఈ పండక్కి రెండు పెద్ద సినిమాలతో పాటు టపాకాయ్ లాంటి క్రేజీ కల్యాణం కూడా రిలీజ్ అవుతోంది. ఈ సినిమాను మీరు ఎంతగా ఎంజాయ్ చేయబోతున్నారో ట్రైలర్ కు మీరు ఇస్తున్న రెస్పాన్స్ చూస్తుంటేనే తెలుస్తోంది. తరుణ్ భాస్కర్ గురించి లాస్ట్ ఈవెంట్ లో నేను మాట్లాడలేదు. ఆయన ఏడాదికో సినిమా డైరెక్టర్ గా చేయాలనేది నా సలహా. మన తెలుగు వారికి సినిమా అంటే పిచ్చి. అందుకే కొత్త ప్రొడ్యూసర్స్ ఇండస్ట్రీకి వస్తుంటారు. జగన్ మోహన్ చాలా మంచి వ్యక్తి. సినిమాల ప్రొడక్షన్ వద్దు అని చెబుతూ ఉంటాను. కానీ ఆయన ప్యాషన్ తో మూవీస్ చేస్తున్నారు. ఈ సినిమా ఆయనకు పెద్ద సక్సెస్ ఇవ్వాలి. అలాగే ఈ చిత్రానికి నాలుగు ఫిల్లర్స్ లా నిలబడ్డారు నరేష్ గారు, అనుపమ, అఖిల్ రాజ్, తరుణ్ భాస్కర్. వీళ్లు ఇంత బాగా నటించారంటే డైరెక్టర్ బద్రప్ప విజన్ కనిపిస్తోంది. క్రేజీ కల్యాణం సినిమా పెద్ద విజయం సాధించాలని కోరుకుంటున్నా. అన్నారు.

ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ అఖిల్ సాయి మాట్లాడుతూ - మా సినిమాకు ప్రతి ఆర్టిస్ట్ బాగా సపోర్ట్ చేస్తున్నారు. మా ప్రొడ్యూసర్ గారు ఈ సినిమా ప్రతి ఆడియెన్ కు రీచ్ కావాలని మంచి ప్రమోషన్ చేయిస్తున్నారు. మా చిత్రంతో ఆడియెన్స్ తో పాటు క్రిటిక్స్ ను పక్కా సంతృప్తి పరచబోతున్నాం. అన్నారు

మ్యూజిక్ డైరెక్టర్ సురేష్ బొబ్బిలి మాట్లాడుతూ - నేను వర్క్ చేసిన చిత్రాల్లో వన్ ఆఫ్ ది బెస్ట్ మూవీ క్రేజీ కల్యాణం అవుతుందని చెప్పగలను. ఈ సినిమాకు ఈ దసరా సెలవుల్లో ప్రేక్షకులు కుటుంబాలతో కలిసి థియేటర్స్ కు వస్తారు. పెద్ద ఎత్తున ప్రేక్షకులు మా సినిమాను ఆదరిస్తారనే నమ్మకం ఉంది. మా టీమ్ అంతా ఖచ్చితంగా బ్లాక్ బస్టర్ కొట్టబోతున్నాం. ఈ సినిమాకు రిలీజ్ రోజు నుంచి థియేటర్స్ దగ్గర హౌస్ ఫుల్ బోర్డ్స్ కనిపిస్తాయి. అన్నారు.

డైరెక్టర్ బద్రప్ప గాజుల మాట్లాడుతూ - మా మూవీ టీజర్ ను నందినీరెడ్డి గారు రిలీజ్ చేశారు. అప్పటి నుంచి పాజిటివ్ వైబ్ స్టార్ట్ అయ్యింది. ట్రైలర్ చూపించేందుకు దిల్ రాజు గారి ఆఫీస్ కు వెళ్లాను. ఒక దేవాలయంలా అనిపించింది. ఎన్నో గొప్ప సినిమాలు ఆ ఆఫీస్ నుంచి బయటకు వచ్చాయి. నేను కాలేజ్ చదివే రోజుల్లో మా క్లాస్ మేట్స్ అమ్మాయిలకు పెళ్లిల్లు చేసేవారు. వారి క్లాస్ మేట్స్ పెళ్లికి అతిథుల్లా వస్తే ఆ అమ్మాయి మాత్రం పెళ్లి కూతురిగా కనిపించేది. ఆ అమ్మాయిలకు కూడా తమ జీవితంలో ఏదో సాధించాలనే కోరికలు ఉంటాయి. కానీ అవన్నీ మనసులోనే ఉంచుకుని పెద్దల మాట మీద పెళ్లికి ఒప్పుకుంటారు. అలాంటి అమ్మాయి మనసులో కలిగే భావాలు ఏంటి అనే ఆలోచనే ఈ కథకు స్ఫూర్తి. మనం ఎన్ని కథలు రాసుకున్నా ప్రొడ్యూసర్ కు ఆ టేస్ట్ ఉండాలి. మా జగన్ మోహన్ అన్న నన్ను ఎంతో సపోర్ట్ చేశారు. తన కూతురు పెళ్లి జరిపించినంత ఘనంగా ఈ సినిమా నిర్మించారు. మా మూవీ రిలీజ్ కు సపోర్ట్ చేసేందుకు ముందుకొచ్చిన బన్నీ వాస్ గారికి థ్యాంక్స్. ఈ చిత్రానికి హీరో నరేష్ గారు. తరుణ్ భాస్కర్ గారితో వర్క్ చేయడాన్ని ఎంజాయ్ చేశాను. అనుపమ హుషారు పిల్ల. ఈ క్యారెక్టర్ కు బాగా సరిపోయింది. తన క్యారెక్టర్ లో సూపర్బ్ గా పర్ ఫార్మ్ చేసింది. అఖిల్ రాజ్ రాజు వెడ్స్ రాంబాయి కంటే ముందే మా మూవీలో భాగమయ్యారు. సురేష్ బొబ్బిలి సంగీతం మా సినిమాకు ఆకర్షణగా నిలుస్తుంది. అన్నారు.

ప్రొడ్యూసర్ బూసం జగన్ మోహన్ రెడ్డి మాట్లాడుతూ - మా డైరెక్టర్ బద్రప్ప ఒక సోదరుడిలా నాతో చాలా కాలంగా ట్రావెల్ అవుతున్నారు. ఈ సినిమాకు మంచి కథ, మంచి ఆర్టిస్టులు..ఇలా ప్రతీది ఒక అదృష్టంలా కుదిరింది. నరేష్ గారు, అనుపమ, తరుణ్ భాస్కర్, అఖిల్..ఇలా కథ ప్రతి ఒక్కరూ కథ విన్న వెంటనే సినిమా చేసేందుకు ముందుకొచ్చారు. ఇంటికి తండ్రి ఎలా పెద్ద దిక్కుగా ఉంటారో మా సినిమాకు నరేష్ గారు అలా పెద్ద దిక్కుగా నిలబడ్డారు. నరేష్ గారు ఈ సినిమాకు ఇచ్చిన సపోర్ట్ మర్చిపోలేను. అనుపమ ప్రాణం పెట్టి నటించారు. ఇందరు పేరున్న వాళ్లు మా మూవీలో నటించారంటే నేను ప్రొడ్యూసర్ గా లక్కీగా ఫీలవుతున్నా. సినిమా చూశాక మీరంతా నేను లక్కీ ప్రొడ్యూసర్ అనుకుంటారు. అఖిల్ రాజ్ ను విందు భోజనం సినిమాతో నేను హీరోగా లాంఛ్ చేశా. సినిమా కోసం చాలా కష్టపడేతత్వం ఉన్న హీరో అఖిల్ రాజ్. మా సినిమాకు సపోర్ట్ చేస్తున్న దిల్ రాజు గారికి, బన్నీ వాస్ గారికి, నందినీరెడ్డి గారికి థ్యాంక్స్. అన్నారు.

హీరో అఖిల్ రాజ్ మాట్లాడుతూ - మా టీజర్ రిలీజ్ చేసిన తర్వాత ఎలాంటి పాజిటివ్ ఎనర్జీ వచ్చిందో ఇప్పుడు ట్రైలర్ రిలీజ్ కు కూడా అలాంటి ఫీల్ కలుగుతోంది. మా మూవీ ట్రైలర్ కు మీరు ఇస్తున్న రెస్పాన్స్ చూస్తుంటే హ్యాపీగా ఉంది. ఈ నెల 16న మా మూవీ థియేటర్స్ లో గట్టి సౌండ్ చేయబోతోంది. ప్రేక్షకులంతా మా సినిమా చూస్తూ ఎంజాయ్ చేస్తారు. మీరంతా తప్పకుండా మా మూవీ చూసేందుకు థియేటర్స్ కు రావాలని కోరుకుంటున్నా. అన్నారు.

యాక్టర్ తరుణ్ భాస్కర్ మాట్లాడుతూ - ఈ సినిమాలో బాలరాజు అనే పాత్రలో నటించాను. ఈ పాత్రలో నటించేందుకు మీలో చాలా మంది స్ఫూర్తిగా నిలుస్తారు. ఈ సినిమాలో నేను నటించాను అనేకంటే నటించాల్సివచ్చింది అని చెప్పాలి. ఈ సినిమాలో నటించడం సంతోషాన్నిచ్చింది. బాలరాజు చాలా అమాయకుడు. అతనికి లెక్కలు రావు. 30, 60, 90 మాత్రమే తెలుసు. బావిలో కప్పలా ఉంటే ఇతరుల్ని చూసి గ్లాసులో ఐసులా కరిగిపోవాలనుకుంటాడు బాలరాజు. నా క్యారెక్టర్ ను మీరు థియేటర్స్ లో బాగా ఎంజాయ్ చేస్తారు. అన్నారు.

హీరోయిన్ అనుపమ పరమేశ్వరన్ మాట్లాడుతూ - క్రేజీ కల్యాణం సినిమాలో నటించడం చాలా హ్యాపీగా ఉంది. నాకు బాగా నచ్చిన స్క్రిప్ట్ ఇది. ఈ కథ విన్న తర్వాత ఇలాంటి కథలో నేను భాగమవ్వాలని అనుకున్నాను. శతమానం భవతి తర్వాత అలాంటి సినిమా ఎప్పుడు చేస్తున్నారు అని అడిగేవారు. వారికి నా ఆన్సర్ ఈ సినిమా. ఆల్రెడీ మేము పండుగలా సెలబ్రేట్ చేసుకుంటున్నాం. యాక్ట్రెస్ గా మంచి సంతృప్తిని మిగిల్చిన చిత్రమిది. ఎంటర్ టైన్ మెంట్, ఎమోషన్ తో ఆకట్టుకునే మంచి ఫ్యామిలీ ఎంటర్ టైనర్ గా క్రేజీ కల్యాణం మిమ్మల్ని ఆకట్టుకుంటుంది. నేను తెలంగాణ యాసలో బాగా మాట్లాడనంటే కారణం మా డైరెక్టర్ బద్రప్ప. సినిమా ఔట్ పుట్ చూశాక మాలో కాన్ఫిడెన్స్ బాగా పెరిగింది. స్క్రిప్ట్ చెప్పినదాని కంటే డైరెక్టర్ బద్రప్ప బాగా రూపొందించారు. మా మూవీ ట్రైలర్ మీకు నచ్చిందని నమ్ముతున్నా. సినిమాను కూడా ట్రైలర్ లాగే బాగా ఎంజాయ్ చేస్తారు. మా మూవీ ఈ నెల 16న రిలీజ్ కు వస్తోంది. తప్పకుండా మీ ఫ్యామిలీస్ తో కలిసి థియేటర్స్ కు వెళ్లండి. పండుగ ఉత్సాహాన్ని మా సినిమా రెట్టింపు చేయబోతోంది. అన్నారు.

'నవరసరాయ' డా.నరేష్ విజయ కృష్ణ మాట్లాడుతూ - క్రేజీ కల్యాణం సినిమా ఒక హానెస్ట్, ఆర్గానిక్ ఎంటర్ టైనర్. ఈ దసరా పండుగకు గన్ షాట్ లా హిట్ కాబోతోంది. మా సినిమాను ప్రీమియర్స్ నుంచే సెలబ్రేట్ చేసుకోబోతున్నాం. తెలంగాణతో పాటు ఏపీలోనూ ప్రేక్షకులతో కలిసి సెలబ్రేట్ చేసుకుంటాం. తెలంగాణ నేపథ్యంతో తెరకెక్కినా యూనివర్సల్ ఎమోషన్స్ ఉన్న సినిమా ఇది. హిందీలో రీమేక్ చేసినా ఆదరణ పొందే కంటెంట్ ఈ సినిమాలో ఉంది. నేను 300 చిత్రాల్లో నటించినా ఇది నా బెస్ట్ పర్ ఫార్మెన్స్ ఉన్న సినిమా అని చెప్పగలను. నేను వర్క్ చేసిన ప్రొడ్యూసర్స్ లో జగన్ మోహన్ మోస్ట్ ప్యాషనేట్. డే 1 నుంచి మమ్మల్ని ఎంతో బాగా చూసుకున్నారు. అనుపమ తన నటనతో ఆకట్టుకుంటుంది. ఫన్, ఎమోషన్, లవ్, మ్యూజిక్ ఉన్న రోలర్ కోస్టర్ సినిమా ఇది. నేను, తరుణ్, అఖిల్, అనుపమ చేసిన క్యారెక్టర్స్ ను ప్రేక్షకులు బాగా ఇష్టపడతారు. బద్రప్ప టాలీవుడ్ కు మరో టాలెంటెడ్ రైటర్, డైరెక్టర్ గా పరిచయం కాబోతున్నాడు. అన్నారు.

నటీనటులు - 'నవరసరాయ' డా. నరేష్ విజయ కృష్ణ, అనుపమ పరమేశ్వరన్, తరుణ్ భాస్కర్, అఖిల్ ఉడ్డెమారి, తదితరులు

## కపిల్ సిబల్ విశ్వాసాన్ని నిలబెడతాం: సుప్రీంకోర్టు అసాధారణ భరోసాసీ




ఢిల్లీ న్యాయవ్యవస్థపై సీనియర్ న్యాయవాది, రాజ్యసభ సభ్యుడు కపిల్ సిబల్ వ్యక్తం చేసిన అసంతృప్తిపై సుప్రీంకోర్టు అసాధారణ రీతిలో స్పందించింది. “ఈ వ్యవస్థపై సిబల్ విశ్వాసాన్ని పునరుద్ధరించడానికే మేమిక్కడున్నాం” అని వ్యాఖ్యానిస్తూ, ఆయన నమ్మకాన్ని తిరిగి నిలబెడతామని స్పష్టం చేసింది. ఢిల్లీలో పోలీసుల ఆంక్షలకు సంబంధించి దాఖలైన పిటిషన్‌పై ఆదివారం ప్రత్యేకంగా విచారణ జరిపిన ధర్మాసనం ఈ కీలక వ్యాఖ్యలు చేసింది. ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిర్వహించిన నిరసన కార్యక్రమాన్ని పోలీసులు అడ్డుకోవడం, పలువురిని నిర్బంధంలోకి తీసుకోవడంపై కపిల్ సిబల్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) ఆధ్వర్యంలో జరిగిన ఈ నిరసనకు ముందు ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల ఓటర్ల జాబితాలో అవకతవకలపై పదేపదే సుప్రీంకోర్టును ఆశ్రయించి అలసిపోయానని, ఇక కోర్టుకు వెళ్లడం వల్ల ప్రయోజనం లేదనిపిస్తోందని అన్నారు. ఇది తన వ్యక్తిగత అభిప్రాయం మాత్రమేనని, ప్రజల హక్కుల కోసం న్యాయవాదులు పోరాడుతూనే ఉండాలని స్పష్టం చేశారు. శాంతియుతంగా నిరసన తెలిపితే ప్రభుత్వానికే ప్రమాదం ఉన్నట్టుందనిపిస్తోందని సిబల్ విమర్శించారు. భారతీయ నాగరిక్ సురక్ష సంహితలోని సెక్షన్ 163 కింద నిషేధాజ్ఞలు విధించడాన్ని ఆయన ప్రశ్నించారు. కర్ణాటక, పశ్చిమ బెంగాల్ నుంచి రైళ్లు, విమానాల్లో వస్తున్న వారిని కూడా మార్గమధ్యంలోనే అదుపులోకి తీసుకున్నారని ఆరోపించారు. నిరసనకారులపై పోలీసులు దురుసుగా ప్రవర్తించారని, దాదాపు 28 బెటాలియన్ల కేంద్ర, ఢిల్లీ పోలీసు బలగాలను మోహరించి నగరాన్ని దిగ్బంధం చేశారని అన్నారు. ఈ పరిణామాల నేపథ్యంలో సుప్రీంకోర్టు ఆదివారం జరిపిన విచారణలో కీలక ఆదేశాలు జారీ చేసింది. ఢిల్లీ వ్యాప్తంగా బారికేడ్లను తొలగించి, ప్రజల స్వేచ్ఛాయుత రాకపోకలకు వీలు కల్పించాలని సూచించింది. మెట్రో సర్వీసులు, ఇంటర్నెట్ కనెక్టివిటీని సాధారణ స్థితికి తీసుకురావాలని ఆదేశించింది. న్యాయవాదులు తమ వృత్తిపరమైన విధులను నిర్వర్తించకుండా ఎవరూ అడ్డుకోరాదని స్పష్టం చేసింది. ఎన్నికల కమిషన్ ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్)లో అవకతవకలు జరిగాయని ఆరోపిస్తూ విద్యార్థి సంఘాలు, పౌర సమాజ కార్యకర్తలు ఈ నిరసన చేపట్టారు. ఈ ఘటనలో యోగేంద్ర యాదవ్, ప్రశాంత్ భూషణ్, నేహా బోరా సహా దాదాపు 200 మందిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్టు సమాచారం.

## షాద్‌నగర్‌లో ఘోర రోడ్డు ప్రమాదం.. వ్యక్తి దుర్మరణం




రంగారెడ్డి జిల్లా ఏపీ ఆర్టీసీ బస్సు ఢీకొని తెలకపల్లి గ్రామానికి చెందిన లక్ష్మయ్య మృతి చెందాడు. షాద్‌నగర్ పట్టణంలోని ఉమ్మి బైపాస్ వద్ద ఆదివారం రాత్రి ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థకు చెందిన బస్సు రోడ్డు దాటుతున్న వ్యక్తిని ఢీకొట్టడంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లా తెలకపల్లి గ్రామానికి చెందిన లక్ష్మయ్య ఆదివారం రాత్రి సమయంలో షాద్‌నగర్ బైపాస్ వద్ద రోడ్డు దాటుతుండగా, సికింద్రాబాద్ నుంచి కళ్యాణదుర్గం వెళ్తున్న ఏపీ ఆర్టీసీ బస్సు ఆయనను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో లక్ష్మయ్య తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయినట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. ఈ ఘటనతో ఆ ప్రాంతంలో విషాదం

## దుర్గమ్మ దసరా ఉత్సవాల చీఫ్ ఫెస్టివల్ ఆఫీసర్ మార్పు

విజయవాడ ఇంద్రకీలాద్రిపై వైభవంగా జరుగుతున్న శ్రీ కనకదుర్గమ్మ దసరా శరన్నవరాత్రి ఉత్సవాల వేళ దేవాదాయ శాఖ కీలక నిర్ణయం తీసుకుంది. ఉత్సవాల నిర్వహణకు సంబంధించి చీఫ్ ఫెస్టివల్ ఆఫీసర్ (అఈూ) బాధ్యతల నుంచి దేవాదాయ శాఖ అదనపు కమిషనర్ ఎస్.ఎస్. చంద్రశేఖర్ ఆజాద్‌ను ప్రభుత్వం తక్షణమే తొలగించింది. భక్తుల రద్దీ పర్యవేక్షణ, ఉత్సవాల ఏర్పాట్లలో సమన్వయ లోపం తదితర కారణాల నేపథ్యంలో ఈ మార్పు జరిగినట్లు తెలుస్తోంది. ఆయన స్థానంలో నూతన చీఫ్ ఫెస్టివల్ ఆఫీసర్‌గా వి. త్రినాథరావును నియమిస్తూ దేవాదాయ శాఖ కమిషనర్ కె. రామచంద్రమోహన్ నేడు అధికారిక ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఆదేశాల ప్రకారం, నూతన అధికారిక బాధ్యతలు స్వీకరించిన వి. త్రినాథరావు నేటి నుండి దసరా ఉత్సవాలు ముగిసే వరకు (అక్టోబర్ 20వ తేదీ వరకు) విజయవాడలోనే బస చేయనున్నారు. క్షేత్రస్థాయిలో ఉంటూ భక్తుల దర్శన సదుపాయాలు, భద్రతా ఏర్పాట్లు, మరియు వివిధ శాఖల మధ్య సమన్వయాన్ని ఆయన నిరంతరం పర్యవేక్షిస్తారని దేవాదాయ శాఖ వర్గాలు వెల్లడించాయి.

# క్రిప్టో వల.. కోట్ల టోకరా!

## (హెచ్. ప్రతాప్)

రెండేళ్లలో పెట్టుబడి రెట్టింపు అవుతుందన్నారు. కొత్త సభ్యులను చేర్పిస్తే భారీ కమీషన్ వస్తుందని ఆశ చూపారు. హోటళ్లలో సమావేశాలు, ఆన్‌లైన్‌లో ప్రచారం, ఆకర్షణీయమైన పెట్టుబడి ప్యాకేజీలతో ప్రజల్లో నమ్మకం కలిగించారు. చివరకు వెబ్‌సైట్ మూతపడింది; పెట్టిన డబ్బులు తిరిగి రాలేదు. క్రిప్టో కరెన్సీ పేరుతో సాగిన ఈ అనుమానిత మోసం తెలుగు రాష్ట్రాలతోపాటు ఇతర ప్రాంతాల్లోనూ సుమారు 500 మందికి విస్తరించినట్లు ఆదిలాబాద్ పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది.

'ఐటీసీ గ్లోబల్ క్రిప్టో కరెన్సీ' పేరుతో నిర్వహించిన పథకంలో రూ.10 కోట్లకు పైగా మోసం జరిగినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ కేసులో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఇద్దరిని అరెస్టు చేశారు. మొత్తం ఆరుగురిపై కేసులు నమోదయ్యాయని ఆదిలాబాద్ ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. జిల్లాకు చెందిన ముగ్గురు బాధితులు సుమారు రూ.21 లక్షలు పెట్టుబడి పెట్టినట్లు వెల్లడించారు. బాధితుల సంఖ్య, మొత్తం నగదుపై మరింత దర్యాప్తు కొనసాగుతోంది.

తలమడుగు మండలం రుయ్యాడి గ్రామానికి చెందిన జువ్వక నర్సింలు ఇచ్చిన ఫిర్యాదుతో వ్యవహారం వెలుగులోకి వచ్చింది. ఆయన 2023లో రూ.7.50 లక్షలు పెట్టుబడి పెట్టారు. పదేపదే కోరినా నగదు తిరిగి అందకపోవడంతో ఆదిలాబాద్ వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌ను ఆశ్రయించారు. తన పెట్టుబడి ఖాతా వివరాలను ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆ ఫిర్యాదు ఆధారంగా చేపట్టిన విచారణలో పెట్టుబడుల సేకరణ విధానం బయటపడింది. పోలీసుల ప్రకారం, నిందితులు వెబ్‌సైట్ ద్వారా రూ.వెయ్యి నుంచి రూ.3 లక్షల వరకు వివిధ పెట్టుబడి ప్యాకేజీలను అందుబాటులో ఉంచారు. చిన్న మొత్తంతోనూ పథకంలో చేరవచ్చని ప్రచారం చేస్తూ పెట్టుబడిదారులను ఆకర్షించారు. పెట్టిన నగదును రెండేళ్లలో రెట్టింపు చేసి ఇస్తామని హామీ ఇచ్చినట్లు ఆరోపణలు ఉన్నాయి.

ఈ పథకాన్ని రెండు విధాలుగా నిర్వహించినట్లు పోలీసులు తెలిపారు. 'నాన్ వర్కింగ్ ప్లాన్'లో పెట్టుబడి పెట్టినవారికి రెండేళ్ల తర్వాత రాబడి ఇస్తామని చెప్పారు. 'వర్కింగ్ ప్లాన్'లో కొత్త సభ్యులను చేర్పించినవారికి వారి పెట్టుబడులపై 25 శాతం వరకు కమీషన్ వస్తుందని ఆశ చూపారు. ఈ విధంగా సభ్యుల ద్వారా మరింత మందిని పథకంలోకి తీసుకొచ్చినట్లు విచారణలో గుర్తించారు.

హోటళ్లలో ప్రత్యక్ష సమావేశాలతోపాటు జూమ్ సమావేశాలు నిర్వహించి పథకాన్ని ప్రచారం చేశారు. ఆసక్తి చూపినవారిని ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని, డిజిటల్ చెల్లింపు వేదికలు, ఆన్‌లైన్ ఎక్స్ఛేంజీల ద్వారా నగదు పంపాలని సూచించారు. అనంతరం నిర్వాహకులు వెబ్‌సైట్‌ను మూసివేసి, పెట్టుబడిదారులకు డబ్బులు తిరిగి ఇవ్వలేదని పోలీసులు తెలిపారు. సమావేశాల్లో ఇచ్చిన హామీలకు, ఆ తర్వాత జరిగిన పరిణామాలకు మధ్య వ్యత్యాసం బాధితులను పోలీసుల వద్దకు తీసుకొచ్చింది.

నిందితులకు చెందిన ఆస్తులను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ వెల్లడించారు. ఇతరుల పాత్ర, నగదు లావాదేవీలు, మోసం విస్తృతిపై విచారణ కొనసాగుతోంది. ప్రాథమికంగా వెల్లడైన రూ.10 కోట్లకు పైగా మొత్తం, సుమారు 500 మంది బాధితుల వివరాలు దర్యాప్తులో మరింత స్పష్టమవుతాయి. తక్కువ సమయంలో అసాధారణ లాభాలు ఇస్తామనే ప్రచారాన్ని నమ్మకుండా, పెట్టుబడికి ముందు సంస్థ విశ్వసనీయతను పరిశీలించాలని పోలీసులు సూచించారు.

## రంగారెడ్డి జిల్లా మహిళా అధ్యక్షురాలు చింగిరింత పారిజాత రెడ్డి ని మర్యాద పూర్వకంగా కలిసిన సామ రామ్మోహన్ రెడ్డి



హైద్రాబాద్ అక్టోబర్ 12; మహబూబ్ నగర్. రంగారెడ్డి. హైదరాబాద్. MLC కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సామ రామ్మోహన్ రెడ్డి రంగారెడ్డి జిల్లా మహిళా అధ్యక్షురాలు చింగిరింత పారిజాత నరసింహ రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పారిజాత నరసింహ రెడ్డి సామ రామ్మోహన్ రెడ్డి ని శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మీర్పేట్ సోషల్ మీడియా కన్వీనర్ బావోజు సిద్దేశ్వర చారి తో కలిసి ఎలక్షన్ ప్రచారం గురించి మాట్లాడారు.

## ఉద్యోగులకు రావలసిన డీఏలను వెంటనే విడుదల చేయాలి

## తెలంగాణ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశం డిమాండ్




హైద్రాబాద్ అక్టోబర్ 12:ఉద్యోగులకు రావలసిన డీఏలను వెంటనే విడుదల చేయాలని తెలంగాణ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశం డిమాండ్ చేసింది.నారాయణ గూడా లో జరిగిన తెలంగాణ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఉద్యోగులు, పెన్షనర్లకు సంబంధించిన పలు ముఖ్యమైన సమస్యలపై చర్చించారు. క్రింది డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని నిర్ణయించారు.

ముఖ్య డిమాండ్లు:

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు మరియు పెన్షనర్లకు పెండింగులో ఉన్న రెండు విడతల కరువు భత్యం

01-01-2024 మరియు 01-07-2024 నుండి రావలసిన 3.64% మరియు 2.73% మొత్తం 6.37% విడుదల చేయుటకు రాష్ట్ర మంత్రి వర్గం నిర్ణయానికి గాను రాష్ట్రప్రభుత్వానికి ఉద్యోగుల సంఘం సంతోషాన్ని తెలియచేస్తున్నాము.

మిగిలిన 4 డీఏలను వెంటనే మంజూరు చేయాలి.

01-01-2025, 01-07-2025, 01-01-2026 మరియు 01-07-2026 నుండి రావలసిన డీఏలను ఆలస్యం చేయకుండా విడుదల చేయాలి.

01-07-2023 నుండి అమలులోకి రావలసిన వేతన సవరణ సంఘం (PRC)ను అమలు చేయాలి వెంటనే తెప్పించుకొని అమలు చేయాలి

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు జూూ విధానాన్ని రద్దు చేసి, పాత పెన్షన్ విధానం (ూూూ)ను అమలు చేయాలి.

ఉద్యోగులు, పెన్షనర్ల ఆర్థిక సమస్యలను పరిష్కరించాలి.

పెండింగ్‌లో ఉన్న బిల్లులు, బకాయిలు మరియు ఇతర ఆర్థిక ప్రయోజనాలను వెంటనే విడుదల చేయాలని, ఉద్యోగుల హెల్త్ స్కీం ను సమర్థవంతంగా అమలు చేయాలని, ఉద్యోగులు, పెన్షనర్లకు మెరుగైన వైద్య సదుపాయాలు అందేలా జుూూను పటిష్టంగా అమలు చేసి, నగదు రహిత వైద్య సేవలు సులభంగా అందుబాటులోకి తీసుకురావాలని, ఉద్యోగుల సంక్షేమానికి సంబంధించిన ఇతర సమస్యలను పరిష్కరించాలని,

ఉద్యోగులపై పెరుగుతున్న ఆర్థిక భారాన్ని దృష్టిలో ఉంచుకొని, ప్రయాణం/ఇంధనం తదితర అంశాలకు సంబంధించిన సమస్యలపై ప్రభుత్వం తగిన నిర్ణయం తీసుకోవాలని, ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వంతో చర్చలు జరిపి పరిష్కారం చూపాలని,ఉద్యోగుల దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం ఉద్యోగ సంఘాలతో చర్చలు నిర్వహించి, సానుకూల నిర్ణయాలు తీసుకోవాలని,సమావేశం డిమాండ్ చేసింది.

ఈ సమావేశం లో ఎమ్. రవీంద్ర కుమార్, అధ్యక్షులు, ఏ. పద్మాచారి గౌరవ చైర్మన్, ఎష్ట్ర. హరీష్ కుమార్ రెడ్డి ప్రధాన కార్యదర్శి, జ. సురేందర్ ఆర్గనైసింగ్ సెక్రటరీ, జూ. కృష్ణా రావు, సెక్రటరీ, p. కృష్ణ మూర్తి డైరీ చైర్మన్,ఎన్. నర్సింగ్ రావు, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు పవన్ కుమార్, బోరెదా ప్రవీణ్ కుమార్, p. పరమేష్ తదితర కార్యవర్గ సభ్యులు హాజరైనారు.

## ఇంద్రకీలాద్రిలో రెండవ రోజు ,దుర్గాదేవి నవరాత్రులు

విజయవాడ ఇంద్రకీలాద్రి పై రెండో రోజు దుర్గా దేవి నవరాత్రులు కొనసాగుతున్నాయి. భక్తులు భారీగా క్యూలైన్లలో బారులు తీరారు. అమ్మవారి దర్శనానికి గంటల తరబడి ఎదురు చూపులు చూస్తున్నారు. మూడు కిలోమీటర్ల మేర క్యూలైన్లలో అమ్మవారి దర్శనానికి భక్తులు వస్తున్నారు. యాధావిధిగా ఆలయ సిబ్బంది, పోలీసులు విఐపి సేవలో తరిస్తున్నారు. సామాన్య భక్తులు మాత్రం క్యూలైన్లలో నిరీక్షణ తప్పడం లేదు.

# లోక్నాయక్ జయప్రకాశ్ నారాయణ్ మహోన్నత సంఘ సంస్కర్త

## జేడీయూ ఏపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కరణం తిరుపతి నాయుడు

హైద్రాబాద్ అక్టోబర్ 12;లోక్ నాయక్ జయప్రకాష్ నారాయణ జయంతి పురస్కరించుకొని కూకట్పల్లి హౌసింగ్ బోర్డు రోడ్ నెంబర్ వన్ లో ఏర్పాటు చేసిన జయప్రకాష్ నారాయణ విగ్రహానికి పలువురు నేతలు పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు ఈ కార్యక్రమానికి బీహార్ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి జనతాదళ్ యు ఆల్ ఇండియా ప్రధాన కార్యదర్శి పి శ్రావణ్ కుమార్ వై.సాంబశివ రావు,వెంకట సుబ్బయ్య, కొలిజేటి రామారావు జేడీయు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కరణం తిరుపతి నాయుడు తదితరులు పాల్గొని జయప్రకాశ్ నారాయణ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు ఈ సందర్భంగా కరణం తిరుపతి నాయుడు మాట్లాడుతూ లోక్



నాయక్ జయప్రకాశ్ నారాయణ్ మహోన్నత స్వాతంత్ర్య సమరయోధు డు, సంఘ సంస్కర్త, ప్రజాస్వామ్య పరిరక్షకుడైన జేపీ జాతికి చేసిన సేవలు అనిర్వచనీయమని కొనియాడారు.

ప్రజాస్వామ్య విలువల పరిరక్షణకు, సామా జిక న్యాయ సాధనకు, ప్రజా సేవకు ఆయన జీవితాన్ని అంకితం చేశారని.. ఆయన చూ పిన మార్గం నేటి తరానికి సదా స్ఫూర్తిదా యకమని అన్నారు. జేపీ ఆశయాలు, దేశభక్తి, త్యాగనిరతి తరతరాలకు ఆదర్శప్రాయమని పేర్కొన్నారు.

# మున్సిపల్ శాఖలో కొంతమంది అధికారుల బదిలీలు, పోస్టింగులపై పునఃసమీక్షించాలి

## ముఖ్యమంత్రికితెలంగాణ రాష్ట్ర మున్సిపాలిటీ ఉద్యోగుల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు ఎల్.తాజ్ మోహన్ రెడ్డి విజ్ఞప్తి

హైద్రాబాద్ అక్టోబర్ 12:మున్సిపల్ శాఖలో కొంతమంది అధికారుల బదిలీలు, పోస్టింగులపై పునఃసమీక్షించాలనితెలంగాణ రాష్ట్ర మున్సిపాలిటీ ఉద్యోగుల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు ఎల్.తాజ్ మోహన్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రెవెంత్ రెడ్డికి లేఖ రాశారు.



నేను తెలంగాణ రాష్ట్ర మున్సిపాలిటీ ఉద్యోగుల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడిగా, తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ ఉద్యోగుల ప్రయోజనాలకు సంబంధించిన కొన్ని విషయాలను దృష్టికి తీసుకువస్తున్నానని పేర్కొన్నారు.

గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మమత జోనల్ కమిషనర్గా శేరిలింగంపల్లి, కూకట్‌పల్లి తదితర ప్రాంతాల్లో పనిచేయడంతో పాటు, అంతకుముందు డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ కార్యాలయంలో కూడా పనిచేశారు. ఆ సమయంలో తెలంగాణ మున్సిపల్ ఉద్యోగులు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని మా సంఘం దృష్టికి వచ్చింది.

తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం మమత ని ఆదిలాబాద్ జిల్లాకు బదిలీ చేయడం జరిగింది. అయితే, ఆ బదిలీ అమలులో ఉన్న సమయంలోనే ఆమె అమెరికాకు వెళ్లి, సుమారు ఆరు నెలల తరువాత తిరిగి భారతదేశానికి వచ్చారు. అనంతరం తిరిగి డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్‌లో అసిస్టెంట్ డైరెక్టర్గా విధుల్లో చేరినట్లు మా దృష్టికి వచ్చింది.

అదేవిధంగా, మహేందర్ గతంలో కేటీఆర్ ఓఎస్డీగా పనిచేసిన సమయంలో పలు అక్రమాలు, అవినీతి వ్యవహారాలకు పాల్పడ్డారని ఆరోపణలు ఉన్నాయి. అవినీతి ద్వారా భారీగా ఆస్తులు కూడబెట్టుకున్నారనే ఆరోపణలు కూడా ఉన్నాయి. అనంతరం ఆయనను ఖమ్మం ప్రాంతానికి బదిలీ చేయడం జరిగింది. అయితే, ఇటీవల ఆయనను తిరిగి ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్‌కు సంబంధించిన ముఖ్యమైన పదవిలో నియమించడం పట్ల తెలంగాణ మున్సిపాలిటీ ఉద్యోగుల సంఘం తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తోంది.

కావున, పై రెండు బదిలీలు మరియు తదనంతర పోస్టింగులను తమరు దయచేసి పునఃసమీక్షించి, అవసరమని భావించిన పక్షంలో సంబంధిత అధికారులను దూర ప్రాంతాలకు బదిలీ చేయవలసిందిగా మా సంఘం తరఫున హృదయపూర్వకంగా విజ్ఞప్తి చేసారు.తెలంగాణ రాష్ట్రంలోని మున్సిపల్ ఉద్యోగుల ప్రయోజనాలను, వారి సంక్షేమాన్ని మరియు శాఖలో పారదర్శకమైన, క్రమశిక్షణతో కూడిన పరిపాలనను కాపాడేందుకు తమరు తగిన చర్యలు తీసుకుంటారని ఆశిస్తున్నానని పేర్కొన్నారు.

## ప్రజల గుండెల నిండుగా పదేండ్ల పండుగ

## - బీఆర్ఎస్ నాయకులు,

పెద్దపల్లి యువత శారీరక దృఢత్వాన్ని అలవర్చుకుని క్రీడలతో పాటు కెరీర్‌లోనూ ఉన్నత స్థాయికి ఎదగాలని బీఆర్ఎస్ నాయకురాలు, బీసీ జేఏసీ జిల్లా చైర్‌పర్సన్ దాసరి ఉష పిలుపునిచ్చా రు. జిల్లా ఆవిర్భవించి 10 సంవత్సరాలు విజయవం తంగా పూర్తయిన సందర్భంగా పెద్దపల్లి ప్రజల గుండెల నిండుగా పదేండ్ల పండుగ వాతావరణం నెలకొందని, ఈ సందర్భంగా పట్టణంలో నిర్వహించిన 5కే రన్ కార్యక్రమాన్ని ముఖ్య అతిథిగా హాజరైన తెలంగాణ ఉద్యమ నేత సత్యనారాయణ రెడ్డితో కలిసి ఆమె ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా దాసరి ఉష మాట్లాడుతూ ప్రజాక్షేత్రంలో ప్రజలకు నిరంతరం సేవలందించాలన్నా, జీవితంలో సాధించాలన్నా శారీరక దారుఢ్యం ఎంతో కీలకమని పేర్కొన్నారు. గత ఎన్నికల ప్రచార ఒత్తిడి వల్ల తీవ్ర అనారోగ్య సమస్యలు, నొప్పులు రావడంతో రెండు నెలల పాటు బెడ్‌రెస్ట్ తీసుకోవాల్సి వచ్చిందని,ఆ అనుభవంతోనే యువతలో ఆరోగ్యం, ఫిట్‌నెస్‌పై చైతన్యం తేవడానికి ఫిట్ అండ్ ఫ్యూచర్ క్లబ్ ను ప్రారంభించినట్లు తెలిపారు. ఇప్పటికే నియోజకవర్గంలో ని దాదాపు 54 గ్రామాల్లో యువతతో కలిసి మార్నింగ్ వాక్, రన్నింగ్ కార్యక్రమాలు చేపట్టామని, ఆ సంకల్పంతోనే నేడు విజయవంతంగా 5 కిలోమీటర్ల పరుగును పూర్తి చేశామన్నారు. పెద్దపల్లి జిల్లా ఏర్పడి నేటికి పదేండ్లు పూర్తయిన శుభవేళ జిల్లా సాధించిన ప్రగతిని గుర్తుచేస్తూ,ఈ పదేండ్ల కాలంలో మాతా-శిశు సంరక్షణ ఆసుపత్రి, సమీకృత కలెక్టరేట్, మినీ ట్యాంక్ బండ్, గ్రామాల్లో అంతర్గత రహదారులు, ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన కాళేశ్వరం ప్రాజెక్టు లాంటి అద్భుతమైన మౌలిక వసతులు అభివృద్ధి చెందాయని,ధూళికట్ట బౌద్ధ స్తూపం, సబితం జలపాతం, రామగుండం,కాల్వ శ్రీరాంపూర్ వంటి ప్రకృతి రమణీయమైన పర్యాటక ప్రాంతాలు జిల్లా సొంతమని హర్షం వ్యక్తం చేశారు.స్థానిక యువతకు అత్యుత్తమ ప్రతిభ ఉందని,గతంలో నిర్వహించిన డేటా సైన్స్ శిక్షణ ద్వారా దాదాపు 120 మంది ప్రముఖ ఎంఎన్‌సీల లో లక్షల వార్షిక ప్యాకేజీల తో ఉద్యోగాలు సాధించడ మే ఇందుకు నిదర్శనమన్నా రు. రాబోయే రోజుల్లో పెద్దపల్లిలో ఐటీ టవర్,టి-హబ్, మహిళల కోసం ప్రత్యేక ఉపాధి కల్పన పరిశ్రమలతోపాటు క్రీడాకా రుల కోసం స్పోర్ట్స్ కాంప్లెక్స్, సుల్తానాబాద్ మినీ స్టేడియం ఆధునీకరణ వంటి సదుపాయాలు యుద్ధప్రాతిపదికన ఏర్పాటు చేయాలని ఆకాంక్షించారు.

# రెండు వైన్స్ లు...100 పైగా బెల్ట్ షాపులు

**ఎనీ టైం మందు....**

**నిబంధనలు బేఖాతరు చేస్తున్న మద్యం వ్యాపారులు....**

**దుకాణాలకు అనుబంధంగా అనధికారికంగా పర్మిట్ రూమ్లు.......**

**లూజు అమ్మకాలతోపాటు మద్యం సేవించడానికి ఏర్పాట్లు.....**

**గ్రామాల్లో యథేచ్ఛగా బెల్టు షాపులు తీవ్రంగా పరిగణించని ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారులు......**







**చంద్రుగొండ అక్టోబర్ 12 ప్రజాబలం ప్రతినిధి :**-వైన్ షాపుల్లో రోజుకు 12 గంటలు అమ్మకాలు చేస్తే బెల్టు షాపులు మాత్రం 24 గంటలు అమ్మకాలు సాగిస్తున్నారు. వీటి ద్వారా ప్రభుత్వ ఖజానాకు ఆదాయం పెరగటంతో పాటు బెల్ట్ షాపుల యజమానులు లక్షల్లో బ్రాండ్ షాప్ యజమానులు కోట్లలో ప్రజలకు ఇచ్చిన విడిగా మద్యం అందుబాటులో ఉంచి, వాటికి బానిస కావడం ద్వారా సామాన్యుడిని గుల్ల చేస్తూ దోచుకుంటున్నారు. ఎమ్మార్పీ ధరల కంటే ఎక్కువ ధరకు విక్రయిస్తున్నారు. వైన్ షాపుల్లో దొరకే మద్యం బెల్ట్ షాపుల్లో సైతందొరుకుతుంది. కాకపోతే ఎక్కువ ధర పెట్టి కొనుగోలు చేయాలి. కిరాణా షాపుల మాదిరి బెల్టు షాపులో నిర్వహిస్తూ పచ్చని పల్లెల్లో ప్రశాంత వాతావరణాన్ని మందుబాబులు చెడగొడుతున్నారు. దీంతో సమాజంలో చిన్న, పెద్ద అనే గౌరవం లేకుండా ప్రవర్తిస్తున్నారు.బెల్ట్ షాపుల అమ్మకాలు రాష్ట్ర ప్రభుత్వానికి తెలియకుండా జరుగుతున్నాయా ఎక్సైజ్ శాఖ అధికారులకు తెలిసినా కానీ అధికారులు మాత్రం బెల్ట్ షాపుల వైపు కన్నెత్తి చూడరు. క్షేత్రస్థాయిలో జరుగుతున్న అక్రమ మద్యం దందా అధికారులకు పట్టవు. వారికి నెలవారి లెక్కలు ఉంటాయనే చర్చ గ్రామాల్లో జరుగుతోంది.

రోడ్డు ప్రమాదాలకు బెల్ట్ షాప్ లు కారణమా జాతీయ రహదారులు, రాష్ట్ర రహదారులు, గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కడపడితే అక్కడ విచ్చలవిడిగా మద్యం విక్రయాలు జరుగుతున్నాయి అర్ధరాత్రి అపరాత్రి అని తేడా లేకుండా అమ్మకాలు చేస్తుండడంతో జనాలు ట్రాక్టర్ డ్రైవర్లు, లారీ డ్రైవర్లు చివరకు మైనర్ పిల్లలు కూడా మద్యం కొనుగోలు చేసి ఎక్కడపడితే అక్కడ రోడ్డు పక్కన ప్రధాన ప్రాంతాలు, పంట పొలాలలు,పాఠశాలలు, క్రీడా ప్రాంగణాలు అన్ని మద్యం సేవించే కేంద్రాలుగా మారిపోయాయి. డ్రైవర్లు మాత్రం కావలసినంత మద్యం లభించడంతో మద్యం సేవిస్తూ వాహనాలు నడుపుతున్నారు. మద్యం సేవించి వాహనాలు నడుపుతుండడంతో రోడ్డు ప్రమాదాలకు కారణం అవుతున్నారు. మార్గమధ్యంలో ఎక్కడపడితే అక్కడ మద్యాన్ని సేవిస్తూ వెళుతున్నారు. ఈ క్రమంలోనే వాహనాలు ప్రమాదాలకు గురవుతున్నాయనే చర్చ ప్రజల్లో నడుస్తోంది.

అనారోగ్యం పాలవుతున్న మందుబాబులు

విచ్చలవిడిగా మద్యం లభ్యమవుతుండడంతో చిన్న పెద్ద అనే తారతమ్యం లేకుండా మధ్యాన్ని సేవిస్తున్నారు.

మద్యాన్నికి అలవాటు పడినవారు మద్యం సమయానికి దొరకకపోతే నరాలు లాగటం, చేతులు వనకడం, గుండెల్లో దడ రావడం పెరుగుతోంది. మద్యానికి బానిస అయిన వారు కూలీ పనులు చేసుకోలేని దుస్థితిలో ఉన్నారు. కొందరికి ఊపిరితిత్తుల వ్యాధులు బారిన పడుతున్నారు. మరికొందరు మూత్రపిండాలు పాడైన వారు ఉన్నారు. రోగాల బారిన పడిన వారు వైద్యం తీసుకునేందుకు డబ్బు లేక నాటు మందులు వాడుతూ మృతి చెందుతున్న సంఘటనలు చోటుచేసుకుంటున్నాయి. ఆసుపత్రులకు వెళితే లక్షల్లో ఖర్చు అవుతుంది వైద్యానికి డబ్బులు లేకపోయినా మద్యం సేవించేందుకు కాయ కష్టం చేసి కుటుంబాన్ని, పిల్లలను పోషిస్తున్న భార్యలను హింసిస్తున్న వారి సంఖ్య సమాజంలో పెరుగుతోంది . పేద కుటుంబాలు ఆర్థిక సమస్యలతో భార్యాభర్తల మధ్య కలహాలు తలెత్తి విడిపోతున్న సంఘటనలు పెరిగిపోతున్నాయి.ఇప్పటికైనా ప్రభుత్వాలు, అధికారులు గ్రామాల్లో బెల్ట్ షాపులు తొలగించి రోడ్డు ప్రమాదాలు జరగకుండా, ప్రజలు అనారోగ్యం పాడవకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## ఖమ్మంలో శ్రీవారి ఆలయ నిర్మాణానికి శ్రీకారం

**వేద మంత్రోచ్చారణల నడుమ శాస్త్రోక్తంగా భూమిపూజ.. శ్రీవారి ఆలయ నిర్మాణానికి శుభారంభం**

**శ్రీ శ్రీ శ్రీ త్రిదండి చిన్నజీయర్ స్వామి, టీటీడీ చైర్మన్ శ్రీ బీఆర్ నాయుడు, మంత్రి శ్రీ తుమ్మల నాగేశ్వరరావు చేతుల మీదుగా పవిత్ర క్రతువు**

**ప్రహరీ గోడ నిర్మాణానికి రూ.3.40 కోట్లు మంజూరు**








**ఖమ్మం జిల్లా బ్యూరో ప్రజాబలం అక్టోబర్ 12:** కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ వేంకటేశ్వరస్వామివారు ఖమ్మంలో కొలువుదీరేందుకు తొలి అడుగు పడింది. తెలంగాణ రాష్ట్రంలోని ఖమ్మం జిల్లాలో శ్రీవారి దివ్యాలయ నిర్మాణానికి టీటీడీ సోమవారం శ్రీకారం చుట్టింది. వేద మంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాల నడుమ శ్రీశ్రీశ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్నజీయర్ స్వామివారు శాస్త్రోక్తంగా భూమిపూజ నిర్వహించారు. ఈ పవిత్ర కార్యక్రమంలో టీటీడీ చైర్మన్ శ్రీ బీఆర్ నాయుడు, తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి శ్రీ తుమ్మల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

వేదమంత్రాల సాక్షిగా ఆధ్యాత్మిక శుభారంభం ఆగమ శాస్త్ర సంప్రదాయాలకు అనుగుణంగా ముందుగా హోమాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు భూమిపూజ ప్రదేశాన్ని సంప్రోక్షణ చేసిన అనంతరం వేద మంత్రోచ్చారణల మధ్య భూమిపూజ నిర్వహించారు. ఈ పవిత్ర ఘట్టం అనంతరం శ్రీ శ్రీ శ్రీ చిన్నజీయర్ స్వామివారితో కలిసి టీటీడీ చైర్మన్ శ్రీ బీఆర్ నాయుడు శ్రీవారి ఆలయ నిర్మాణ శిలాఫలకాన్ని ఆవిష్కరించారు.

ఖమ్మం ప్రాంత భక్తులకు శ్రీవారి దివ్యదర్శన భాగ్యాన్ని చేరువ చేయడంతో పాటు, సనాతన ధర్మ ప్రచారాన్ని విస్తృతం చేయాలనే లక్ష్యంతో ఈ ఆలయాన్ని నిర్మించనున్నారు.

20.04 సెంట్ల భూమి కేటాయింపు -- ప్రహరీకి రూ. 3.40 కోట్లు

ఖమ్మం అర్బన్ మండలం, ధ్వంసలాపురం రెవెన్యూ గ్రామ పరిధిలోని సర్వే నంబరు 408/2లో తెలంగాణ ప్రభుత్వం ఆలయ నిర్మాణం కోసం 20.04 సెంట్ల భూమిని అల్లిపురం గ్రామంలో కేటాయించింది. ఈ భూమికి రక్షణగా ప్రహరీ గోడ నిర్మాణం కోసం టీటీడీ రూ. 3.40 కోట్లు మంజూరు చేసింది. అవసరమైన నిధులతో ప్రధాన ఆలయ నిర్మాణ పనులను టిటిడి చేపట్టనుంది.

ప్రధాన ఆలయంతో పాటు ఉపాలయాలు, రాజగోపురం నిర్మాణం

ఖమ్మంలో నిర్మించనున్న ఈ దివ్యక్షేత్రంలో శ్రీ వేంకటేశ్వరస్వామివారి ప్రధాన ఆలయంతో పాటు ఉపాలయాలు, రాజగోపురం, పోటు (వంటశాల), ప్రాకారం తదితర నిర్మాణాలు చేపట్టనున్నారు. ఆలయ నిర్మాణం పూర్తయితే ఖమ్మం ప్రాంత భక్తులకు శ్రీవారి దర్శనం మరింత చేరువ కావడంతో పాటు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు, ధార్మిక ప్రచారానికి ఈ క్షేత్రం ప్రధాన కేంద్రంగా నిలవనుంది.

రెండు తెలుగు రాష్ట్రాలను అనుసంధానించే ఆధ్యాత్మిక కేంద్రం: శ్రీ శ్రీ శ్రీ చిన్నజీయర్ స్వామి

శ్రీశ్రీశ్రీ చిన్నజీయర్ స్వామివారు ఖమ్మం ప్రజలకు మంగళాశాసనాలు అందిస్తూ, ఖమ్మం నగరం రెండు తెలుగు రాష్ట్రాలను ఆధ్యాత్మికంగా అనుసంధానించే కేంద్రంగా ఎదగాలని ఆకాంక్షించారు. శ్రీనివాసుడి కుటుంబ సభ్యులుగా భావించి ప్రతి ఒక్కరూ ఆలయ నిర్మాణంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ప్రజలకు అరిష్టాలు తొలగి, పాడిపంటలతో పల్లెలు సుభిక్షంగా వర్ధిల్లాలని ఆశీర్వదించారు. భక్తుల సహకారంతో ఆలయ నిర్మాణం పూర్తయి, ఖమ్మం ఆధ్యాత్మిక వైభవానికి చిరునామాగా నిలవాలని ఆకాంక్షించారు.

దేశవ్యాప్తంగా శ్రీవారి ఆలయాల నిర్మాణానికి టీటీడీ కృషి: చైర్మన్ శ్రీ బీఆర్ నాయుడు

టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా శ్రీవారి ఆలయాలను నిర్మించాలనే సంకల్పంతో టీటీడీ ముందుకు సాగుతోందని తెలిపారు. హిందూ ధర్మం, సనాతన సంప్రదాయాల పరిరక్షణకు ఆలయాలు దోహదపడతాయన్నారు. ఆలయ నిర్మాణంలో భక్తుల భాగస్వామ్యం, విరాళాల ప్రాధాన్యాన్ని వివరించారు.

సనాతన ధర్మ పరిరక్షణకు ఆలయాలు కీలకం: మంత్రి శ్రీ తుమ్మల

మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ, ఖమ్మంలో శ్రీవారి ఆలయ నిర్మాణానికి సహకరించిన ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు. తన ఆహ్వానం మేరకు కార్యక్రమానికి విచ్చేసిన చిన్నజీయర్ స్వామివారికి, సహకరించిన టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడికి ధన్యవాదాలు తెలిపారు. దేవదేవుడి ఆశీస్సులతో నిర్మితమయ్యే ఈ ఆలయం ఖమ్మం నగరానికి ఆధ్యాత్మిక శోభను తీసుకురావాలని ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో టీటీడీ జేఈవో డా. ఎ. శరత్, ఆలయ డిప్యూటీ ఈవో శ్రీ శివప్రసాద్, ఎస్ఈ ఇన్‌ఛార్జి శ్రీ ఎస్. ప్రసాద్, డీఈ శ్రీ సురేంద్ర నాథ్ రెడ్డి, సూపరింటెండెంట్ శ్రీ మల్లికార్జున, అర్చకులు, పలువురు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## తెలంగాణ శాసనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ ను కలిసిన తుమ్మలపల్లి పాండు యువసేన



**వికారాబాద్ నియోజకవర్గం ప్రతినిధి అక్టోబర్ 12(ప్రజా బలం) వికారాబాద్ జిల్లా:** మర్పల్లి మండలం తుమ్మలపల్లి పాండు యువసేన కాంగ్రెస్ కుటుంబ సభ్యులతోకలిసి యూరోప్ స్టడీ పర్యటన ముగించుకొని వచ్చిన వికారాబాద్ శాసనసభ్యులు తెలంగాణ శాసనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ ను కలసి సంతోషంగా ముచ్చటించి తీపి కబుర్లతో కలిసి రావడం జరిగింది అని పాండు తెలిపారు

## చికెన్ ధరలు సామాన్యుల జేబులకు చిల్లు

హైదరాబాద్ , అక్టోబరు 12 తెలుగు రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో చికెన్ ధరలు అనూహ్యంగా పెరుగుతున్నాయి. గత రెండు వారాల్లో కిలో చికెన్ ధర రూ.50కి పైగా పెరిగి.. ప్రస్తుతం రూ.280 నుంచి రూ.300 వరకు పలుకుతోంది. ఈ ధరల పెరుగుదల సామాన్య ప్రజల దైనందిన జీవితంపై గణనీయమైన భారాన్ని మోపుతోంది. సరఫరాలో హెచ్చుతగ్గులు, పెరిగిన డిమాండ్, అలాగే రవాణా ఖర్చులు ఈ ధరల పెంపునకు ప్రధాన కారణాలుగా ఉన్నాయి. పండుగల సీజన్‌కు ముందు మాంసాహార పదార్థాల ధరలు పెరగడం వినియోగదారులలో ఆందోళన కలిగిస్తోంది. దీని ప్రభావంతో హోటళ్లు, రెస్టారెంట్లలో మాంసాహార భోజన ఖర్చులు కూడా పెరిగే అవకాశం ఉందని చెప్పవచ్చు. ఈ అకస్మాత్తు ధరల పెరుగుదల గృహ బడ్జెట్‌లపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ప్రొటీన్ ఆహారంగా ప్రాచుర్యం పొందిన చికెన్ ధరలు పెరగడం వల్ల చాలా కుటుంబాలు తమ ఆహారపు అలవాట్లలో మార్పులు చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ప్రభుత్వం ఈ ధరల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని వినియోగదారులు కోరుతున్నారు.

తెలుగు రాష్ట్రాల్లో చికెన్ ధరలు ఇవే..

-హైదరాబాద్‌లో ప్రస్తుతం కిలో స్కిన్‌లెస్ చికెన్ ధర రూ.278గా ఉండగా.. డ్రెస్డ్ చికెన్ ధర రూ.246గా ఉంది. ఇక ఎక్స్ ఫారం లైవ్ బర్డ్ ధర రూ.132గా ఉండగా.. రిటైల్ లైవ్ బర్డ్ రూ.159గా కొనసాగుతోంద

-ఇక విజయవాడలో కిలో స్కిన్ లెస్ చికెన్ రూ.284గా ఉండగా.. డ్రెస్డ్ చికెన్ రూ.251గా ఉంది. ఇక రిటైల్ లైవ్ బర్డ్ రూ.162, ఫారం దగ్గర లైవ్ బర్డ్ రూ.135 వద్ద కొనసాగుతోంది.

కరీంనగర్ జోన్‌లో కేజీ స్కిన్ లెస్ చికెన్ రూ.278, డ్రెస్డ్ స్కిన్ రూ.246, రిటైల్ లైవ్ బర్డ్ రూ.159, ఫారం దగ్గర లైవ్ బర్డ్ రూ.132 వద్ద కొనసాగుతోంది.

**కోడి గుడ్ల ధరలు చూస్తే..**-కరీంనగర్ జోన్‌లో 12 గ్రుడ్ల రిటైల్ ధర రూ.76గా ఉంది. ఇక విజయవాడ జోన్‌లో 12 గ్రుడ్ల ధర రూ.80 వద్ద కొనసాగుతున్నాయి. హైదరాబాద్‌లో 12 గ్రుడ్ల ధర రూ.74గా ఉంది. అసాధారణ ధరల పెరుగుదల సామాన్యుల జేబులకు చిల్లు పెడుతోంది. రానున్న రోజుల్లో చికెన్ ధరలు మరింత పెరిగే అవకాశం ఉందని వస్తున్న వార్తలు చికెన్ ప్రియులను బెంబేలెత్తిస్తున్నాయి. సాధారణంగా ఆదివారాల్లో చికెన్ వినియోగం ఎక్కువగా ఉంటుంది. దీంతో పాటు దసరా పండుగ సీజన్ కావడంతో కోళ్లకు డిమాండ్ పెరిగింది. ఈ డిమాండ్ వల్ల చికెన్ ధరలు పెరుగతున్నట్లు వ్యాపారులు చెబుతున్నారు. చికెన్ రేట్లు ఇలా భారీగా పెరగడంపై గృహిణులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కుటుంబ బడ్జెట్‌పై ఈ ధరల ప్రభావం పడుతుందని వారు ఆవేదన చెందుతున్నారు. చికెన్ ధరలు ఎప్పుడు తగ్గుతాయో తెలియక ప్రజలు అయోమయంలో ఉన్నారు.

# జర్నలిస్టుల సమస్యల కోసం ప్రెస్ క్లబ్ కార్యాచరణ ప్రణాళిక




హైదరాబాద్, అక్టోబర్ 11: జర్నలిస్టులకు మౌలిక వసతులు కల్పించడంతోపాటు, వారి సమస్యల పరిష్కారం కోసం కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని హైదరాబాద్ ప్రెస్ క్లబ్ సర్వసభ్య సమావేశం ఏకగ్రీవంగా తీర్మానించింది. సోమాజిగూడ లో ఆదివారం నాడు హైదరాబాద్ ప్రెస్ క్లబ్ సర్వసభ్య సమావేశం అధ్యక్షుడు ఎస్. విజయకుమార్ రెడ్డి అధ్యక్షతన జరిగింది. ప్రెస్ క్లబ్ సీనియర్



జర్నలిస్టులు, సభ్యులు హాజరయ్యారు. ఏడాది కాలంలో మరణించిన ప్రెస్ క్లబ్ సభ్యులకు సర్వసభ్య సమావేశంలో శ్రద్ధాంజలి ఘటించి ఘనంగా నివాళులర్పించారు.ప్రెస్ క్లబ్ స్థలం లీజు వెంటనే కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతూ ప్రెస్ క్లబ్ ఏజీఎం ఏకగ్రీవంగా తీర్మానించింది. అర్హులైన జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు కేటాయించాలని దీనికోసం అన్ని జర్నలిస్టు సంఘాలను, యూనియన్లను కలుపుకొని కార్యాచరణ ప్రణాళిక అమలు చేసేందుకు కార్యవర్గం తీర్మానం ఆమోదించింది. అర్హులైన జర్నలిస్టులందరికీ హెల్త్ కార్డులను వెంటనే మంజూరు చేయాలని, వయోధిక పాత్రికేయులకు పెన్షన్లను ఇవ్వాలని ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వంపై యాక్షన్ ప్లాన్ రూపొందించాలని ప్రెస్ క్లబ్ ఏజీఎం తీర్మానించింది. ప్రెస్ క్లబ్ సర్వసభ్య సమావేశంలో ప్రధాన కార్యదర్శి రమేష్ వరికుప్పల, ఉపాధ్యక్షులు ఏ.రాజేష్, అరుణ అత్తలూరి, సంయుక్త కార్యదర్శి చిలుకూరి హరిప్రసాద్ , వర్ధిల్లి బాపూరావు, కోశాధికారి రమేష్ వైట్ల, ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబర్లు ముత్యాల సత్తిబాబు, ఎం. రమాదేవి, రచన ముడుంబై, వనం.నాగరాజు, ఎన్. శ్రీనివాస్ రెడ్డి, అమిత్ బట్టు, అశోక్ దయ్యాల, రాజేశ్వరి కల్యాణం, శంకర్ శిగ సర్వసభ సమావేశంలో పాల్గొన్నారు. సీనియర్ జర్నలిస్టులు దేవులపల్లి అమర్, ఆర్ .శైలేష్ రెడ్డి, దిలీప్ రెడ్డి, రవి కాంత్ రెడ్డి సహా యూసుఫ్ బాబు తదితరులు హాజరయ్యారు. మరణించిన ప్రెస్ క్లబ్ సభ్యుడి కుటుంబానికి 50వేల రూపాయల ఆర్థిక సహాయం తక్షణం అందజేయాలని ప్రెస్ క్లబ్ సర్వసభ సమావేశం ఏకగ్రీవంగా తీర్మానించింది. సీనియర్ పాత్రికేయులు, జర్నలిస్టు నాయకులు దేవులపల్లి అమర్ ను ఈ సందర్భంగా హైదరాబాద్ ప్రెస్ క్లబ్ పాలకమండలి శాలువతో సత్కరించింది.

# విద్యార్థుల ఉద్యమానికి, ఓటు హక్కుల పరిరక్షణ పోరాటానికి సంపూర్ణ మద్దతు

## డా,జితేందర్ రావు తనుగుల



**అందోల్ నియోజకవర్గం ప్రతినిధి అక్టోబర్ 12 (ప్రజాబలం )సంగారెడ్డి జిల్లా:**రాజ్యాంగ పరిరక్షణ, ప్రజాస్వామ్య బలోపేతం, సామాజిక న్యాయం కోసం దేశ ప్రజలంతా ఐక్యంగా నిలవాలి దేశంలో రాజ్యాంగ పరిరక్షణ, ప్రజాస్వామ్య విలువల బలోపేతం, సామాజిక న్యాయం,కోసం విద్యార్థులు, ప్రజాస్వామ్యవాదులు చేస్తున్న పోరాటాలకు అన్ని వర్గాల ప్రజలు మద్దతు ఇవ్వాలని సీనియర్ జర్నలిస్ట్, తెలంగాణ యూత్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టి వై జె ఎఫ్ ) అధ్యక్షుడు డా. జితేందర్ రావు తనుగుల,విజ్ఞప్తి చేశారు,ఢిల్లీలోని జంతర్ మంతర్‌తో పాటు,దేశంలోని వివిధ ప్రాంతాల్లో విద్యార్థులు తమ హక్కులు, సమాన అవకాశాలు, సామాజిక న్యాయం కోసం నిర్వహిస్తున్న ఉద్యమాలకు ప్రజలు సంఘీభావం ప్రకటించాలని ఆయన కోరారు,మహాత్మా జ్యోతిరావు పూలే, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్,ఆశయాలను విశ్వసించే విద్యార్థులతో పాటు ప్రజాస్వామ్య, సామాజిక న్యాయ, భావజాలం కలిగిన యువత, మార్క్సిస్టు, కమ్యూనిస్టు,భావజాలాన్ని అనుసరించే విద్యార్థులు, రాజ్యాంగ విలువలను కాపాడాలని కోరుకునే ప్రజలందరూ శాంతియుత ఉద్యమాలకు అండగా నిలవాలని పేర్కొన్నారు.

అదేవిధంగా, దేశ ప్రజాస్వామ్యానికి పునాదిగా ఉన్న ఓటు హక్కును పరిరక్షించడం ప్రతి పౌరుడి బాధ్యత అని డా. జితేందర్ రావు తనుగుల,స్పష్టం చేశారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్ ) ప్రక్రియలో అర్హులైన ఓటర్ల పేర్లు తొలగించబడుతున్నాయనే ఆందోళనల నేపథ్యంలో, ఓటు హక్కుల పరిరక్షణ కోసం, సిటిజెన్స్ ఫర్ జస్టిస్ అండ్ పీస్ (సీజెపి ) చేస్తున్న పోరాటానికి తన సంపూర్ణ మద్దతు ప్రకటించారు,ఓటర్ల జాబితాల సవరణ పారదర్శకంగా, చట్టబద్ధమైన నిబంధనలకు అనుగుణంగా జరగాలని ఆయన కోరారు,అర్హులైన ఏ పౌరుడూ తన ఓటు హక్కును కోల్పోకుండా ఎన్నికల అధికారులు, తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు, పొరపాటున ఓటర్ల జాబితా నుంచి పేర్లు తొలగించబడితే, బాధితులకు అభ్యంతరాలు తెలిపేందుకు, తమ పేర్లను తిరిగి చేర్చుకునేందుకు చట్టబద్ధమైన అవకాశం కల్పించాలని పేర్కొన్నారు,సర్,ప్రక్రియలో అవకతవకలు లేదా నిర్లక్ష్యం జరిగినట్లు ఆధారాలతో నిర్ధారణ అయితే, బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు, ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌పై చర్యలు తీసుకోవాలనే డిమాండ్‌తో,సహా ఈ వ్యవహారానికి సంబంధించి వచ్చిన ఆరోపణలు, ఫిర్యాదులను, నిష్పక్షపాతంగా పరిశీలించాలని, తప్పిదాలు నిర్ధారణ అయిన పక్షంలో చట్టప్రకారం తగిన చర్యలు చేపట్టాలని కోరారు.బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ,లతో పాటు అగ్రవర్ణాలు, ఓసీలు,సహా అన్ని సామాజిక వర్గాల ప్రజలు విద్యార్థుల న్యాయమైన డిమాండ్లకు, అర్హులైన పౌరుల ఓటు హక్కుల పరిరక్షణకు మద్దతుగా నిలవాలని ఆయన విజ్ఞప్తి చేశారు,ఈ అంశాలు ఏ ఒక్క కులానికి, మతానికి లేదా రాజకీయ భావజాలానికి మాత్రమే పరిమితమైనవి కావని, దేశంలోని ప్రతి పౌరుడి హక్కులు, భవిష్యత్తుతో ముడిపడి ఉన్నాయని అభిప్రాయపడ్డారు,రాజ్యాంగం కల్పించిన హక్కులను కాపాడటం, ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయడం, విద్యార్థుల న్యాయమైన డిమాండ్లకు మద్దతు ఇవ్వడం, అర్హులైన ప్రతి పౌరుడి ఓటు హక్కును పరిరక్షించడం దేశ ప్రజలందరి బాధ్యత అని డా. జితేందర్ రావు తనుగుల పేర్కొన్నారు. సమానత్వం, సోదరభావం, సామాజిక న్యాయం ఆధారంగా సమాజ నిర్మాణం జరగాలంటే ప్రజలంతా ఐక్యంగా నిలవాలని పిలుపునిచ్చారు

# కొద్ది గంటల్లోనే హత్య కేసు ఛేదన

## మృతుడి అల్లుడితో సహా నలుగురు నిందితుల అరెస్టు.. రూ.2 లక్షలు, నాలుగు సెల్‌ఫోన్లు స్వాధీనం

**జహీరాబాద్, అక్టోబర్ 12 ప్రజాబలం ప్రతినిధి:** జహీరాబాద్ మండలం తుంకుంట గ్రామ సమీప అటవీ ప్రాంతంలో జరిగిన మున్నూరు శ్రీనివాస్ హత్య కేసును చిరాగ్‌పల్లి పోలీసులు కొద్ది గంటల్లోనే ఛేదించారు. జహీరాబాద్ టౌన్ సీఐ రాజబోయిన రవి, ఎస్ఐ వినయ్ కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు వేగవంతంగా దర్యాప్తు చేపట్టి నిందితులను గుర్తించారు. ప్రాథమిక దర్యాప్తు వివరాల ప్రకారం.. మృతుడు శ్రీనివాస్ అల్లుడు ఎర్ర బసవరాజు (ఏ1) రూ.5 లక్షలు ఇచ్చి శ్రీనివాస్‌ను హత్య చేయించేందుకు ఒప్పందం కుదుర్చుకున్నట్లు పోలీసులు గుర్తించారు. బంటారం గ్రామానికి చెందిన జడల రమేష్ (ఏ2), జడల సుభాష్ (ఏ3),






పరిగి మురళి (ఏ4)తో కలిసి ఈ హత్యకు పథకం రచించినట్లు వెల్లడైంది. నిందితులు శ్రీనివాస్ ఆటోను అద్దెకు తీసుకుని తుంకుంట సమీప అటవీ ప్రాంతానికి వెళ్లారు. అక్కడ శ్రీనివాస్‌పై దాడి చేసి హత్య చేసినట్లు విచారణలో తేలింది. నేరానికి సంబంధించిన ఆధారాలను ధ్వంసం చేసేందుకు మృతదేహం, ఆటోపై పెట్రోల్ పోసి నిప్పంటించినట్లు పోలీసులు తెలిపారు. కేసును వేగంగా ఛేదించిన పోలీసులు నిందితుల నుంచి రూ.2 లక్షల నగదు, నాలుగు సెల్‌ఫోన్లు, హత్యకు ఉపయోగించిన ఆయుధాలు, ఒక మోటార్‌సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసు ఛేదనలో సమర్థంగా పనిచేసిన సీఐ రాజబోయిన రవి, ఎస్ఐ వినయ్ కుమార్‌తో పాటు కానిస్టేబుళ్లు రాకేష్, హరినేత్ర, ఓం దేవ్, అస్లాంలను ఉన్నతాధికారులు అభినందించారు.

# ప్రజావాణి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలి.

## జిల్లా అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు.



**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి అక్టోబర్ 12 కలెక్టరేట్**సోమవారం నూతన సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి ఆయన దరఖాస్తులను స్వీకరించారు. భూ సమస్యలకు సంబంధించి 05, ఇందిరమ్మ ఇళ్లకు 01, పింఛన్లకు 01, ఉద్యోగాలకు 02, ఇతర శాఖలకు సంబంధించి 05, మొత్తం 14 దరఖాస్తులు అందాయి.



ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణిలో అందిన దరఖాస్తులను సంబంధిత శాఖల అధికారులు పరిశీలించి, త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఎల్‌నినో నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా ఉండాలి

## ఆరుతడి పంటల సాగుకు ప్రాధాన్యమివ్వాలి: రాష్ట్ర వ్యవసాయ శాఖ సూచన



**మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ప్రతినిధి ప్రజాబలం, అక్టోబర్ 12:** ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సోమవారం అలియాబాద్ రైతు వేదికలో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు రాష్ట్రంలోని అన్ని రైతు వేదికల ద్వారా రైతులతో ఈ కార్యక్రమంలో మాట్లాడారు.

ఎల్‌నినో ప్రభావం కారణంగా వాతావరణ పరిస్థితుల్లో మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉన్నందున రైతులు రానున్న ఎనిమిది నెలలపాటు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని ఆరుతడి పంటల సాగుకు ప్రాధాన్యమివ్వాలని, అందుబాటులో ఉన్న నీటిని పొదుపుగా వినియోగించుకోవాలని వివరించారు.ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి చంద్రకళ, జిల్లా ఉద్యానవన అధికారి శ్రీధర్, మండల వ్యవసాయ అధికారి రమేష్, ఉద్యానవన అధికారి వెంకట్ రమణ, పశువైద్యాధికారి, వ్యవసాయ విస్తరణ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

# దేశ ప్రజల కోసం రాహుల్ గాంధీ వీధుల్లోకి వచ్చి పోరాటం చేస్తుండు

## మనం ఇళ్లల్లో పడుకుందామా జగ్గారెడ్డి

## సంగారెడ్డి ర్యాలీలో స్పష్టం చేసిన జగ్గారెడ్డి

**అందోల్ నియోజకవర్గం ప్రతినిధి అక్టోబర్ 12 (ప్రజాబలం) సంగారెడ్డి జిల్లా:**రాహుల్ గాంధీకి, మద్దతుగా మనమందరం వీధుల్లోకి రావాల్సిందే, మన అధినేత రాహుల్ గాంధీ, ఢిల్లీ రోడ్ల పై ఉంటే మనం ఇళ్లలో పడుకోవడం క్ ెం ేక్ట నా , ొా ఎ్ ా ల్ గాంధీ,పోరాటానికి,కాంగ్రెస్ కార్యకర్తలతో పాటు దేశ ప్రజలందరూ మద్దతు ఇవ్వాలి దేశం లో ఓట్ చోరీ జరుగుతుంది,బీజేపీ ప్రజల హక్కులను కాలరాస్తోంది,ఇదే విషయాన్ని ప్రతీ ఒక్క కాంగ్రెస్ కార్యకర్త మరో పదిమందికి ప్రచారం చేయాలి,జ్ఞానేష్ కుమార్,రాజీనామా చేసే వరకు రాహుల్ గాంధీ, పోరాటం ఆపబోనని ప్రకటించారు,ఆయన డిమాండ్ నెరవేరేవరకు ఆయనకు మద్దతుగా సంగారెడ్డి లో నాపోరాటం కొనసాగుతునే ఉంటుంది సంగారెడ్డిలో రాహుల్ గాంధీ,కి మద్దతుగా జరిగిన భారీ ర్యాలీలో స్పష్టం చేసిన జగ్గారెడ్డి...



# ఎలినినో ప్రభావానికి అతలాకుతలమవుతున్న కూలీలు



**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి అక్టోబర్ 12 ఏటూరు నాగారం** భానుడి ప్రతాపానికి భగ భగ మంటూ మంటలు చెలరేగుతుంటేప్రజలంతా విలవిలాడుతున్నారూ తెలంగాణ రాష్ట్ర మంతా ఎండలు మండిపోవడం తో వర్షాలు లేక రైతులు నానా అవస్థలు పడుతున్నారు పత్తికి మిర్చికి వరికి చెరువులలో నీరు లేక బిందెలతో నీళ్ల పోయవలసిన పరిస్థితి కనబడుతుంది ముఖ్యంగా ములుగు జిల్లాలో చెరువులు నిండకపోవడంతో తక్కువ వర్షపాతంతో వరి పొలాలలో నాటు వేసుకొని చేతికి వచ్చిన పంటను ఈరోజు వర్షపు నీరు లేక ఎండ పెట్టుకోవాల్సిన పరిస్థితి తెలంగాణలో కనబడుతుంది ముఖ్యంగా పగలంతా కష్టపడి పనిచేసే రైతులు సోదరులు ఈ ఎండలకు పని చేయలేక నానా ఇబ్బందులు పడుతున్నారు ముఖ్యంగా మహిళలు మిర్చి పనులలో వరి పనులలో పత్తి చేనులలో పని చేయాలంటే కళ్ళు తిరిగి వడదెబ్బకు గురి కావలసిన పరిస్థితి కనబడుతుంది ఎండాకాలంలో ఉండే ఎండ కన్నా ఇప్పుడు మరింత ఎక్కువగా ఉందని ఆ ఎండ తాకిడికి శరీరముపై బొబ్బలు ఏర్పడుతున్నాయని కూలీలు చెప్తున్నారు ఎండకు బయటికి రావాలన్న బాటసారిలు ప్రయాణికులు సాయంత్రం సమయానికి బయలుదేరి చల్లటి వాతావరణంలోకి వెళ్లవలసిన పరిస్థితి చలికాలంలో కనబడుతుంది మంచు లేకపోవడం ఎండలు ఎక్కువ కావడం దీనితో వాతావరణంలో మార్పులు ఇక ముందు ముందు ఏ లాంటి సమస్యలు ఎదురవుతాయని రైతులు కంటతడి పెట్టుకుంటున్నారు

## కరెంట్ షాక్ తగిలి చికిత్స పొందుతున్న ఎస్కే షరీఫ్ ను పరామర్శించిన జిల్లా ఆత్మ కమిటీ చైర్మన్ చిటమట రఘు



**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి అక్టోబర్ 12 ఏటూరు నాగారం** ఏటూరు నాగారం మండల కేంద్రంలో ని అప్పాపురం గ్రామానికి చెందిన ఎస్కే షరీఫ్ కొబ్బరికాయల కోసం కొబ్బరి చెట్టు ఎక్కగా చెట్టుకొమ్మలు కరెంటు వైర్లు తగిలి కరెంట్ షాక్ రావడంతో చెట్టుపై నుంచి పడి చిటికెనబ్రీలు పూర్తిగా కరెంటు షాక్ తగిలి కాలిపోయింది అట్లాగా అరచేతిలో కూడా బొబ్బలు రావడంతో అక్కడున్న వారు అంబులెన్స్ ఫోన్ చేసి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు సమాచారం తెలుసుకున్న ఆత్మ చైర్మన్ చిటమట రఘు హాస్పిటల్ క వెళ్లి హుస్సేన్ ఆరోగ్య పరిస్థితి డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు మెరుగైన చికిత్స కోసం ములుగు పంపినట్లు తెలిపారు ఈ కార్యక్రమంలో రాజు భరత్ తదితరులు పాల్గొన్నారు

## ఉద్యోగ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి

**ఎస్సై, కానిస్టేబుల్ ఉచిత శిక్షణ తరగతులు ప్రారంభం**

**అభ్యర్థులకు ఆర్డీవో దేవుజ, డీఎస్పీ బి.సైదా సూచన**

**జహీరాబాద్, అక్టోబర్ 12 ప్రజాబలం ప్రతినిధి:** పోలీసు ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న అభ్యర్థులు అందుబాటులో ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని లక్ష్యాన్ని సాధించాలని ఆర్డీవో దేవుజ, డీఎస్పీ బి.సైదా సూచించారు. సంగారెడ్డి జిల్లా కలెక్టర్, ఎస్పీ ఆధ్వర్యంలో జహీరాబాద్‌లోని ఆర్ఎల్ఆర్ పాఠశాలలో సోమవారం ఎస్సై, కానిస్టేబుల్ ఉద్యోగాల ఉచిత శిక్షణ తరగతులను వారు ప్రారంభించారు.




265 మందికి శిక్షణ



ఎస్సై, కానిస్టేబుల్ ఉద్యోగాల ఉచిత శిక్షణ కోసం గతంలో దరఖాస్తు చేసుకున్న 588 మంది అభ్యర్థులకు స్క్రీనింగ్ పరీక్ష నిర్వహించారు. ఇందులో అర్హత సాధించిన 265 మందిని శిక్షణకు ఎంపిక చేశారు. వీరికి 45 రోజులపాటు నిపుణులైన అధ్యాపకులతో ప్రత్యేక తరగతులు నిర్వహించనున్నారు. పోటీ పరీక్షల్లో మెరుగైన ప్రతిభ కనబరిచేలా అభ్యర్థులకు అవసరమైన శిక్షణ అందించనున్నారు.

లక్ష్యంతో చదివితే విజయం

ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ పోలీసు ఉద్యోగాలు సాధించాలనే లక్ష్యంతో ఉన్న అభ్యర్థులు శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. క్రమశిక్షణ, పట్టుదల, నిరంతర సాధనతో పోటీ పరీక్షల్లో విజయం సాధించవచ్చన్నారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలను క్రమం తప్పకుండా అభ్యసిస్తూ పరీక్షలకు సన్నద్ధం కావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎల్ఆర్ పాఠశాల వ్యవస్థాపకుడు డాక్టర్ ఆర్.లక్ష్మారెడ్డి, జహీరాబాద్ పట్టణ సీఐ రవి, గ్రామీణ సీఐ నరసింహా, సబ్ డివిజన్ ఎస్సైలు తదితరులు పాల్గొన్నారు.

## దేవరపల్లిలో పులి కలకలం – దూడను చంపిన పెద్దపులి

దేవరపల్లి (తూ.గో. జిల్లా) దేవరపల్లి మండలం కృష్ణంపాలెం గ్రామంలో పెద్దపులి సంచారం కలకలం రేపింది. వనంలో నుంచి జనావాసాల్లోకి వచ్చిన పెద్దపులి ఆదివారం రాత్రి పంట పొలాల్లో గేదె దూడపై దాడి చేసి చంపేసింది. వివరాల్లోకి వెళితే.. కృష్ణంపాలెం గ్రామ శివారు పంట పొలాల్లో మేతకు వెళ్లిన గేదె దూడపై పులి ఒక్కసారిగా దాడి చేసింది. దూడ అక్కడికక్కడే మృతి చెందడంతో రైతులు భయాందోళనకు గురయ్యారు. విషయం తెలుసుకున్న అటవీశాఖ అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరిక జారీ చేశారు.

# నీరు, విద్యుత్‌ను పొదుపుగా వినియోగించాలి.

**రైతులు ఆరుతడి పంటల సాగుకు ప్రాధాన్యం ఇవ్వాలి.**

**అదనపు కలెక్టర్ రెవిన్యూ సి.హెచ్. మహేందర్ జి.**

**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి అక్టోబర్ 12 కలెక్టరేట్** ఎల్‌నినో ప్రభావంతో ఆశించిన స్థాయిలో వర్షపాతం నమోదు కానందున రైతులు ఆరుతడి పంటల సాగుకు ప్రాధాన్యం సాగునీటి లభ్యతకు అనుగుణంగా పంటలను ఎంచుకొని, నీరు, విద్యుత్‌ను పొదుపుగా వినియోగించాలని తెలిపారు.



సోమవారం ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు హైదరాబాదు నుంచి పలువురు ఉన్నతాధికారులతో కలిసి రైతు నేస్తం కార్యక్రమంలో భాగంగా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల్లోని రైతు వేదికల్లో పాల్గొన్న సంబంధిత శాఖల అధికారులు, రైతులకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఎల్‌నినో ప్రభావం, వర్షపాతం లోటు, సాగునీటి లభ్యత, ఆరుతడి పంటల సాగుపై దిశానిర్దేశం చేశారు.




ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ రబీ సీజన్లో ఎట్టి పరిస్థితుల్లో రైతులు వరి సాగు చేయవద్దన్నారు. బిందు సేద్యంతో పామ్ తోటలు, కూరగాయలు వంటి స్వల్పకాలిక పంటలను సాగు చేయవచ్చన్నారు. జలసిరి కార్యక్రమంలో భాగంగా ఇంకుడు గుంతలు, నీటి కుంటలు, బోర్వెల్స్ రీఛార్జ్, తదితర పనులను చేపట్టి జలవనరులను కాపాడుకోవాలన్నారు.

రాష్ట్రంలో అధిక మండలాల్లో వర్షపాతం తక్కువగా ఉందని, ప్రభుత్వం త్వరలోనే కరువు మండలాలను ప్రకటిస్తుందన్నారు. వచ్చే వర్షాకాలం నాటికి తాగునీటి సమస్యలు ఉత్పన్నమవ్వకుండా నీటిని పొదుపుగా వాడాలని సూచించారు. వ్యవసాయానికి విద్యుత్ సరఫరాపై సరైన ప్రణాళికతో ముందుకెళ్లాలన్నారు.

భూగర్భ జల శాఖ అధికారులు ఎప్పటికప్పుడు గ్రౌండ్ లెవెల్ నివేదికలను అందజేయాలన్నారు. ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి అవసరమైన చర్యలు చేపడుతుందన్నారు.

ఈ కార్యక్రమాన్ని ములుగు జిల్లాలోని 22 రైతు వేదికల్లో ప్రత్యక్ష ప్రసారం ద్వారా పలు శాఖల అధికారులు, గ్రామస్తులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ను తిలకించారు. కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి అదనపు కలెక్టర్ రెవిన్యూ సి హెచ్ మహేందర్ జి, అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు తో కలిసి హాజరయ్యారు.

వీసి అనంతరం అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ సూచనలను అనుసరించి రైతులు ఆరుతడి పంటలను సాగు చేయాలని తెలిపారు. ఎల్ నినో వంటి పరిస్థితులను ఎదుర్కొనేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించి అమలు చేయడం జరుగుతుందన్నారు. ఆరుతడి పంటల సాగుపై రైతులకు పెద్ద ఎత్తున అవగాహన కలిగేందుకు విస్తృతంగా అన్ని మాధ్యమాల ద్వారా, కళాజాత బృందాలతో ప్రచార కార్యక్రమాలు కూడా నిర్వహిస్తామన్నారు. రైతులు నష్ట పోకుండా ముందస్తుగా అప్రమత్తం చేసేందుకు జిల్లా అధికార యంత్రాంగం, ప్రజాప్రతినిధులు కృషి చేస్తారని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు.

ఈ నేపథ్యంలో సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ వర్షాభావ పరిస్థితులు, నీటి వినియోగం, ఆరుతడి పంటల సాగుపై క్షేత్రస్థాయిలో రైతులకు మార్గనిర్దేశం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి వెంకయ్య, డి ఆర్ డి ఓ రవీందర్, డి సి ఎస్ ఓ ఫైజల్ హుస్సేన్, డి ఎం డి సి ఎస్ ఓ క్రిష్ణ వేణి, డి ఎంహెచ్ ఓ గోపాలరావు, సి పి ఓ జవహర్, డిపి ఆర్ ఓ రఫిక్, తదితరులు పాల్గొన్నారు.

## సి ఎస్ సంజయ్ జాజు , బట్టి విక్రమార్క , తుమ్మల నాగేశ్వరరావు నిర్వహించిన టెలి కాన్ఫరెన్స్ లో జిల్లా ఆత్మ కమిటీ చైర్మన్ చిటమట రఘు



**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి అక్టోబర్ 12 ఏటూరు నాగారం** సోమవారం రైతు వేదికలో ఏర్పాటుచేసిన టెలికాన్ఫరెన్స్లో ఎలోనినో ప్రభావంతో వ్యవసాయ రంగంలో ఎదుర్కొంటున్న పరిస్థితు పట్ల అధికారులు రైతులు ఎలాంటి పద్ధతులు పాటించాలి అధికారులు ప్రభుత్వము చెప్పిన సలహాలను సూచనలను రైతులు పాటించాలని కోరారు

ఆరుతడి పంటల వైపు రైతులను ముగ్గు చూసే విధంగా రైతన్న చర్యలు తీసుకునే విధంగా చేయాలని అధికారులు కోరినారు అదేవిధంగా గ్రామ గ్రామానా రైతందానికి ఆరు తడి పంటల పైన అవగాహన కల్పించి రైతులను ఆదుకునే విధంగా పనిచేయాలని అధికారులను కోరినారు

అదేవిధంగా ఎల్ నినో ప్రభావంతో భూగర్భ జలాలు అడుగంటి పోతాయి కాబట్టి ఖరీఫ్ సీజన్లో యాసంగి వైపు మొగ్గు చూపవద్దని ఆరుతడి పంటలు పెసలు బొబ్బర్లు మినుములు కందులు వేసుకోవాలని తెలియజేసినారు ఈ కార్యక్రమంలో ఏటూర్ నాగారం ఆత్మ కమిటీ చైర్మన్ కర్ల అరుణ ఏడి వేణుగోపాల్ ఏవో రాజ్ కుమార్ ఏవో రవికుమార్ హార్టికల్చర్ అధికారులు వెటర్నరీ రైతులు ,అధికారులు పాల్గొన్నారు

## మైనార్టీ అధ్యక్షులు నిజాముద్దీన్ కు ఘన సన్మానం.




**ఖమ్మం జిల్లా బ్యూరో ప్రజాబలం అక్టోబర్ 12:**కాంగ్రెస్ పార్టీ ముస్లిం మైనార్టీ సెల్ తల్లాడ మండల అధ్యక్షులుగా నియామకం అయిన షేక్ నిజాముద్దీన్ కు సోమవారం తల్లాడ ముస్లిం సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ముస్లిం మత పెద్దలు సదర్ అక్బర్, మౌలానా, ముజిద్ రెహమాన్ ఆధ్వర్యంలో ముస్లిం సోదరులు ఆయనను శాలువాలతో సన్మానించి సత్కరించారు. అనంతరం మాట్లాడుతూ ముస్లింలకు ఈ పదవి రావడం హర్షనీయమన్నారు. ముస్లింల సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని ఆకాంక్షించారు. ముస్లింలను గుర్తించి ఈ పదవి ఇవ్వటం పట్ల ముస్లిం సోదరులు వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ముస్లిం సోదరులు ఎండి ముస్తఫా, పటాన్ నాగులుమీరా, ఏన్కూర్ షేక్ నిజాముద్దీన్, డాక్టర్ సైదా ఖాజా మియా, షేక్ చాంద్ పాషా, జానీ, షేక్ జానీమియా, కాసింసా గిద్దే, మాజీ నాయక్ సదర్ షేక్ మెహరాజ్, షేక్. సైదులు తదితరులు పాల్గొన్నారు.

# జహీరాబాద్‌లో ఘనంగా శరన్నవరాత్రి ఉత్సవాలు

## భవానీ మందిరంలో ప్రత్యేక పూజలు.. భక్తుల సందడి

## ఈ నెల 12 నుంచి 17 వరకు నియోజకవర్గస్థాయి భజన పోటీలు

**జహీరాబాద్, అక్టోబర్ 12 ప్రజాబలం ప్రతినిధి:** సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణంలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. పట్టణంలోని ప్రసిద్ధ భవానీ మందిరంలో అమ్మవారిని వివిధ రకాల పుష్పాలతో సుందరంగా అలంకరించి ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు. అమ్మవారి దర్శనం కోసం భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి తరలివచ్చారు. దీంతో ఆలయ పరిసరాలు





భక్తులతో సందడిగా మారాయి. తొమ్మిది రోజులపాటు నిర్వహించనున్న ఈ ఉత్సవాల్లో భాగంగా ప్రతిరోజూ అమ్మవారికి ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించనున్నారు. భక్తులు కుటుంబ సమేతంగా ఆలయానికి చేరుకుని అమ్మవారిని దర్శించుకుంటున్నారు. తమ కుటుంబాలు సుఖసంతోషాలతో ఉండాలని, ప్రజలందరికీ అమ్మవారి ఆశీస్సులు కలగాలని భక్తులు ప్రార్థిస్తున్నారు. భక్తిశ్రద్ధలతో సాగుతున్న పూజా కార్యక్రమాలతో ఆలయ పరిసరాల్లో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.

**భక్తులకు ప్రత్యేక ఏర్పాట్లు**

దేవి శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని ఆలయ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అవసరమైన ఏర్పాట్లు చేశారు. అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టారు. ఉత్సవాలు విజయవంతంగా నిర్వహించేందుకు నిర్వాహకులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. రానున్న రోజుల్లో భక్తుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉండటంతో అందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేస్తున్నారు.

**12 నుంచి భజన పోటీలు**

శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా భవానీ మందిరంలో నియోజకవర్గస్థాయి భజన పోటీలను నిర్వహించనున్నారు. ఈ నెల 12వ తేదీ నుంచి 17వ తేదీ వరకు పోటీలు కొనసాగనున్నాయి. భక్తిభావాన్ని పెంపొందించడంతోపాటు భజన మండళ్లలోని కళాకారులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ఈ పోటీలను ఏర్పాటు చేస్తున్నారు.

ఈ పోటీల్లో నియోజకవర్గ పరిధిలోని భజన బృందాలు పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించనున్నాయి. భక్తి గీతాలు, భజనలతో ఉత్సవాలకు మరింత ఆధ్యాత్మిక శోభ చేకూరనుంది. పోటీల్లో ప్రతిభ కనబరిచిన బృందాలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను అందజేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

**ఉత్సవాలకు తరలిరావాలని పిలుపు**

దేవి శరన్నవరాత్రి ఉత్సవాలను భక్తులందరూ విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు. భజన పోటీల్లో పాల్గొనే బృందాలు తమ ప్రతిభను చాటుకోవాలని పిలుపునిచ్చారు. తొమ్మిది రోజులపాటు జరిగే ఉత్సవాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ఆమె కృపాకటాక్షాలకు పాత్రులు కావాలని ఆకాంక్షించారు. భవానీ మందిరంలో జరుగుతున్న ప్రత్యేక పూజలు, భజన కార్యక్రమాలతో జహీరాబాద్ పట్టణంలో ఆధ్యాత్మిక సందడి నెలకొంది.

# గాయత్రీ దేవిగా దర్శనమిచ్చిన అమ్మవారు

## ప్రత్యేక పూజలు నిర్వహించిన మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ శిరీష సురేందర్‌రెడ్డి

**జహీరాబాద్, అక్టోబర్ 12 ప్రజా బలం ప్రతినిధి:** జహీరాబాద్ పట్టణంలోని మాణిక్ ప్రభు వీధిలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా రెండవ రోజు సోమవారం అమ్మవారు గాయత్రీ దేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణాన్ని అలంకరించి, ఉదయం అమ్మవారిని గాయత్రీ దేవిగా సర్వాంగసుందరంగా అలంకరించారు. అనంతరం అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. గాయత్రీ దేవి అలంకరణలో అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. భక్తులు అమ్మవారికి మొక్కులు చెల్లించుకుని, కుటుంబ సభ్యులు సుఖసంతోషాలతో ఉండాలని ప్రార్థించారు. నవరాత్రి ఉత్సవాల సందర్భంగా వీధిలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా జహీరాబాద్ మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ శిరీష సురేందర్‌రెడ్డి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవాలు విజయవంతంగా కొనసాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు, స్థానిక భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# ఆపదలో ఉన్న కుటుంబాలకు అండగా ఆర్థిక సహాయం రావులపల్లి సర్పంచ్ శ్రీకాంత్ రెడ్డి





**నికరబన్ నియోజకవర్గ ప్రతినిధి అక్టోబర్ 12(ప్రజాబలం) వికారాబాద్ జిల్లా;** తిమ్మాపూర్‌లో నలుగురు బాధిత కుటుంబాలకు రూ.20 వేల ఆర్థిక సహాయంఆపదలో ఉన్న పేద కుటుంబాలకు అండగా నిలుస్తూ మానవతా దృక్పథంతో మర్పల్లి మండల బి ఆర్ ఎస్ పార్టీ మాజీ అధ్యక్షులు, రావులపల్లి సర్పంచ్ కాంత్ రెడ్డి ఆర్థిక సహాయం అందించారు.మర్పల్లి మండల పరిధిలోని తిమ్మాపూర్ గ్రామానికి చెందిన చంద్రన్నపల్లి జంగమ్మ, కావాలి పద్మమ్మ, మోముల రసమ్మ, మోముల అంతమ్మ ఇటీవల మరణించిన విషయం తెలుసుకున్న శ్రీకాంత్ రెడ్డి, తిమ్మాపూర్ మాజీ సర్పంచ్ శేఖర్‌తో కలిసి సోమవారం వారి నివాసాలకు వెళ్లి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేసి, వారికి మనోధైర్యం కల్పించారు.అనంతరం ఒక్కో కుటుంబానికి రూ.5,000 చొప్పున మొత్తం రూ.20,000 ఆర్థిక సహాయం అందజేశారు. కష్టకాలంలో బాధిత కుటుంబాలకు అండగా నిలవడం, వారి బాధలో పాలుపంచుకోవడం సామాజిక బాధ్యతగా భావించి ఈ సహాయం అందించినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ పాండు, గ్రామ పార్టీ అధ్యక్షుడు అశోక్, నాయకులు జె. రాజు, కావాలి మానయ్య, ఎం. కాళేశ్వరం తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాస్వామ్యంలో ప్రశ్నించడం ప్రతి పౌరుడి హక్కు సమాచారం చెప్పడం ప్రభుత్వ వ్యవస్థల బాధ్యత





ప్రజాస్వామ్యంలో ప్రశ్నించడం ప్రతి పౌరుడి హక్కు అని... సమాచారం చెప్పడం ప్రభుత్వ వ్యవస్థల బాధ్యత అని సమాచార హక్కు పరిరక్షణ సమితి, ఎలక్షన్ వాచ్ కమిటీ జాతీయ ఛైర్మెన్ డా.బొమ్మరబోయిన కేశవులు ముదిరాజ్ తెలిపారు. సమాచార హక్కు చట్టం-2005 ఇరవై ఒకటవ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం హైదరాబాద్ లోని సోమాజిగూడ ప్రెస్ క్లబ్ సమావేశ మందిరంలో సమాచార హక్కు చట్టం పై ఏర్పాటు చేసిన అవగాహన సదస్సుకు ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. సమాచార హక్కు చట్టం ద్వారా అవినీతికి అడ్డుకట్ట వేయవచ్చని చెప్పారు. పాలనలో పారదర్శకతకు ఈ చట్టం దోహదపడుతుందని చెప్పారు. ప్రజల సొమ్ము ప్రజల కోసమే అని తెలిపారు. ప్రజలు ప్రభుత్వానికి భయపడే పరిస్థితి కాకుండా, ప్రభుత్వ వ్యవస్థలు ప్రజలకు జవాబుదారీగా ఉండే పరిస్థితి ఏర్పడాలన్నారు. 2005 అక్టోబర్ 12వ తేదీ భారత ప్రజాస్వామ్య చరిత్రలో ముఖ్యమైన సమాచార హక్కు చట్టం అమలు లోకి వచ్చిన రోజు అని వివరించారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన శాసన మండలి డిప్యూటీ స్పీకర్ బండ ప్రకాష్ మాట్లాడుతూ

ప్రభుత్వ వ్యవహారాల్లో పారదర్శకతను పెంచడం, అధికారుల్లో జవాబుదారీతనాన్ని బలోపేతం చేయడం ముఖ ఉద్దేశ్యంతో సమాచార హక్కు చట్టం తెచ్చారని చెప్పారు. ప్రజాస్వామ్యం అంటే పౌరుడి గొంతుకు విలువ ఉండడం అని చెప్పారు. భారత రాజ్యాంగం మనకు ప్రజాస్వామ్య వ్యవస్థను అందించిందని, దానిని మరింత అర్థవంతంగా మార్చుకోవడానికి సమాచార హక్కు చట్టం శక్తివంతమైన మార్గం అని వివరించారు.

ఈ సందర్భంగా డా.కేశవులు ముదిరాజ్ సమాచార హక్కు కోసం చేస్తున్న కృషినీ అభినందించారు. ఆయనకు సరైన గుర్తింపు ఇవ్వాలన్నారు. కమిషనర్ పోస్టులు కేశవులు ఇలాంటి వ్యక్తులకు ఇవ్వాలని కోరారు. ఉమ్మడి తెలుగు రాష్ట్రాల హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ గ్రంధి భవానీ ప్రసాద్ మాట్లాడుతూ

సమాచార హక్కు చట్టం అంటే ప్రభుత్వ ప్రజా అధికార వ్యవస్థల వద్ద ఉన్న సమాచారాన్ని చట్ట ప్రకారం పొందే హక్కు అని తెలిపారు. సమాచార హక్కు చట్టం అనేది అధికారులను ఇబ్బంది పెట్టే ఆయుధం కాదని, ప్రజా వ్యవస్థలను బాధ్యతాయుతంగా పనిచేయించే ప్రజాస్వామ్య సాధనం అని వివరించారు.

మన ఉద్దేశం ప్రజా ప్రయోజనానికి అనుగుణంగా ఉండాలనీ, మనకు వచ్చిన సమాచారాన్ని బాధ్యతతో ఉపయోగించాలనీ వివరించారు. ప్రతి పౌరుడు సమాచార హక్కును తెలుసుకోవాలనీ సూచించారు.

ప్రతి విద్యార్థి ఈ చట్టం గురించి చదవాలన్నారు. సమాచార హక్కు చట్టం పై, ఓటర్ చైతన్యం పై డాక్టర్.కేశవులు ముదిరాజ్ చేస్తున్న కృషిని కొనియాడారు. తెలంగాణ మన ముదిరాజ్ మహాసభ రాష్ట్ర అధ్యక్షులు చొప్పరి శంకర్ ముదిరాజ్, ప్రధాన కార్యదర్శి శివయ్య ముదిరాజ్ లు మాట్లాడుతూ ప్రభుత్వాలు పదవుల్లో బీసీ లకు అన్యాయం చేస్తున్నాయని చెప్పారు. సమాచార హక్కు చట్టం పై ఎన్నో సంవత్సరాలు గా ప్రజలను చైతన్యం చేస్తున్న డా.కేశవులు ముదిరాజ్ ను ప్రభుత్వ గుర్తించాలని విజ్ఞప్తి చేశారు. ఆయనకు కమిషనర్ పోస్టులో గానీ, ఏంఎల్సీ గా గానీ అవకాశం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సమాచార హక్కు పరిరక్షణ సమితి, ఎలక్షన్ వాచ్ కమిటీ వెబ్ సైట్ ను శాసన మండలి డిప్యూటీ స్పీకర్ డా.బండ ప్రకాష్ ఆవిష్కరించారు. సమాచార హక్కు చట్టం పుస్తకాలను విశ్రాంత హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ గ్రంధి భవానీ ప్రసాద్ ఆవిష్కరించారు. సమాచార హక్కు చట్టం కరపత్రాలను విశ్రాంత ఐఏఎస్ బీ.లక్ష్మీ కాంతం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తెలంగాణ సాంస్కృతిక కళాకారులు ఆట, పాటల తో ఉత్సాహపరిచారు. ఈ కార్యక్రమంలో సమాచార హక్కు పరిరక్షణ సమితి, ఎలక్షన్ వాచ్ కమిటీ నాయకులు గాడిపల్లి మధు, పాల్గొని శివాజీగౌడ్, శ్రీనివాస్ రెడ్డి, బాలకృష్ణ, మేకల శ్రీహరి, నరసింహ , మధుకర్, జితేందర్, రాజేష్, సోనారాణి, తండ కుమారస్వామి, పుట్ట విజయ్ కుమార్, మెట్టు మధు, కల్వల హరికృష్ణ, కాసుల అజయ్ కుమార్, కారింగు వెంకన్న, పేరిక చందు, వివిధ రాష్ట్రాల , జిల్లాల కన్వీనర్లు, కోఆర్డినేటర్లు, తదితరులు పాల్గొన్నారు.

అవినీతిని అరికట్టడానికి ప్రజల చైతన్యం అవసరం అని సూచించారు. ప్రజల చైతన్యానికి సమాచారం అవసరం అని, సమాచారాన్ని బాధ్యతతో వినియోగించడానికి చట్టంపై అవగాహన అవసరం అని తెలిపారు. ప్రజాస్వామ్యం అనేది కేవలం పార్లమెంటులోనో, శాసనసభలోనో ఉండేది కాదనీ, మన వ్యవస్థలో ఉంటుందన్నారు. సమాచార హక్కు అనేది ప్రజల చేతిలో ఉన్న ఒక ప్రజాస్వామ్య సాధనం. సమాచారం కోసం అడిగే పౌరుడిని గౌరవించే సమాజం కావాలి. నిజాయితీగా పనిచేసే అధికారులను గౌరవించే సంస్కృతి రావాలి. తప్పు జరిగినప్పుడు ఆధారాలతో ప్రశ్నించే ధైర్యం కావాలి. తప్పును సరిదిద్దుకునే వ్యవస్థలు కావాలి అని చెప్పారు.

ప్రజల సొమ్ముకు లెక్క చెప్పే వ్యవస్థ రావాలని, ప్రజల హక్కులను గౌరవించే సమాజం కావాలన్నారు. దీని కోసం మనమందరం కలిసికట్టుగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా సమాచార హక్కు పరిరక్షణ సమితి, ఎలక్షన్ వాచ్ కమిటీ వెబ్ సైట్ ను ప్రారంభించారు. డీన్ తో పాటు సమాచార హక్కు చట్టంపై రూపొందించిన పుస్తకాలను, కరపత్రం ను ఆవిష్కరించారు.

. ఈ కార్యక్రమంలో సమాచార హక్కు పరిరక్షణ సమితి, ఎలక్షన్ వాచ్ కమిటీ నాయకులు గాడిపల్లి మధు, పాల్గొని శివాజీగౌడ్, శ్రీనివాస్ రెడ్డి, బాలకృష్ణ, మేకల శ్రీహరి, నరసింహ , మధుకర్, జితేందర్, రాజేష్, సోనారాణి, తండ కుమారస్వామి, పుట్ట విజయ్ కుమార్, మెట్టు మధు, కల్వల హరికృష్ణ, కాసుల అజయ్ కుమార్, కారింగు వెంకన్న, పేరిక చందు, వివిధ రాష్ట్రాల , జిల్లాల కన్వీనర్లు, కోఆర్డినేటర్లు, తదితరులు పాల్గొన్నారు.

Edited ,Printed Published & Owned by A.SRAVANTHI ,Printed at: SRAVANTHI ENTER PRISES 1-9-18/A,Ramnagar,Hyderabad - 500020, T.S
and Published at 5-2-518,Osmangunj ,Risala Abdulla,Hyderabad -95 Editor; A.SRAVANTHI, RNI NO ; TELTEL/2005/16755 Cell ; 92921 04449
Email;prajaabalamnews@gmail.com